డిసెంబర్ 2022

సంపుటి :18 సంచిక : 7

200

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు

## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

గోత్రాలు, వాటి పుట్టుపూర్వోత్తరాలు
ఆధునిక సోషలిస్టు దేశం దిశగా చైనా అడుగులు
అధికార కేంద్రీకరణ పెంచే టెలికాం ముసాయిదా బిల్లు
పర్యావరణ మార్క్సిజం - పర్యావరణ నాగరికత
మోడి నయవంచన, జగన్ దాసోహం
అస్థిరతలో అమెరికా ప్రజాస్వామ్యం
ఉమ్మడి పౌరస్మృతి సరే ఉమ్మడి నియమావళి మాటేమిటి?
కొరియా వర్కర్స్ పార్టీ : కొత్త శకంలో పార్టీ నిర్మాణం
భారతదేశంలో హిందూత్వ పునరాగమనం ఎలా జరిగింది?

మన గతం

# గోత్రాలు, వాటి పుట్టుపూర్వోత్తరాలు

పిబి చారి



రచయిత హైదరాబాద్‌లోని ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

గోత్రం అంటే మొదట్లో పశుశాల అని అర్థం. అంటే గోవులను కట్టివేసే కొట్టం లాంటిది. ఒక్కో గోత్రం వారు తమ పశువులు మారు పడకుండా ఒక్కొక్క రకం ముద్రలు పశువుల మీదకొట్టే వారు. ఆ విధంగా పశువులపై ఉమ్మడి యాజమాన్యం నెరిపేవారు. ఆ తర్వాత కాలంలో ఈ ఉమ్మడి పశువుల సమూహం భారత దేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఉమ్మడికుటుంబాలుగా మారాక, అందుకు తగినట్లుగా "గోత్ర"అనే మాటకు ప్రాముఖ్యత మారిపోయింది. దానితో గోత్రం అంటే గృహం, లేదా ఒక ఇంటి పేరు గల వారు లేదా ఒక శాఖ వారు అనే అర్థం వచ్చింది. కాలక్రమేణ వంశానికి మూల పురుషుడుని సూచించే పదంగా ఇది పరిణామం చెందింది. గోత్రాన్ని ఏదో ఒక రుషి పేరుతో పిలిచేవారు.

అశ్వలాయన శ్రౌత సూత్రాలలో అనేక గోత్రాలను ప్రస్తావించాడు. వత్స (దూడలు), శునక (కుక్కలు), రిక్క (ఎలుగు బంట్లు), భారద్వాజ (ఒక రకం పక్షులు), ముద్గల (ఒక రకం చేపలు), కపి (కోతులు), అజా (మేకలు), వేణు (వెదుళ్ళు), కాశ్యప (తాబేలు), శాండీల్య (ఒక రకం పక్షులు), గౌతమ (గోవులు), కుశక (గుడ్లగూబ), మండూక (కప్ప), ధర్భా (గడ్డి), తిత్తిర(చిలుక) ఇలా అనేక గోత్రాలను ప్రస్తావించాడు. ఇలా గోత్రాలకు ఏదో ఒక జంతువో, పక్షి పేరో సంకేతంగా ఉంటుంది. సప్తరుషులు నుండి వచ్చామని చెప్పుకునే వారికి 7 గోత్రాలు ఉండాలి. కానీ గోత్రాలు సంఖ్యను చూస్తే 50 నుంచి 73 వరకు ఉన్నాయి. దీని అర్థం ఏమిటి? బహుశా ఆర్యేతర తెగల నుండి ఉన్న పురోహితులను వైదిక మతం లోకి చేర్చుకొని వారికి ఒక్కొక్క తెగకు ఒక్కొక్క గోత్రం చొప్పున అరువుఇచ్చి ఉండవచ్చు. అందువల్లనే గోత్రాలు సంఖ్య పెరిగిపోయింది. మా గోత్రాలు రుషుల నుండి వచ్చాయని దబాయించే వారు ఈ రుషులు ఒకప్పుడు ఆటవిక సమాజ వ్యవస్థ కు చెందిన వారనే సంగతి విస్మరిస్తుంటారు. అసలు సప్తఋషుల జాబితాలే రెండు రకాలు ఉన్నాయి. ఒకదానికి ఒకటి పొంతన ఉండదు. మన దేశ జనాభాలో ఎక్కువ మంది ఆర్యులు కానీ జాతులకు చెందిన వారే. అంటే ఆటవిక జాతుల, తెగలకు చెందిన వారు. మనది మిశ్రమ సమాజం. మన ప్రజలు అనేక జాతుల తెగల కలగలుపు. ఆచారాలు జీవిత విధానాలు కూడా అంతే.

అయితే ఈ గోత్రనామాలతో జంతువుల పేర్లు లేక మొక్కలు, ఫలాల పేర్లు ఎందుకు ఉంటున్నాయి అన్న విషయాన్ని సమగ్రంగా పరిశీలించాలి. వేదాంతర సాహిత్యమైన వేదాంతంలో ఉపనిషత్తులు ఉన్నాయి. ఈ ఉపనిషత్తుల్లో ఒకటైన ఛాందోగ్యోపనిషత్తులో కొన్ని సునక మంత్రాలు కనిపిస్తాయి. ఈ ఉపనిషత్తు ప్రథమాధ్యాయంలో చాలా వినోదాన్ని కలిగించే సందర్భాన్ని వివరిస్తుంది.

సామవేదాన్ని గానం చేసే మంత్ర కర్తలను లేదా పురోహితులను పరిహసించే సన్నివేశం వర్ణితమైంది. ఆ రోజుల్లో "బకదాల్భ్యుడు"అనే ఋషి వేదాధ్యయనం కోసం ఏకాంతంలో ఉంటాడు. ఇతడిని "గ్వాల్ మైత్రేయుడు" అని కూడా అంటారు.

ఒక రోజున ఒక తెల్ల కుక్క అతడు ఉంటున్న ప్రదేశానికి వచ్చింది. మరికొంతసేపటికి మరి కొన్ని కుక్కలు అక్కడకు చేరాయి. ఆ కుక్కలు తెల్ల కుక్కతో ఇలా అన్నాయి. నువ్వు సామగానం చెయ్యి మాకు ఆహారం ఏమైనా దొరుకుతుందేమో అని అడుగుతాయి.

తెల్ల కుక్క ఆకలిగొన్న కుక్కలను మర్నాడు రమ్మన్నది. ఇది విని దాల్భ్యుడు ఆశ్చర్యపడ్డాడు. కుక్క ఎలా సామగానం చేస్తుందో వినాలని అనుకున్నాడు. మర్నాడు ఆ కుక్కలన్నీ అక్కడికి చేరాయి. ఒక దాని తోకను ఇంకొకటి నోటితో పట్టుకొని, వెనుక కాళ్ళ మీద కూర్చొని సామగానం చేయసాగాయి. ఓం మాకు ఆహారం లభించుగాక! ఓం మాకు నీరు లభించుగాక! ఓం అన్న దేవుడా! మాకు అన్నాన్ని పెట్టు! అది పెట్టు! ఇది పెట్టు! అని మొరగటం ప్రారంభించాయి.

పైన చెప్పిన పరిహాసోక్తిలో యజ్ఞసమయంలో సామ గాయకులను కుక్కలతో పోల్చి అనుకరించటం జరిగింది. పొట్టకూటి కోసం ఒకరి వెనుక మరొకరు కూర్చుని, ఒకరి వస్త్రాన్ని మరొకరు పట్టుకుని, సామ గానాన్ని గావించే పురోహితులను పరిహసించటంగా కనపడుతుంది. ఆదిశంకరుని భాష్యం ప్రకారం శ్వేత (తెల్లని) శునకం, సునకరూపంలో ఉన్న ఋషి అని, ఆయన వద్దకు చేరిన మిగతా శునకాలు కూడా రుషులే నని శంకరుడు అంటాడు. పైన చిత్రించబడింది ఎంత పరిహాసంగా కనిపించినప్పటికీ సునకజాతి ప్రజల సమూహం ఒకటి ఉన్నది అన్నది వాస్తవం. ఒక్క శునక జాతి ప్రజలు మాత్రమే కాదు, అనేక జంతు, మొక్కల నామాలతో ఉన్న ప్రజలు కూడా ఉన్నారన్నది వేద సాహిత్యంలో అనేక ఆధారాలు ఉన్నాయి. ప్రాచీన సమాజ అవశేషాల్లో, ప్రపంచమంతటా, సర్వత్ర కనిపించే విశేషమేమంటే ఆ ప్రజలంతా తమ పేర్లను వృక్ష ప్రపంచం నుంచో, జంతు ప్రపంచం నుంచో ఎరువు తెచ్చుకున్నవే. ఆయా సమూహాలకు లేదా ఆయా కుదుర్లకు, లేదా ఆయా వంశాలకు అవి చిహ్నాలు అన్నమాట. కుదురు చిహ్నాలు అంటే ఏమిటో, ఆ చిహ్నాలు మానవ సమూహాలకు ఎలా గుర్తులుగా అనుసంధానించబడ్డాయో నిశితంగా పరిశీలించాలి.

ఒక ప్రాంతంలో సంచార నివాసం చేస్తూ ఆహార సేకరణ ద్వారా జీవనం సాగించే గుంపు లేదా ఒక కుదురు ప్రజల సమూహం, ఒక దుంపను గానీ, అడవి ధాన్యాన్ని గాని,

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. గోత్రాలు, వాటి పుట్టుపూర్వోత్తరాలు .......2

2. ఆధునిక సోషలిస్టు దేశం దిశగా చైనా అడుగులు
ఆర్ అరుణ్ కుమార్........4

3. అధికార కేంద్రీకరణ పెంచే టెలికాం ముసాయిదా బిల్లు
ప్రబీర్ పుర్కాయస్థ............9

4. పర్యావరణ మార్క్సిజం - పర్యావరణ నాగరికత
జాన్ బెల్లమీ ఫాస్టర్ ........11

5. మోడి నయవంచన, జగన్ దాసోహం
ఎ.కోటిరెడ్డి..........16

6. అస్థిరతలో అమెరికా ప్రజాస్వామ్యం
బి. అర్జున్..........19

7. ఉమ్మడి పౌరస్మృతి సరే ఉమ్మడి నియమావళి మాటేమిటి?
బద్రీ రైనా........21

8. కొరియా వర్కర్స్ పార్టీ : కొత్త శకంలో పార్టీ నిర్మాణం ...............23

9. భారతదేశంలో హిందూత్వ పునరాగమనం ఎలా జరిగింది?
సుభాష్ ఘటాడే..............26



**సంపాదకుడు:**

**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**

**బి.వి.రాఘవులు**

**తమ్మినేని వీరభద్రం**

**ఎస్.వీరయ్య**

**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# రైతాంగానికి దగా

నవంబర్ 26న రాజ్యాంగ దినం సందర్భంగా భారత దేశంలోని రైతాంగం తరపున అఖిలభారత కిసాన్ సభ వివిధ రాష్ట్రాల గవర్నర్ల ద్వారా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఇచ్చిన వినతి పత్రం చదివితే కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ఈ దేశ రైతాంగానికి ఎంతటి ద్రోహం చేసిందో, చేస్తున్నదో అర్థమవుతుంది. వ్యవసాయం నుండి రైతాంగాన్ని దూరం చేసి దాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు మోడీ ప్రభుత్వం అప్రజాస్వామిక పద్ధతుల్లో తీసుకువచ్చిన మూడు రైతాంగ వ్యతిరేక చట్టాలను భారత రైతాంగం చారిత్రాత్మక ప్రతిఘటన ద్వారా తిప్పికొట్టిన సంగతి విదితమే. ఆ సందర్భంగా ఆసేతుశీతాచలం భారత రైతాంగం ప్రదర్శించిన ఐక్యతను చూసి కేంద్రానికి గంగవెర్రులెత్తింది. రైతాంగ ఐక్యతను చెదరగొట్టడానికి, ఉద్యమాన్ని అణచివేయడానికి బిజెపి-ఆర్ఎస్ఎస్ దాని ప్రభుత్వం చేసిన ప్రయత్నాలన్నిటినీ రైతు ఉద్యమకారులు ఎంతో ఓర్పు, సహనం, పోరాట పటిమతోనూ, ఇతర ప్రజానీకం ముఖ్యంగా కార్మికవర్గం అందించిన సహకారంతోనూ తిప్పికొట్టారు. భారత దేశ చరిత్రలోనే ఎరుగని రీతిలో ఏడాదిపాటు జరిగిన పోరాటాన్ని అణచివేయలేక ప్రభుత్వం కొంతవరకు దిగివచ్చింది. మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కు తీసుకున్నది. ఆ సందర్భంగా కిసాన్ మోర్చా ద్వారా రైతాంగం చేసిన ఆరు డిమాండ్లను కూడా అంగీకరిస్తామనీ ఆందోళన విరమించాలనీ కేంద్ర ప్రభుత్వం 2021 డిసెంబర్ 9వ తేదీన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ ద్వారా కిసాన్ మోర్చాకు రాసిన ఒక లేఖలో స్పష్టమైన హామీ ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన హామీతో రైతాంగం ఆందోళనను విరమించుకున్నది.

మోడీ ప్రభుత్వం రాతపూర్వక హామీ ఇచ్చి ఏడాది గడిచిపోతున్నది. హామీల్లో ఒక్కదాన్నీ నెరవేర్చలేదు సరికదా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నాలను దొడ్డి దారిన కొనసాగిస్తూనే ఉన్నది. రైతుపొలాలకు నీరిచ్చే విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు బిగించడం, లాండ్ సర్వేలు చేయించడం వంటి చర్యలన్నీ రానున్న కాలంలో వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించే చర్యల్లో భాగమే. మోడీ ప్రభుత్వం తన ఆశ్రిత పెట్టుబడిదారీ విధానల్లో భాగంగానే ఇతర అనేక సెక్షన్ల ప్రజలకు మాదిరిగా భారత రైతాంగాన్ని కూడా నమ్మించి మోసం చేసింది.

రైతు వ్యవసాయం బతికిబట్టకట్టాలన్నా తద్వారా ఈ దేశంలోని విస్తారమైన ప్రజానీకానికి ఆహారభద్రత లభించాలన్నా రైతు పంటలకు గిట్టుబాటు ధర లభించడం అతి ముఖ్యమైన విషయం. వ్యసాయ పెట్టుబడులు పెరిగి గిట్టుబాటు ధరలు రాకపోవడం వల్ల దేశంలోని 80 శాతం మంది రైతులు అప్పుల్లో కూరుకుపోయి దిక్కుతోచని స్థితిలో అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వారి రుణాలను రద్దు చేయడం, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా రైతు పంటకు కనీస మద్దతు ధర గ్యారంటీ చేయడం అవసరం. దీని కోసం చట్టం చేయాల్సిన అవసరం ఉంది. కేంద్ర స్థాయిలో గిట్టుబాటు ధరలపై ఒక కమిటీని నియమిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం కమిటీనైతే నియమించింది కానీ ఆ కమిటీగానీ, దాని ఎజెండా గానీ రైతుల డిమాండ్లకు విరుద్ధంగా ఉన్నాయి. అలాగే విద్యుత్ సవరణ బిల్లు, 2022 ను కిసాన్ "మోర్చాతో చర్చించిన తరువాత మాత్రమే పార్లమెంటులో ప్రవేశపెడతాం" అని 2021 డిసెంబర్ 9న సంయుక్త కిసాన్ మోర్చాకు రాసిన లేఖలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ ఎటువంటి చర్చ లేకుండానే కేంద్ర ప్రభుత్వం బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది.

ఇంకా ఉద్యమాన్ని విరమింపజేసేందుకు కేంద్రం అనేక వాగ్దానాలు చేసింది. కానీ ఓడెక్కేవరకు ఓడ మల్లన్న, ఓడ దిగినాక బోడిమల్ల అన్నట్లు ఉద్యమం విరమించిన తరువాత రైతాంగానికి మొండి చేయి చూపించింది. నిజానికి కేంద్ర ప్రభుత్వం మోసం చేసింది రైతాంగానికి కాదు ఈ దేశ ప్రజలకు. ఎందుకంటే భారతీయ వ్యవసాయాన్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు అప్పగించేందుకు నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలోని వ్యవసాయాన్ని రోజురోజుకూ సంక్షోభంలోకి నెడుతున్నందువల్ల రైతాంగం దెబ్బతినడమే కాదు, దేశంలోని సామాన్య ప్రజలకూ ఆహార భద్రత కరువవుతుంది. అందువల్ల రైతులకిచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలన్న డిమాండ్లతో భారత ప్రజానీకం మొత్తం గొంతుకలపాలి. దీనిపై పోరాటానికి సిద్ధమవుతున్న రైతాంగంతో భుజం భుజం కలిపి పోరాడాలి. నయా-ఉదారవాద విధానాలను మొత్తంగా తిప్పికొట్టే పోరాటంలో భాగంగా రైతాంగ ఉద్యమం ఉవ్వెత్తున సాగాలి.

ఈ మాసం ముఖ్యాంశం

# ఆధునిక సోషలిస్టు దేశం దిశగా చైనా అడుగులు



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

**ఆర్ అరుణ్ కుమార్**

ఈ ఏడాది అక్టోబరు 16వ తేదీన ప్రారంభమైన చైనా కమ్యూనిస్టు పార్టీ 20వ మహాసభ 22వ తేదీన జయప్రదంగా ముగిసింది. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో చైనా ముఖ్యమైన స్థానంలో ఉండటంతో ఈ మహాసభను అందరూ ఆసక్తితో గమనించారు. 2021లో చైనా జిడిపి 17.7 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. ప్రపంచ జిడిపిలో ఇది 18.5 శాతం. 2013-21మధ్య ప్రపంచ జిడిపి సంవత్సరానికి 2.6 శాతం చొప్పున పెరగగా, చైనా జిడిపి 6.6 శాతం చొప్పున పెరిగింది. 2012-22 మధ్యకాలంలో ప్రపంచ జిడిపి పెరుగుదలలో చైనా వాటా 38.6 శాతంగా ఉంది. ఆ కాలంలో జి-7 దేశాల మొత్తం జిడిపి పెరుగుదల కన్నా ఇది ఎక్కువ. 2020లో మొదటిసారిగా ప్రపంచంలో అతి పెద్ద వాణిజ్యదేశంగా అమెరికాను చైనా అధిగమించింది. విదేశీ వాణిజ్యాన్ని 6.9 లక్షల కోట్ల డాలర్లకు పెంచుకోవటం ద్వారా 2021లో అది ఈ స్థానాన్ని నిలబెట్టుకుంది.

అన్నింటికన్నా ఎక్కువగా చైనా సోషలిస్టు దేశం కావటం, 2012 నుండి గత సంవత్సరం నాటికి ప్రజల తలసరి ఆదాయం రెట్టింపయి 11,890 డాలర్లకు చేరటంతో ఈ మహాసభ ప్రాధాన్యత మరింత పెరిగింది. ప్రజల ఆదాయాలు పెరగటం, విద్య, వైద్యరంగాలలో అభివృద్ధి సాధించటంతో 2020లో చైనా ప్రజల సగటు జీవనకాలం 77.9 సంవత్సరాలకు చేరింది. ఇది ప్రపంచ సగటు కన్నా 5.2 సంవత్సరాలు ఎక్కువ. ఈ అంశాలన్నీ సోష లిస్టు సమాజ ఆధిక్యతను తెలియజేస్తూ, చైనా పట్ల ప్రజల ఆసక్తిని పెంచుతున్నాయి.

### ప్రజాస్వామ్య విధానంతో మహాసభకు సన్నాహాలు

2021 సెప్టెంబరులో మహాసభకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. 2021 నవంబరు, 2022 జులై మధ్య మహాసభకు ప్రతినిధులను ఎన్నుకున్నారు. సైద్ధాంతిక అవగాహన, రాజకీయ భావాలు, పనిచేయగల శక్తి, జీవన విధానం, పనిలో వారు రాబట్టిన ఫలితాలను ప్రతినిధుల ఎన్నికకు ప్రాతిపదికగా తీసుకున్నారు. 9.60 కోట్లమంది చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యులలో 99.5 శాతం మంది, 49 లక్షల ప్రాథమిక స్థాయిలోని పార్టీ సంస్థలు ప్రతినిధుల ఎన్నికలో భాగస్వాములైనారు. ఈ మొత్తం కార్యక్రమం ఐదు దశలుగా జరిగింది. పార్టీ సభ్యులు ప్రతినిధిని ప్రతిపాదించటం, అతని ప్రాతినిధ్యాన్ని పరిశీలించటం, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవటం కోసం ప్రతిపాదించబడిన వ్యక్తిపేరును బహిరంగంగా ప్రకటించటం, అర్హులు కారనుకున్న ప్రతినిధుల పేర్లను లిస్టు నుండి తప్పించటం, చివరిగా ప్రతినిధిని ఎన్నుకోవటానికి ప్రతి యూనిట్‌లోని సభ్యులు ఓటుచేయటంతో ప్రతినిధుల ఎన్నిక ముగిసింది. ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులకు తోడ్పడటం కోసం ఏడు సెక్షన్లు, 25 దశలతో కూడిన నియమావళిని ప్రతి పార్టీ సభ్యునికి అందజేశారు. ఈ నిబంధనలను అమలుచేసే క్రమంలో 15 శాతానికి పైగా అభ్యర్థులు అనర్హులైనారు. మహాసభకు ముందే ఎన్నికైన ప్రతినిధుల వివరాలను అర్హతల పరిశీలన కమిటీ సమీక్షించింది.

సి జిన్‌పింగ్‌ను అభ్యర్థిగా కేంద్రకమిటి నామినేట్ చేసింది. ఆయన గ్వాంగ్జి జువాంగ్ స్వయం పాలిత ప్రాంతం పార్టీ ఓటర్ల నుండి మహాసభకు ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద్దసంఖ్యలో మైనారిటీ జాతుల ప్రజలున్న సరిహద్దు ప్రాంతంలో, పాతకాలంలో విప్లవానికి పునాదిగా ఉన్న ప్రాంతాల్లో, జాతీయస్థాయి అభివృద్ధి వ్యూహాలను అమలు చేస్తున్న కీలకప్రాంతాలలో జరిగిన ఎన్నికలలో సి జిన్‌పింగ్, పొలిట్‌బ్యూరోలోని స్టాండింగ్ కమిటి సభ్యులు పాల్గొన్నారు. ఈ నాయకులు ప్రతినిధు లుగా ఎన్నికవటమేకాక పార్టీ మహాసభలో ఆయా గ్రూపుల ప్రతినిధులు జరిపిన చర్చల లో కూడా భాగస్వాములైనారు.

ఎన్నికైన 2,296 మంది ప్రతినిధులు మహాసభకు హాజరైనారు. వారిలో 771 మంది ప్రతినిధులు-33.6 శాతం-ప్రజల మధ్య ప్రత్యక్షంగా పనిచేస్తున్నారు. వారిలో 192 మంది కార్మికులు, 85 మంది రైతులు, 266 మంది వృత్తి నిపుణులు, సాంకేతిక నిపుణులు ఉన్నారు. మహిళా ప్రతినిధులు 619 మంది-27 శాతం- ఉన్నారు. ఐదు సంవత్సరాల క్రితం జరిగిన 19 మహాసభలో పాల్గొన్న వారి కన్నా 2.8 శాతం అధికంగా ఉన్నారు. 40 మైనారిటీ జాతులకు చెందిన 264 మంది ప్రతినిధులు మహాసభకు హాజరయ్యారు. ప్రతినిధుల సగటు వయసు 52.2 సంవత్సరాలు. వారిలో 59.7 శాతం మంది 55 సంవత్సరాల కన్నా తక్కువ వయసు వారున్నారు. 2,224 మంది ప్రతినిధులు-మొత్తం ప్రతినిధులలో 96.9 శాతం-1978 తర్వాతనే చైనా కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

నాయకత్వ కమిటీలైన కేంద్రకమిటీ, క్రమశిక్షణ అమలును పర్యవేక్షించే కేంద్ర క్రమశిక్షణ తనిఖీ కమిటీలను ఎన్నుకోవటంతో పాటు కేంద్రకమిటీ ప్రవేశపెట్టిన వర్క్ రిపోర్టును, కేంద్ర క్రమశిక్షణ తనిఖీ కమిటి నివేదికను చర్చించి ఆమోదించటం, నిబంధనావళికి ప్రతిపాదించిన సవరణలను చర్చించి ఆమోదించటం మహాసభ ముందు ప్రధాన ఎజెండాగా ఉన్నాయి. మహాసభ ప్రారంభానికి ముందు అక్టోబరు 16వ తేదీన సమావేశమైన చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ పార్టీ 20వ మహాసభ ముందు పెట్టబోతున్న కేంద్రకమిటి, కేంద్ర క్రమశిక్షణ తనిఖీ కమిటిలు రూపొందించిన నివేదికలను, పార్టీ నిబంధనావళికి చేసిన

సవరణలను ఆ సమావేశంలో ఆమోదించారు. కేంద్ర క్రమశిక్షణ తనిఖీ కమిటీ రూపొందించిన నివేదికలో అవినీతికి వ్యతిరేకంగా పార్టీ దృఢ నిశ్చయంతో చేస్తున్న పోరాటం ఫలితాలను ఇస్తున్నదని పేర్కొన్నారు. 19వ మహాసభ తర్వాత అవినీతికి సంబంధించిన కేసులలో 74,000 మందికి పైగా వ్యక్తులను విచారించి, శిక్షించటం జరిగిందని చెప్పారు. వారిలో 48 శాతం 18వ మహాసభకు ముందు మొదటి అవినీతి చర్యలకు పాల్పడ్డారని, 11.1 శాతం 19వ మహాసభ తర్వాత అవినీతికి పాల్పడ్డారని నివేదికలో స్పష్టం చేశారు. అవినీతి కేసులు క్రమంగా తగ్గటాన్ని ఇది వెల్లడిస్తున్నది. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రయత్నాల వలన పార్టీ తనను తాను సక్రమమైన మార్గంలో పయనింపచేసుకోవటానికి పట్టుబట్టి చేస్తున్న ప్రయత్నం అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నదని 97.4 శాతం ప్రజలు భావిస్తున్నారని 2022లో చేసిన సర్వే స్పష్టం చేసింది. 2012లో చేసిన సర్వేలో వెల్లడైన ప్రజాభిప్రాయం కన్నా ఇది 22.4 శాతం అధికం. పార్టీ అధికారులు, వారి కుటుంబ సభ్యులు చేస్తున్న వ్యాపార కార్యకలాపాలపై 2015 తర్వాత నిఘా పెరిగింది. 4,700 మందికి పైగా అధికారుల భార్యలు, వారి పిల్లలు చేస్తున్న వ్యాపార కార్యకలాపాలు క్రమబద్ధీకరించ బడ్డాయి. కీలకమైన ప్రాంతాలు, రంగాలు తర్వాత ప్రాధాన్యత అని, వాటిలోని పులులను తరిమివేసి, కీటకాలను నిరోధించి, నక్కలను వేటాడటం ద్వారా అవినీతికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో కీలకమైన విజయా లను సాధించా లని చెప్పారు.

> "1982 నుండి ప్రతి పార్టీ మహాసభలోనూ నిబంధనావళికి సవరణలు చేయటం క్రమబద్ధం గా జరుగుతున్నది. సిద్ధాంతాన్ని ఆధునీకరించ టం, ఆచరణను నిరంతరం అభివృద్ధి చేయటం కోసం ఈ విధంగా చేస్తున్నారు. చైనా ప్రత్యేక తలకు, ప్రస్తుత కాలానికి అనుగుణంగా మార్క్సి జాన్ని అన్వయించిన వ్యూహాత్మక ఆలోచనా విధానం సాధించిన ఫలితాలను ప్రతిబింబించే విధంగా ప్రతిపాదిత సవరణలు ఉన్నాయి."



చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సి జిన్‌పింగ్

**పార్టీ నిబంధనావళికి సవరణలు**

1982 నుండి ప్రతి పార్టీ మహాసభలోనూ నిబంధనావళికి సవరణలు చేయటం క్రమబద్ధంగా జరుగుతున్నది. సిద్ధాంతాన్ని ఆధునీకరించటం, ఆచరణను నిరంతరం అభివృద్ధి చేయటం కోసం ఈ విధంగా చేస్తున్నారు. చైనా ప్రత్యేక తలకు, ప్రస్తుత కాలానికి అనుగుణంగా మార్క్సిజాన్ని అన్వయించిన వ్యూహాత్మక ఆలోచనా విధానం సాధించిన ఫలితాలను ప్రతిబింబించే విధంగా ప్రతిపాదిత సవరణలు ఉన్నాయి. ప్రత్యేకతలతో కూడిన చైనామార్గం ద్వారా అన్ని రంగాలనూ ఆధునీకరించి, చైనా జాతిని పునర్నవీకరించటాన్ని ముందుకు తీసుకుపోవటం పార్టీ కేంద్ర కర్తవ్యంగా ఉండాలని నిర్దేశించి, దానిని సవరించిన నిబంధనావళిలో చేర్చారు.

పార్టీ ప్రారంభకాలంలో వ్యక్తమైన ఆకాంక్షలను, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని, అది సాధించిన ప్రధాన విజయాలను, గత శతాబ్ద కాలంలో గడించిన చారిత్రక అనుభవాలను పార్టీ నిబంధనావళిలో చేర్చారు. మౌలికమైన సోషలిస్టు ఆర్థిక విధానాలు పునాదిగా, ప్రజా యాజమాన్యంతో పాటు వివిధ రకాలైన యాజమాన్యాలు కలిసి అభివృద్ధి చెందవచ్చు నన్నది నిబంధనావళిలో చేర్చిన మరొక ప్రధానమైన సవరణ. 'పనికి తగినట్లుగా పంపకం అనేది పంపిణీకి పునాదిగా ఉంటుంది. దానితో పాటు వివిధరకాలైన పంపిణీ పద్ధతులు ఉనికిలో ఉంటాయి. వీటన్నింటితో పాటు చైనా లక్షణాలతో కూడిన సోషలిజానికి సోషలిస్టు మార్కెట్ ఆర్థిక విధానం పునాదిగా ఉంటుంది' అని చేర్చారు. అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందిన ఆధునిక సోషలిస్టు దేశంగా చైనాను మార్చటానికి రెండు దశల వ్యూహాత్మక ప్రణాళికను నిబంధనావళిలో చేర్చారు. 2020 నుండి 2035 మధ్యకాలంలో సోషలిస్టు ఆధునీకరణను సాధించటం మొదటి దశ. 2035 నుండి ఈ శతాబ్దం మధ్య నాటికి చైనాను అభివృద్ధి చెందిన, దృఢమైన, ప్రజాస్వామికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెందిన, సమైక్యమైన, సర్వాంగ సుందరమైన గొప్ప ఆధునిక సోషలిస్టు దేశంగా నిర్మించటం రెండవ దశ లక్ష్యంగా ఉన్నది.

సైన్యంలో రాజకీయ విధేయతను పెంచటం, ప్రజా సైనిక బలగాలను ప్రపంచస్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయటం, ఒకదేశం-రెండు వ్యవస్థలు అన్నవిధానాన్ని విశ్వాసపాత్రంగా, దృఢ నిశ్చయంతో పూర్తిగా అమలుచేయటం, తైవాన్‌కు స్వాతంత్ర్యం కావాలంటున్న వేర్పాటువాదులను దృఢంగా వ్యతిరేకించటాన్ని కూడా నిబంధనావళికి చేసిన సవరణలలో చేర్చారు. శాంతి, అభివృద్ధి, వివక్ష రహితంగా అందరినీ సమానంగా చూడటం, నిజాయితీ, ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్య విలువల్లో భాగస్వా ములు కావటాన్ని కూడా ఇపుడు చేర్చారు. దాపరికంలేని, పరస్పరం భాగస్వాములైన ప్రజలతో కూడి సర్వాంగసుందరమైన సమా జాన్ని నిర్మించాలి. చిరకాల శాంతితో, ప్రపం చంలో అందరికీ భద్రత, ప్రపంచ ప్రజలందరూ సమైక్యంగా అభివృద్ధి సాధించే దిశలో ఆ సమాజం ముందుకుసాగాలి. పరస్పర ప్రయో జనంతో కూడిన, మానవాభివృద్ధిని ముందుకు తీసుకుపోయే సమాజాన్ని సాధించే దిశలో ముందుకుసాగటం కోసం దీనిని సాధించాలని చైనా కమ్యూనిస్టు పార్టీ చెప్పింది.

పార్టీ సభ్యుల విధులు, బాధ్యతలకు సంబంధించి రాజకీయ తప్పొప్పులను విశ్లేషించు

> **"నివేదికను రూపొందించటం కోసం మహాసభకు ముందు విస్తృతమైన ప్రజాస్వామిక కార్యాచరణ జరిగింది. నివేదికలో చేర్చాల్సిన అంశాల కోసం పార్టీ సభ్యుల నుండి విస్తృతంగా సూచనలు, పార్టీయేతర ప్రముఖుల నుండి సలహాలు తీసుకోవాలని  చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ 2022, జనవరిలో నిర్ణయిం చింది. చైనా కమ్యూ నిస్టు పార్టీ నాయకత్వంలోని 54 సంస్థలు 26 కర్తవ్యాలపై విస్తృతమైన అధ్యయనం చేసి, 80 అధ్యయన నివేదికలను రూపొందించాయి. మహాసభలో ప్రతిపాదించిన ముసాయిదా నివేదికకు ఇవి ప్రాతిపదికగా ఉపయోగ పడ్డాయి."**

కునే విధంగా తమ సామర్థ్యాన్ని పెంపొందించు కోవాలి. పార్టీ సిద్ధాంతాన్ని, విధానాలను, సూత్రాలను, మార్గదర్శకత్వాన్ని అమలుచేయటం లో మరింత స్వయం చలితంగా, దృఢంగా ఉండాలి. చైనా పరిస్థితులకు, మన కాలానికి మార్క్సిజాన్ని వర్తింపజేయటాన్ని మరింత ముందుకుతీసుకుపోవాలని నిబంధనావళికి చేసిన సవరణలలో పేర్కొన్నారు.

పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన నిబంధనలను కూడా సవరించారు. తమకు ప్రత్యేకహక్కులు కావాలనే భావాలను, వాటిని అనుభవించటాన్ని అన్ని స్థాయిలలోని పార్టీ నాయకులు, అధికారులు వదులుకోవాలని, నిరంకుశాధికారాన్ని, అవకాశాలను తమకు అనుకూలంగా వినియోగించుకోరాదని, అవినీతి పరులు కావటానికి వ్యతిరేకంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రస్తుత సమయంలో ఎదురౌతున్న సవాళ్ళను ఎదుర్కోవటానికి పార్టీ సభ్యులకు నూతన కర్తవ్యాలను, బాధ్యతలను నిర్దేశించాలని చెప్పారు. పార్టీ చరిత్రను అధ్యయనం చేయటం, రాజకీయ సమగ్రతను కొనసాగించటం కోసం చైతన్యాన్ని పెంపొందించుకోవటం, ఎక్కువ సాధించాలనే లక్ష్యంతో ఆలోచించాలని, ముఖ్య నాయకత్వాన్ని అనుసరించాలని, పార్టీ కేంద్ర నాయకత్వంతో సమన్వయంతో వ్యవహ రించాలని పేర్కొన్నారు. చైనా లక్షణాలతో అభివృద్ధి అవుతున్న సోషలిజం, సిద్ధాంతం, సంస్కృతి, పయనిస్తున్న మార్గం, వ్యవస్థలపై విశ్వాసం కలిగివుండాలని ఉల్లేఖించారు. కేంద్రకమిటీలోనూ, పార్టీ మొత్తంగానూ సి జిన్‌పింగ్ ఆధిక్యతా స్థానాన్ని, కేంద్రకమిటి అధికారాన్ని బలపరచాలని సవరణలలో పేర్కొన్నారు.

విస్తృతమైన, సంపూర్ణమైన, దృఢమైన, పూర్తిగా సమగ్రమైన జనతా ప్రజాస్వామిక విధానాన్ని అభివృద్ధి చేయాలి. ప్రజాస్వామికం గా ఎన్నికల నిర్వహణ, సంప్రదింపులు, నిర్ణ యాలు చేయటం, అజమాయిషి, పర్యవేక్షణ లకు బలమైన వ్యవస్థలను, పద్ధతులను రూపొం దించాలని నిబంధనావళిలో చేర్చారు.

**శతాబ్ది లక్ష్యాల నిర్దేశం**

చైనా కమ్యూనిస్టు పార్టీ 20వ మహాసభలో ఆమోదించిన తీర్మానం రాజకీయ ప్రకటన. చైనా లక్షణాలతో కూడిన సోషలిజం నూతన విజయాలను సాధించే దిశగా దేశాన్ని నడపటం కోసం పార్టీకి కార్యాచరణ ప్రణాళిక కూడా అందులో ఉన్నది. దీనిని మార్క్సిస్టు మార్గదర్శక తీర్మానంగా మహాసభలో ఆమోదించిన ఒక తీర్మానంలో పేర్కొన్నారు.

నివేదికను రూపొందించటం కోసం మహాసభకు ముందు విస్తృతమైన ప్రజాస్వామిక కార్యాచరణ జరిగింది. నివేదికలో చేర్చాల్సిన అంశాల కోసం పార్టీ సభ్యుల నుండి విస్తృతంగా సూచనలు, పార్టీయేతర ప్రముఖుల నుండి సలహాలు తీసుకోవాలని  చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్రకమిటీ 2022, జనవరిలో నిర్ణయిం చింది. నివేదిక తయారు చేయటానికి ఏర్పాటు చేసిన కమిటీ మొదటి సమావేశం సి జిన్‌పింగ్ అధ్యక్షతన ఫిబ్రవరిలో జరిగింది. చైనా కమ్యూ నిస్టు పార్టీ నాయకత్వంలోని 54 సంస్థలు 26 కర్తవ్యాలపై విస్తృతమైన అధ్యయనం చేసి, 80 అధ్యయన నివేదికలను రూపొందించాయి. మహాసభలో ప్రతిపాదించిన ముసాయిదా నివేదికకు ఇవి ప్రాతిపదికగా ఉపయోగ పడ్డాయి.

ఆన్‌లైన్ ద్వారా పార్టీ లోపలి నుండి, వెలుపలి నుండి అభిప్రాయాలు తీసుకోవటం మొట్టమొదటిసారిగా జరిగింది. నిర్దేశించిన నెలరోజుల సమయం-ఏప్రిల్ 15 నుండి మే 16 వరకు-లో ఆన్‌లైన్ ద్వారా 85.40 లక్షల సూచనలు, సలహాలు అందాయి. నివేదికను పునర్నవీకరించటం కోసం స్థానిక యూనిట్లు 1,435 సూచనలను పంపాయి. 4,700 మందికి పైగా వ్యక్తులు తమ అభిప్రాయాలను పంపారు. వీటి తర్వాత అక్టోబరు 9న కేంద్రకమిటి సమావేశమై 20వ మహాసభలో ప్రతిపాదించే తుది నివేదికను రూపొందించింది. మహాసభలో ప్రతినిధులు చేసిన చర్చలు, ప్రతిపాదించిన సవరణలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు.

'చైనా లక్షణాలతో కూడిన సోషలిజాన్ని ఉన్నతంగా నిలబెట్టండి, అన్ని విధాలా ఆధునిక సోషలిస్టు దేశాన్ని నిర్మించటానికి ఐక్యంగా కృషి చేయండి' అన్న హెడ్డింగ్‌తో నివేదికను రూపొం దించారు. నివేదికలో చర్చించిన కొన్ని ప్రధా నాంశాలు: 1. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, రాజకీయ సవాళ్ళు, ఈ సవాళ్ళను అధిగమించి, దేశాన్ని ముందుకునడపటానికి పార్టీ చేయాల్సిన కృషి. 2. ద్విశతాబ్ది లక్ష్యం, దానిని సాధించ టానికి నిర్దేశించే మార్గాన్ని గురించి వివరిం చటం. 3. పార్టీని మరింత బలోపేతం చేయ టం కోసం  అంతర్గత బలహీనతలను అధిగ మించటం.

అంతర్జాతీయ పరిస్థితులు, చైనాను నిరోధించటం, బ్లాక్‌మెయిల్ చేయటం, ఒంటరిపాటు చేయటం, చైనాపై తీవ్రమైన ఒత్తిడిని పెంచటం కోసం అమెరికా చేస్తున్న ఒత్తిడిని ప్రస్తావిస్తూ, ఒత్తిడికి, బెదిరింపులకు చైనా ఎప్పుడూ భయపడదని సీ జిన్‌పింగ్ చెప్పారు. "బలప్రయోగం చేసే శక్తులకు ఎప్పుడూ లొంగకూడదన్న దృఢ నిశ్చయాన్ని వ్యక్తం చేశామని ఆయన చెప్పారు. సమీక్ష కాలం ఐదు సంవత్సరాలు అత్యంత సంచలనాత్మక మైనవని, ఐదు రంగాల సమగ్ర ప్రణాళికను ముందుకు తీసుకుపోవటంలో చైనా కమ్యూనిస్టు పార్టీ విజయం సాధించిందని పేర్కొన్నారు. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక, పర్యా వరణ రంగాలలో సమన్వయంతో కృషి చేయా లని చెప్పారు. సమగ్రమైన జనతా ప్రజాస్వామ్యాన్ని పార్టీ ముందుకు తీసుకు వెళు తుందని, సోషలిస్టు సంస్కృతిని అభివృద్ధి చేస్తుందని, ప్రజల సంక్షేమాన్ని మరింత మెరుగుగా అమలుచేస్తుందని నివేదికలో పేర్కొ న్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది లక్ష్యాలు రెండింటిలో ఒకదానిని-నిష్ట దారిద్ర్యాన్ని అంతం చేయటం, 2021 నాటికి ప్రాథమికంగా అభివృద్ధి చెందిన ఆధునిక సమాజాన్ని చైనాలో ఏర్పాటు చేయటం- ఈ కాలంలోనే సాధిం చారు. (కమ్యూనిస్టు పార్టీని స్థాపించిన శతాబ్ది ఉత్సవాలతో పాటు ఇది పూర్తయింది). ఇప్పుడు పార్టీ తన శతాబ్ది లక్ష్యాలలో రెండవదానిని-అభివృద్ధి చెందిన, సామరస్యంతో కూడిన సోషలిస్టు సమాజాన్ని ఏర్పాటు చేయటం-2049 నాటికి (చైనా ప్రజా రిపబ్లిక్ శత వార్షికోత్సవ సంవత్సరం) సాధించటం కోసం దేశాన్ని ముందుకు నడుపుతున్నది.

గత దశాబ్దంలో చైనా జిడిపి 54 లక్షల కోట్ల యువాన్‌ల నుండి 114 లక్షల కోట్ల యువాన్‌లకు పెరిగింది. ఇది ప్రపంచ ఆర్థికవృద్ధిలో 18.5 శాతం. ఇది గతంలో గణించిన నాటికన్నా 7.2 శాతం అధికం. చైనా తలసరి జిడిపి 39,800 యువాన్‌ల నుండి 81,000 యువాన్‌లకు పెరిగింది. ఆహారధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచంలో మొదటిస్థానంలో ఉన్నది. తనదేశ పౌరులు 140 కోట్లమందికి ఆహారం, ఇంధన భద్రతలను కల్పిస్తున్నది. చైనా విదేశీమారక నిల్వల వలెనే వస్తు తయారీరంగం కూడా ప్రపంచంలోనే అతి పెద్దది. ఈకాలంలో చైనా ప్రపంచంలో కెల్లా అతి పెద్దదైన, వేగవంతమైన రైల్వే వ్యవస్థను, అతివేగంగా ప్రయాణం చేసే రహదారులను నిర్మించింది. విమానాశ్రయాలు, ఓడరేవులు నిర్మించటంలో అభివృద్ధిని సాధించింది. నీటి పరిరక్షణ, ఇంధనం, సమాచార సాంకేతిక పరిజ్ఞానం, ఇతర మౌలిక సదుపాయాల రంగాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 140కి పైగా దేశాలకు వాణిజ్యంలో ప్రధాన భాగస్వామి గా ఉంది. సరుకుల వాణిజ్యంలో ప్రపంచంలోనే అగ్రగామిగా, నాయకత్వ స్థానంలో ఉన్నది. విదేశీ పెట్టుబడులను ఆకర్షించటంలో ప్రపంచం లోనే ప్రథమస్థానంలో ఉన్నది.

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన రంగాలలో స్వయంసమృద్ధిని సాధించేందుకు రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ రంగాలపై చేస్తున్న ఖర్చును లక్షకోట్ల యువాన్‌ల నుండి 2.8 లక్షల కోట్ల యువాన్‌లకు పెంచింది. ఈ రంగాలపై అత్యధికంగా ఖర్చు చేస్తున్న దేశాలలో రెండవస్థానంలో ఉన్నది.

ఆర్థికాభివృద్ధి సాధన కోసం మానవాభివృద్ధిని చైనా పణంగా పెట్టటం లేదు. చైనా ప్రజల సగటు ఆయుర్ధాయం 78.2 సంవత్సరాలకు చేరింది. ప్రజల మొత్తం (డిస్పోజబుల్) తలసరి ఆదాయం 16,500 యువాన్ల నుండి 35,100 యువాన్లకు పెరిగింది. గత 10 సంవత్సరాల నుండి పట్టణాలలో సగటున సంవత్సరానికి 1.30 కోట్ల ఉద్యోగాలను కల్పిస్తున్నది. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా విద్య, వైద్యం, సామాజిక భద్రత కల్పిస్తున్న దేశంగా ఉన్నది. ఈ విధమైన విజయాలను సాధించటం వలననే విద్యను సార్వత్రికం చేయటం, 104 కోట్లమందిని వృద్ధాప్య పెన్షన్ పరిధిలోకి తీసుకురావటం, ప్రజలలో 95 శాతానికి వైద్యబీమాను కల్పించటం సాధ్యమైంది. పట్టణప్రాంతాలలో

“ ఆర్థికాభివృద్ధి సాధన కోసం మానవాభివృద్ధిని చైనా పణంగా పెట్టటం లేదు. చైనా ప్రజల సగటు ఆయుర్ధాయం 78.2 సంవత్సరాలకు చేరింది. ప్రజల మొత్తం (డిస్పోజబుల్) తలసరి ఆదాయం 16,500 యువాన్ల నుండి 35,100 యువాన్లకు పెరిగింది. గత 10 సంవత్సరాల నుండి పట్టణాలలో సగటున సంవత్సరానికి 1.30 కోట్ల ఉద్యోగాలను కల్పిస్తున్నది. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత ఎక్కువగా విద్య, వైద్యం, సామాజిక భద్రత కల్పిస్తున్న దేశంగా ఉన్నది. ”




చైనా కమ్యూనిస్టు పార్టీ మహాసభల ప్రారంభం సందర్భంగా జరిగిన ప్రతినిధుల సభ

4.2 కోట్లు, గ్రామీణప్రాంతాలలో 2.4 కోట్ల శిధిలమౌతున్న ఇళ్ళను పునర్నిర్మించారు. దీనితో పట్టణ, గ్రామీణప్రాంతాలలో ఇళ్ళ పరిస్థితి మెరుగుపడింది. ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్న వారిసంఖ్య 103 కోట్లకు చేరింది. అయినప్పటికీ అన్ని అంశాలూ సానుకూలంగాలేవు. అసమానతలు, అభివృద్ధి తగినంతగా జరగకపోవటం అనే సమస్యలున్నాయి. అనేక ఆటంకాలున్నాయి. అవి ఉన్నతస్థాయి అభివృద్ధిని అడ్డుకుంటున్నాయి. శాస్త్ర, సాంకేతిక రంగాలలో చైనా అభివృద్ధి తగినంత బలంగా లేదు.

ఈ రోజు నుండి చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కర్తవ్యం శతాబ్ది కర్తవ్యాలలో రెండవది అయిన అన్ని రంగాలలోనూ చైనాను గొప్ప ఆధునిక సోషలిస్టు దేశంగా నిర్మించటానికి అన్ని జాతులకు చెందిన చైనా ప్రజలను ఉమ్మడిగా కదిలించటం గా ఉండాలని చెప్పారు. చైనా మార్గంలో ప్రయాణించి ఆధునికతను సాధించటం ద్వారా అన్ని రంగాలలోనూ చైనా దేశాన్ని పునర్నవీకరించడం లక్ష్యమని నివేదికలో పేర్కొన్నారు.

ఆధునికమైన గొప్ప సోషలిస్టు దేశాన్ని నిర్మించటం అంటే అర్థమేమిటో ఇలా వివరించారు. 'చైనా ఆధునీకరణ అంటే చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగుతున్న సోషలిస్టు ఆధునీకరణ. అన్ని దేశాల ఆధునీకరణలో ఉన్న అంశాలు దానిలో ఉంటాయి. కాని చైనా పరిస్థితులకు సంబంధించిన ప్రత్యేకమైన అంశాలు కూడా దానిలో ఉంటాయి.

ఆధునీకరణ క్రమంలో 140 కోట్లమంది ప్రజలను ఆధునీకరించాల్సివుంటుంది. ఈ సంఖ్య అభివృద్ధి చెందిన దేశాలలోని మొత్తం ప్రజల కన్నా ఎక్కువ. కాబట్టి ఇది చాలా క్లిష్టమైన, కష్టమైన పని. కాబట్టి అభివృద్ధికి మార్గాలు, పురోగమనానికి అనేక పద్ధతులు ఉంటాయి కాబట్టి చైనా వాస్తవాల ప్రాతిపదికగా చైనా కమ్యూనిస్టు పార్టీ ముందడుగు వేస్తుంది. గొప్పకోసం లక్ష్యాలను నిర్దేశించుకోవటం లేదా మూస పద్ధతులను అనుసరించనని అది చెప్పింది. చరిత్ర ముందుకునడిచే క్రమంలో మనం సహనంతో ఉండాలి. స్థిరమైన అభివృద్ధిని సాధించటం కోసం క్రమానుగతమైన చర్యలు తీసుకోవాలి. మన ఆధునీకరణ లక్ష్యం మరింత మంచి జీవితం కావాలన్న ప్రజల ఆకాంక్షలను నేరవేర్చటమే. సమాజిక సమానత్వాన్ని, న్యాయాన్ని, అందరికీ అభివృద్ధిని అందించటం కోసం, సమాజం భిన్న తరగతులుగా చీలిపోవటాన్ని నివారించటం కోసం మనం కృషి

> **“ శతాబ్ది లక్ష్యాలలో రెండవ దానిని సాధించటానికి రెండు దశల వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించారు. 2020 నుండి 2035 మధ్యకాలంలో మౌలికమైన సోషలిస్టు ఆధునీకరణను సాధించటం మొదటి దశ. 2035 నుండి ఈ శతాబ్దం మధ్య నాటికి అభివృద్ధి చెందిన, దృఢమైన, ప్రజాస్వామికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెందిన, సమైక్యమైన, సర్వాంగ సుందరమైన గొప్ప ఆధునిక సోషలిస్టు దేశంగా చైనాను నిర్మించటం రెండవ దశ లక్ష్యంగా ఉన్నది. ”**

చేయాలని చెప్పారు.

కేవలం భౌతికపరమైన అభివృద్ధి కోసం మాత్రమే కాక సాంస్కృతిక, నైతికపరమైన విషయాలలో కూడా ముందడుగు వేయటానికి చేస్తున్న ప్రయత్నాలను కూడా వివరించారు. భౌతిక అంశాలను అభివృద్ధి చేయటంతో పాటు సాంస్కృతిక, నైతిక పరమైన విషయాలను అభివృద్ధి చేయటం సోషలిస్టు ఆధునీకరణలో మౌలికమైన అంశాలని చెప్పారు. భౌతిక వస్తువుల కొరత, సాంస్కృతికంగా అధమస్థాయి లో ఉండటం సోషలిజం కాదు. ఆధునికీ కరణకు వేసిన భౌతిక పునాదిని బలపరచు కుంటూ, ప్రజలు సుఖజీవనాన్ని సాగించటానికి అవసరమైన పరిస్థితులను మరింత మెరుగు చేయాలి. అభివృద్ధి చెందిన సోషలిస్టు సంస్కృతి, భావాలు, కట్టుబాట్లను అభివృద్ధి చేయాలి. చైనా సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాలి. ఆ విధంగా అన్ని రకాలైన సరుకులు విస్తారంగా అందుబాటులో ఉండాలి. ప్రజలు అన్ని విధా లుగా అభివృద్ధి చెందాలి.

ఆధునీకరణ కోసం చేస్తున్న ప్రయత్నాలు మానవులు, ప్రకృతికి మధ్య పూర్తి సమన్వయాన్ని సాధిస్తుందని చైనా కమ్యూనిస్టు పార్టీ నివేదికలో పేర్కొన్నారు. 'మానవులు, ప్రకృతి ఒక సమూ హంగా కలిసి జీవనం సాగిస్తున్నారు. ఏ విధమైన పరిమితులు లేకుండా లేదా దానికి నష్టం కలిగించే విధంగా మనం వ్యవహరిస్తే ప్రకృతి నుండి ప్రతీకారాన్ని ఎదుర్కొంటాం. ఆధునీకరణకు చెల్లించాల్సిన మూల్యాన్ని గురించి వివరిస్తూ అది శాంతియుతంగా సాగుతుందని నివేదికలో స్పష్టంగా చెప్పారు. కొన్ని దేశాలు గతంలో చేసిన విధంగా యుద్ధాలు, ఇతర దేశాలను వలసలుగా చేసుకోవటం, దోపిడీ వంటి వాటికి చైనా పాల్పడదని చెప్పారు. ఇత రుల ప్రయోజనాలను పణంగా పెట్టి ఆధునీ కరణను సాధించే హింసాయుతమైన, రక్త దాహంతో కూడిన మార్గం అభివృద్ధి చెందుతున్న దేశాలలోని ప్రజలను తీవ్రమైన కడగండ్లపాలు చేస్తుంది. మేము చరిత్రలో సరైన వైపున, మానవజాతి పురోగమనం వైపున దృఢంగా నిలిచివుంటాం. శాంతి, అభివృద్ధి, సహకారం, పరస్పర ప్రయోజనాల కోసం అంకితమైన మేము మా అభివృద్ధి కోసం కృషి చేస్తూనే ప్రపంచ అభివృద్ధి, ప్రపంచశాంతి కోసం నిలబడతాం. మా అభివృద్ధి ద్వారా ప్రపంచ అభివృద్ధికి, శాంతికి సహకరిస్తాం.

చైనా ఆధునీకరణకు అవసరమైన అంశాలను గురించి సిపిసి నివేదికలో ఈ విధంగా చెప్పారు:" చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన్ని బలపరచాలి. చైనా లక్షణాలతో కూడిన సోషలిజాన్ని అభివృద్ధి చేయాలి. ఉ న్నతస్థాయి అభివృద్ధి కోసం కృషి చేయాలి. జనతా ప్రజాస్వామ్యాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలి. ప్రజల సాంస్కృతిక జీవనాన్ని సంపద్వంతం చేయాలి. అభివృద్ధిని ప్రజలం దరూ అనుభవించేలా చేయాలి. మానవులు, ప్రకృతి మధ్య సమన్వయాన్ని సాధించాలి. భవిష్యదభివృద్ధితో ఒకేవిధమైన ప్రయోజనాలు పొందే మానవ సమాజాన్ని ఏర్పాటుచేయాలి. మానవ పురోగమనానికి నూతన మార్గాన్ని రూపొందించాలి".

శతాబ్ది లక్ష్యాలలో రెండవ దానిని సాధించటానికి రెండు దశల వ్యూహాత్మక ప్రణాళికను రూపొందించారు. 2020 నుండి 2035 మధ్యకాలంలో మౌలికమైన సోషలిస్టు ఆధునీకరణను సాధించటం మొదటి దశ. 2035 నుండి ఈ శతాబ్దం మధ్య నాటికి అభివృద్ధి చెందిన, దృఢమైన, ప్రజాస్వామికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి చెందిన, సమైక్యమైన, సర్వాంగ సుందరమైన గొప్ప ఆధునిక సోషలిస్టు దేశంగా చైనాను నిర్మించటం రెండవ దశ లక్ష్యంగా ఉన్నది.

2035వ సంవత్సరం నాటికి నిర్దేశించు కున్న లక్ష్యాలు ఈ విధంగా ఉన్నాయి.

1. ఆర్థికశక్తిని, శాస్త్ర, సాంకేతిక రంగా లలో సామర్థ్యాన్ని, భిన్నరంగాలలో జాతీయ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచు కోవాలి. తలసరి ఆదాయాన్ని మధ్యస్థాయిలో అభివృద్ధి చెందిన పెట్టుబడిదారి దేశాల స్థాయికి పెంపొందించుకోవాలి.

2. శాస్త్ర, సాంకేతిక రంగాలలో స్వయం సమృద్ధిని సాధించటం ద్వారా ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో నూతన ఆవిష్కరణలు చేసే దేశాల సరసన చేరాలి.

3. ఆధునిక ఆర్థికవ్యవస్థను నిర్మించాలి. నూతన తరహా అభివృద్ధిని సాధించాలి. మౌలికంగా నూతనమైన పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, వ్యవసాయరంగాల ఆధునీకరణ సాధించాలి.

4. ప్రభుత్వ నిర్వహణను ఆధునీక రించాలి. సమగ్రమైన జనతా ప్రజాస్వామిక వ్యవస్థ అభివృద్ధికి మరింత కృషి చేయాలి. చట్టం పునాదిగా ఉండే దేశాన్ని, ప్రభుత్వాన్ని, సమాజాన్ని నిర్మించాలి.

5. విద్య, శాస్త్ర, సాంకేతిక రంగాలు, ప్రతిభ, సంస్కృతి, ఆటలు, ఆరోగ్యరంగాలలో ఉన్నతస్థాయికి చేరాలి.

6. ప్రజలు ఉన్నతమైన, సుఖప్రదమైన జీవితాన్ని గడిపేలా చేయాలి. ప్రజలు వినియో గించుకొనే ఆదాయాన్ని నూతనస్థాయికి పెంచాలి. మొత్తం ప్రజలలో మధ్య తరగతి వారి సంఖ్యను పెంచాలి. మౌలిక సదుపాయా లను ప్రజలందరికీ సమానంగా అందుబాటు లోకి తీసుకురావాలి. గ్రామీణప్రాంత జీవనాన్ని నూతన ప్రమాణాలకు చేర్చాలి. దీర్ఘకాలిక సామాజిక శాంతిని సాధించాలి. ప్రజలంద రికీ అభివృద్ధిని అందించటంలో స్పష్టమైన మార్పు తీసుకురావాలి.

7. జీవన విధానం, పనిని పర్యావరణానికి అనుగుణంగా మలచుకోవాలి. పైస్థాయికి చేరిన కార్బన్ ఉద్గారాల విడుదలను క్రమంగా తగ్గించాలి. మౌలికంగా పర్యావరణాన్ని అభి వృద్ధి చేయాలి. సర్వాంగ సందరమైన చైనాను నిర్మించటాన్ని దాదాపుగా పూర్తిచేయాలి.

8. జాతీయ భద్రత సామర్థ్యాన్ని, జాతీయ భద్రతా వ్యవస్థను సమగ్రంగా బలపరచు కోవాలి. జాతీయ రక్షణ, సాయుధ బలగాల మౌలిక ఆధునీకరణను సాధించాలి.

2035 నాటికి ఈ లక్ష్యాలను సాధించిన తర్వాత ఈ పునాదిని ఆధారం చేసుకొని 2049 నాటికి చైనాను గొప్ప ఆధునిక సోషలిస్టు దేశంగా అభివృద్ధి చేయటం కోసం కష్టపడి పనిచేయాలని నిర్దేశించుకున్నారు. చైనా కమ్యూ నిస్టు పార్టీని మరింత బలపరచుకోవటం, దాని పనిలో గుర్తించిన బలహీనతలను తొలగించు కోవటం ద్వారానే దీనిని సాధించటం సాధ్యమౌతుందని పేర్కొన్నారు.

**(ముగింపు జనవరి సంచికలో.....**

**అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# అధికార కేంద్రీకరణ పెంచే టెలికాం ముసాయిదా బిల్లు

**ప్రబీర్ పుర్కాయస్థ**



రచయిత న్యూస్ క్లిక్ వెబ్‌పోర్టల్ ఎడిటర్, ఇంజినీరు. విద్యుత్, టెలికమ్, సాఫ్ట్‌వేర్ రంగాలను లోతుగా అధ్యయనం చేశారు.

ప్రభుత్వం ఇటీవల భారతీయ టెలికమ్యూనికేషన్ ముసాయిదా బిల్లు 2022ని ప్రజాచర్చ కోసం విడుదల చేసింది. అదే సమయంలో ఐదేళ్లుగా రూపొందించబడుతున్న వ్యక్తిగత డేటా రక్షణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ బిల్లు పౌరుల గోప్యతా హక్కుల గురించి, గోప్యతను పౌరుల ప్రాథమిక హక్కుగా ప్రకటిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి పుట్టుస్వామి ఇచ్చిన తీర్పు ఆధారంగా తయారు చేయబడింది. అయితే ఇందులో పౌరులు, హక్కులు అనేవాటిని ఇప్పటికీ నిర్వచించలేదు. దీనికి విరుద్ధంగా పౌరులకు సంబంధించి వారి వ్యక్తిగత విషయాలను తెలుసుకోవటం, వారి కార్యకలాపాలను చూడగలగటం లేదా వినగలదు అనే వాటిపై ప్రభుత్వ అధికారాలు విపరీతంగా పెరిగాయి.

ఈ ముసాయిదా టెలికాం బిల్లు పౌరులు మరియు సేవలను అందించేవారిపై ప్రభుత్వానికి అధికారాలను పెంచడమే కాకుండా, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) మరియు టెలికాం వివాదాల పరిష్కారం మరియు పునర్విచారణ ట్రిబ్యునల్ (టిడి శాట్) పాత్రను గణనీయంగా తగ్గిస్తుంది.

ఈ బిల్లు 1885 ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టాన్ని భర్తీ చేయడానికి ఉంది. అలానే ఇప్పుడు ఇది పౌరులపై కేంద్ర ప్రభుత్వ అధికారాలను విస్తరించడానికి ప్రయత్నం చేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలకు కొనసాగింపుగా ఉంది. కానీ వ్యవసాయ బిల్లుల తరహాలో ఈసారి ప్రభుత్వం పార్లమెంట్‌లో దీనిని ఏకాయకిని ప్రవేశపెట్టలేదు.

మోడీ ప్రభుత్వం తన పోలీసింగ్ అధికారాలను విస్తరించడం మరియు ఒక నిఘా వ్యవస్థని రూపొందించడం అనేది ఈ బిల్లు యొక్క ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ఇది సేవలు అందించేవారు వారి వినియోగదారుల డేటాను ప్రభుత్వానికి ఇవ్వటాన్ని తప్పనిసరి చేస్తుంది. ఇది సిగ్నల్, టెలిగ్రామ్ వంటి యాప్‌లు ఎండ్–టు–ఎండ్ ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్‌లను ఉపయోగించడం అసాధ్యం చేసే నియమాలను రూపొందించడానికి యూనియన్ ప్రభుత్వానికి వీలు కల్పిస్తుంది. అప్పుడు ఇటువంటి అప్లికేషన్స్ అధికారిక లైసెన్స్‌లు అవసరమయ్యే ఓటిటి సేవలుగా పరిగణించబడతాయి.

దీని యొక్క మరొక పర్యవసానమేమిటంటే ఇంటర్నెట్‌ని ఉపయోగించి కొత్త లేదా వినూత్న సేవలను అభివృద్ధి చేయడం మరింత కష్టతరం అవడం. దీని అర్థం ఏమిటంటే ఇప్పటికే ఉన్న గుత్తాధిపత్యాన్ని బలోపేతం చేయడం,అంతర్జాలం ఉపయోగించి ఏదైనా వాణిజ్య సేవలను అందించడానికి పెద్ద కంపెనీలను మాత్రమే అనుమతించడం. ముసాయిదా బిల్లు అన్ని సేవలను తగిన లైసెన్స్‌లు అవసరమయ్యే ఓవర్ ది టాప్ (ఓటిటి) సేవలుగా నిర్వచిస్తున్నది.

ఈ బిల్లు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా(ట్రాయ్)కి ఏమి చేస్తుందో చూద్దాం.

టెలికాం సేవలను స్వతంత్ర వ్యవస్థగా నిర్వహించడానికి, విధానాలను రూపొందించడానికి ట్రాయ్ ఏర్పాటు చేయబడింది. ఇప్పుడు ఈ రెండు పాత్రలను ప్రభుత్వ టెలికాం డిపార్ట్‌మెంట్ (డిఓటి ) పూర్తిగా తానే తీసుకుంటుంది, అప్పుడు ట్రాయ్ పనల్లా ప్రభుత్వం ఏమి చేయమని చెబుతుందో అది చేయటం. ట్రాయ్ విధుల్లో ఒకటైన టారిఫ్‌లు విధించటం కూడా డిఓటి అధీనంలో ఉంటుంది, కానీ అలాంటి అధికారాలు టెలికమ్యూనికేషన్స్ చట్టం కింద ఉండాలి.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుట్టుస్వామి ఈ అంశాలపై ఇచ్చిన తీర్పు గోప్యత ప్రాథమిక హక్కు అని, గోప్యతపై ఏదైనా అతిక్రమణ జరగాలంటే అది చట్టబద్ధంగా, సహేతుక లక్ష్యంతో ఉండాలని పేర్కొంది. అంటే ఉద్దేశ్యాలు మరియు వాటిని సాధించడానికి అనుసరించే మార్గాల మధ్య హేతుబద్ధమైన సంబంధం ఉండాలి. దురదృష్టవశాత్తూ డేటా రక్షణ చట్టం ఐదు సంవత్సరాలుగా తయారీలో ఉండి, తిరిగి త్రిశంకు స్వర్గంలోకి పోయింది. సమస్య ఏమిటంటే పౌరులపై సామూహిక నిఘాను చట్టం సమర్థించదని జస్టిస్ పుట్టుస్వామి తీర్పు స్పష్టం చేసినప్పటికీ, డేటా రక్షణ చట్టం లేకుండా పౌరుడు ఈ హక్కును వినియోగించుకోవడానికి ఏమీ మిగలదు. అధికారికంగా నోటిఫై చేయబడిన ప్రభుత్వం యొక్క పది ఏజెన్సీలు ఎటువంటి నియంత్రణ లేకుండానే నిఘా నిర్వహించవచ్చు. ఈ ముసాయిదా టెలికాం బిల్లు అంతార్జాలంలోని అన్ని కమ్యూనికేషన్స్‌ను టెలికాం సేవగా నిర్వచించి ప్రభుత్వ అధికారాలను ఎలా విస్తృతం చేస్తుందో ఇప్పుడు చూద్దాం.

ముసాయిదా టెలికాం బిల్లులోని కీలకమైన ప్రతిపాదనలలో ఒకటి ఓవర్ ది టాప్ సర్వీసెస్ అనే పదాన్ని ఉపయోగించడం, దీనినే టెలికాం మరియు డేటా పరిభాషలో ఓటిటి సేవలు అంటారు. దీనర్థం నెట్ ఫ్లిక్స్, హాట్ స్టార్, అమెజాన్ మొదలుకొని తమ పరిసర ప్రాంతాలలో కిరాణా సామాగ్రిని సరఫరా చేసే చిన్న కిరాణా వ్యాపారుల వరకు యాప్‌ని ఉపయోగించే ఏ సేవ అయినా ఇకనుంచి రిజిస్ట్రేషన్ మరియు లైసెన్స్ అవసరమయ్యే ఓటిటిసేవగా పరిగణించబడుతుంది.

ఇంటర్నెట్‌ను ఉపయోగించే ఏ సేవనైనా ఓటిటి సేవగా పిలవటంలో రెండు సమస్యలు ఉన్నాయి. ఒకటి మనం టెలికమ్యూనికేషన్స్‌లో వాయిస్ మరియు డేటా సేవలను మాత్రమే సేవలుగా గుర్తిస్తాము. మనకు వైర్ల ద్వారా నేరుగా వాయిస్ ప్రసారం ఉంది, లేదా అంతర్జాలం ద్వారా పంపబడిన ప్రతిదీ డేటా ప్యాకెట్‌లుగా విభజించబడి, సందేశం అందుకునే చోట వాయిస్, ఇమేజ్ లేదా డేటాగా మళ్లీ సమీకరించబడతాయి. ఓవర్ ది

> **"ప్రపంచంలోని అనేక సేవలు నియంత్రించబడతాయి. ఉదాహరణకు వైద్య సేవలు. ఇవి కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో ఆరోగ్య మంత్రిత్వ శాఖచే నియంత్రించబడతాయి. అదేవిధంగా విద్య, వాణిజ్యం మొదలైన వన్నీ వాటిపై ఆధారపడి వివిధ నిబంధనలతో ఉంటాయి. అందువల్ల అటువంటి సేవలన్నింటిని ఓటిటి సేవలని పిలవడం, వాటిని కేంద్రప్రభుత్వం గొడుగు కిందకు తీసుకురావడం తో కేంద్ర ప్రభుత్వం, టెలికాం శాఖ రెండూ కూడా వాటి స్థాయికి మించిన అధికారాలను చలాయించటానికిప్రయత్నం చేయటమే అవుతుంది."**

టాప్ సర్వీసెస్ వంటి అన్నింటినీ కలిపే పదాన్ని ఉపయోగించడం డేటా ఎలా ఫంక్షన్ చేస్తుంది అనే దానిలోకి వెళుతుంది, అది టెలికమ్యూనికేషన్స్ విభాగంచే నియంత్రించబడే టెలికమ్యూనికేషన్ ఫంక్షన్ కాదు.

భౌతిక ప్రపంచంలో అందించబడుతున్న అటువంటి అనేక సేవలు నియంత్రించబడతాయి. ఉదాహరణకు వైద్య సేవలు. ఇవి కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో ఆరోగ్య మంత్రిత్వ శాఖచే నియంత్రించబడతాయి. వాటిని మున్సిపల్ అధికారులు కూడా నియంత్రించవచ్చు. అదేవిధంగా విద్య, వాణిజ్యం మొదలైన వన్నీ వాటిపై ఆధారపడి వివిధ నిబంధనలతో ఉంటాయి. అందువల్ల అటువంటి సేవలన్నింటిని ఓటిటి సేవలని పిలవడం, వాటిని కేంద్ర ప్రభుత్వం గొడుగు కిందకు తీసుకురావడం తో కేంద్ర ప్రభుత్వం, టెలికాం శాఖ రెండూ కూడా వాటి స్థాయికి మించిన అధికారాలను చలాయించటానికి ప్రయత్నం చేయటమే అవుతుంది.

ఇక టెలికాం వైపు నుండి సేవలను పరిశీలిస్తే, రెండు ప్రధాన సేవలు మాత్రమే ఉన్నాయి: టెలిఫోన్ మరియు అంతర్జాల సేవలు. భౌతిక అవస్థాపన సాధనాలయిన కాపర్ వైర్లు, ఫైబర్ ఆప్టిక్ లేదా వైర్‌లెస్‌లు, ఇవి సేవను డేటా లేదా వాయిస్ సేవగా నిర్వచించడానికి ఉపకరించవు. టెలిఫోన్ కాల్ మరియు అంతర్జాల కాల్స్ రెండూ వాయిస్ కమ్యూనికేషన్‌ను అందిస్తున్నప్పుడు వాటి మధ్య మనం ఎందుకు తేడా చూపాలి? వాయిస్ ఈ విధంగా పంపబడుతుంది: నేరుగా వైర్‌లెస్ లేదా వైరు కనెక్షన్ ద్వారా లేదా వాయిస్ నుండి డేటాకి మరియు తిరిగి వాయిస్‌కి మార్చబడుతుంది. ఈ రెండు మాత్రమే టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు అందించే సేవలు. డేటా ప్యాకెట్ల లోపల జరిగేది టెలికాం నిబంధనల పరిధిలోకి రాదు.

మనం కొన్ని ఉదాహరణలను పరిశీలిద్దాం: ఇంటర్నెట్ ద్వారా కన్సల్టేషన్ జరిపే డాక్టర్, చిన్న కిరాణా దుకాణం లేదా రెస్టారెంట్ తాము అందించే సేవలకు ఓటిటి సేవా ప్రదాత వద్ద నమోదు చేసుకోవాలి లేదా ప్రధాన గుత్తాధిపత్య సేవా ప్రదాతలో చేరాలి, వారి సంపాదనలో ఎక్కువ భాగాన్ని అటువంటి వారికి అందజేయాలి. ఓటిటి సేవకు లైసెన్సింగ్ అవసరం కాబట్టి కొత్త వినూత్న సేవ ఏదీ ప్రవేశపెట్టబడదు, ఇది ప్రస్తుతం ఉన్న గుత్తాధిపత్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది.

టెలికాం సేవలు వాయిస్ మరియు డేటాకే పరిమితం కావడానికి ఒక కారణం ఉంది. అలా కాకపోతే టెలికాం కంపెనీలు డేటా ప్రసార నెట్‌వర్క్‌పై వారికి గల గుత్తాధిపత్యం కారణంగా అంతర్జాలంలో వచ్చే కొత్త సేవా ప్రదాతలను (సమాచారం కోసం ఇ-మెయిల్, బులెటిన్ బోర్డులు, వార్తా సేవలు లేదా అలాంటి సేవలు) నియంత్రణ చేయవచ్చు. అందుకే ఇంటర్నెట్ తటస్తత నిబంధనలు అమల్లోకి వచ్చాయి.

ఫేస్ బుక్‌కి మరియు దాని ఫ్రీ బేసిక్స్‌కి వ్యతిరేకంగా ఈ అంశాలపైనే యుద్ధం జరిగిందని మనం ఒకసారి గుర్తుచేసుకోవటం అవసరం. ఫేస్‌బుక్ తానే ఒక అంతర్జాలం అని అనుకుని ఈ చిన్న ప్రైవేట్ అంతర్జాలాన్ని అందించడానికి కొన్ని టెలికాం ఆపరేట్ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. భారతదేశంలోని అంతర్జాల వినియోగదారులు దీనికి వ్యతిరేకంగా పోరాడారు. అంతర్జాల తటస్థత సూత్రాల ఆధారంగా ట్రాయ్ ఆ ఒప్పందాలను తిరస్కరించింది, బహుశా అది ఫేస్‌బుక్ కి (ఇప్పుడు మెటా) అతిపెద్ద ఓటమి.

డేటాపై ఆధారపడిన అన్ని సేవలను ఓటిటి సేవలుగా నిర్వచించడం వల్ల కేంద్ర ప్రభుత్వం నియంత్రణకు దారితీయడమే కాకుండా, అంతర్జాల సేవలను అందించే గుత్తాధిపతులు తమ గుత్తాధిపత్యాన్ని ఇతర సేవా ప్రదాతలకు వ్యతిరేకంగా ఉపయోగించడానికి అనుమతిస్తుంది, కొత్త సేవలు రాకుండా నిరోధిస్తుంది.

2015లో ట్రాయ్ ఓటిటి సేవలపై ముసాయిదా పత్రాన్ని పంపిణీ చేసింది. నేను కలసి పనిచేస్తున్న ఢిల్లీ సైన్స్ ఫోరమ్ మరియు నాలెడ్జ్ కామన్స్‌తో సహా వివిధ సంస్థలు ఈ చర్యకు వ్యతిరేకంగా వివరణాత్మక కారణాలను అందించాయి. డేటా సేవలను ఓటిటి సేవలుగా వేరు చేయడానికి జరిగే ఇటువంటి ప్రయత్నం చిన్న మరియు కొత్త సేవలు అందించే వారిపై భయంకర ప్రభావాన్ని చూపుతుందని, నూతన ఆవిష్కరణలను గణనీయంగా ఆపుచేస్తుందని మేము వాదించాము. ఇలాంటి విమర్శలను ఎదుర్కొన్న ట్రాయ్ ఆ ప్రతిపాదనను ముందు కు తీసుకెళ్లలేదు. ఆసక్తికరమైన విషయమేమంటే అదే ఓటిటి సూత్రీకరణలు ఏడు సంవత్సరాల తర్వాత మళ్లీ తిరిగి వచ్చి చట్టంగా చేయబడు తున్నాయి.

ప్రభుత్వం ఏవైనా కొత్త నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఈ నిర్ణయాల వల్ల ఎవరికి లాభం కలుగుతుంది? లేదా అపరాధ పరిశోధనలలో అనేటట్టు, ఎవరు లబ్ది పొందుతారు? అన్న అంశాలను పరిశీలించాలి. వీటితో లబ్దిపొందేది కేంద్ర ప్రభుత్వమే అని ఇక్కడ చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. లబ్ధిదారులపై అది తన లైసెన్సింగ్, నిఘా అధికారాలు రెండింటినీ విస్తరించాలనుకుంటోంది. అలానే ఇతర లబ్దిదారులు, దేశంలోని ప్రధాన టెలికాం ఆపరేటర్లు అయిన రిలయన్స్ జియో, ఎయిర్ టెల్, వొడాఫోన్ ఐడియా కూడా ప్రధాన అంతర్జాల సేవ ప్రదాతలు. ముఖ్యంగా వాయిస్ మెస్సేజింగ్ అప్లికేషన్స్ మీద తమ గుత్తాధిపత్యాన్ని దెబ్బతీస్తుందనుకునే ఏ పోటీ నైనా వాళ్ళు ప్రతిఘటిస్తున్నారు. ఈ కొత్త చట్టం క్రింద ఓటిటి సేవలు అందించే వారుగా పరిగణింపబడబోయేవారిపై టెలికాం సేవలు అందించే వారిలో ముఖ్యులు తమ యొక్క నిర్ణయాలను రుద్దే శక్తిని పెంచేందుకు, అంతర్జాల తటస్థతని వదిలించుకునేందుకు ఇవి ఒక మార్గమా?

టెలికంని ఈ కొత్త దిశలోకి నెడుతున్నది ఎవరైనప్పటికీ, అది ప్రపంచంలో ఈ రోజున అతి వేగంగా వృద్ధి చెందుతున్న రంగాలలో ఒక్కటైన టెలికంలో నవీకరణ యొక్క గొంతు నొక్కుతుంది. భారతదేశ వినియోగదారులు, నియంత్రణ శక్తులు కలిసి సృష్టించిన అంతర్జాల తటస్థతా సూత్రాలపై ఆధారపడిన ప్రస్తుత అంతర్జాలాన్ని ఇది చాలా వెనక్కి గుంజుకు వెళుతుంది. అంతర్జాల తటస్థతకి, భాగస్వామ్య శీలమైన విధాన సృష్టికి ఆదర్శంగా పేర్కొనే భారతదేశం ఈనాడు ఇలాంటి వెనకబాటు విధానాలని మళ్ళీ ఎందుకు ప్రవేశ పెడుతోంది? నిఘాపై ప్రేమా? లేక ప్రయివేటు టెలికం గుత్తాధిపతుల మీద అనురాగమా?

**(అనువాదం: కురెళ్ళ పుష్పవల్లి)**

# పర్యావరణ మార్క్సిజం - పర్యావరణ నాగరికత



రచయిత పర్యావరణంపై అనేక గ్రంథాలు, వ్యాసాలు రాశారు.

**జాన్ బెల్లమీ ఫాస్టర్**

**(మంత్లీ రివ్యూ పత్రిక సంపాదకుడు జాన్ బెల్లమి ఫాస్టర్ 2022, జూన్ 24వ తేదీన అమెరికాలోని కాలిఫోర్నియాలో జాన్ కొబ్ పర్యావరణ విద్యాసంస్థలో ఇచ్చిన ఉపన్యాస పాఠం మార్క్సిస్టు పాఠకులకు అందజేస్తున్నాం....సంపాదకుడు)**

నేనీరోజు పర్యావరణ నాగరికతకు, పర్యావరణ మార్క్సిజానికి, పర్యావరణ విప్లవానికి ఉన్న సంబంధాలను, అవి ఒకదానితో ఒకటి ఏవిధంగా ముడిపడి ఉన్నాయో, ఆ వైరుధ్యాలను కలిపి చూస్తే, 21 వ శతాబ్దంలో నూతన విప్లవానికి ఏ రకంగా అది దారిచూపుతుందో చర్చిస్తాను. ఇంకా నిర్దిష్టంగా నేనో ప్రశ్న వేయాలనుకుంటున్నాను... పర్యావరణ నాగరికత మూలాలను, చరిత్ర ప్రాధాన్యతను మనం ఎలా అర్థం చేసుకోవాలి? దానికీ పర్యావరణ మార్క్సిజానికీ ఉన్న సంబంధం ఏమిటి? కార్ల్ మార్క్స్ చెప్పిన "మానవ వంశ పారంపర్యాన్ని" కాపాడడానికీ, ప్రధానంగా ప్రస్తుతం భూమిపై జీవిస్తున్న సాధారణ ప్రాణకోటిని కాపాడడానికీ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న విప్లవ పోరాటాలకూ ఉన్న సంబంధం ఏమిటి?

2018లో జెరిమి లెంట్ అనే సాంస్కృతిక సిద్ధాంతవేత్త, తన ఇంటర్నెట్ 'ఏకోసైట్'లో 'ది పాటర్నింగ్ ఇన్స్టింక్ట్ : ఎ కల్చరల్ హిస్టరీ అఫ్ హ్యూమానిటీస్ సెర్చ్ ఫర్ మీనింగ్' అనే వ్యాసంలో చైనా 'పర్యావరణ సంస్కృతి' ప్రభావం మన భవిష్యత్తుపై ఏ విధంగా ఉంటుందో వివరించారు. ఇందులో చైనా పర్యావరణ నాగరికత ప్రత్యేకతలను గుర్తిస్తూనే, చైనాకి పర్యావరణంపై గల మార్క్సిస్టు దృక్పథానికీ, పెట్టుబడిదారీ వ్యవస్థను పరిశీలించే విధానంలో పశ్చిమ దేశస్థుల విచిత్రమైన దృక్పథానికీ మధ్య తేడాను వివరించారు. ఆ వ్యాసం మొదలు పెడుతూనే ఆయన ఇలా చెప్పాడు: "అమెరికా అధ్యక్షుడు తన ప్రారంభోత్సవ ఉపన్యాసంలో, "పర్యావరణ నాగరికత", "మనిషికీ ప్రకృతికీ మధ్య సామరస్య సంబంధం" ఉండాలని పిలుపునిచ్చారని అనుకుందాం. ఆయన "మానవులమైన మనం, ప్రకృతిని గౌరవించాలి, దాని విధానాలు అనుసరించాలి, దానిని రక్షించాలి" అన్నారని అనుకుందాం. తన పాలన "సాధారణ, మధ్యమ, హరిత, అతి తక్కువ కర్బన ఉద్గారాలను విడిచే జీవనాన్ని ప్రోత్సహిస్తుందని, దుబారాను, మితిమీరిన వినిమయాన్ని వ్యతిరేకిస్తుందని" ప్రకటించారను కుందాము. కానీ ఆయన ఆ పని చేయలేదు. ఎందుకంటే, అత్యంత ఆధునిక పశ్చిమ దేశాలలో కూడా ఏ రాజకీయ నాయకుడూ ఇటువంటి విధానం అమలు చేసి మన లేదు. కానీ చైనా అధ్యక్షుడు సి జిన్పింగ్, 2017లో జరిగిన కమ్యూనిస్టు పార్టీ మహాసభలో ఇటువంటి ప్రకటన చేయగలిగారు. అంతేకాదు తాను తీసుకోబోయే చర్యలను మరింత వివరంగా తెలియచేస్తూ... ఒక చట్టపరమైన విధాన రూపకల్పన చేసే దిశగా అడుగులు వేస్తాననీ, అవి హరిత వ్యాప్తికీ, అతి తక్కువ కర్బన ఉద్గారాల విడుదలకూ దారితీసే విధంగా ఉంటాయని, వృత్తాకారంలో అభివృద్ధి జరుగుతుందనీ, అడవుల పెంపకం పెరుగుతుందనీ, చిత్తడి నేలల పెరుగుదల, పునరుద్ధరణ ఉంటుందనీ, పర్యావరణాన్ని దెబ్బతీసే ఎటువంటి చర్యలనైనా కఠినంగా అణచివేస్తామనీ, పర్యావరణానికి హాని కలిగించే చర్యలను నిరోధిస్తామనీ" ప్రకటించారు. ఆయన తన ప్రసంగాన్ని ముగిస్తూ, ఈ రోజు మనం తీసుకుంటున్న చర్యలు, పర్యావరణ నాగరికత నిర్మాణానికి బాట వేస్తాయనీ, ఇవి రానున్న తరాలకు ఎంతగానో ఉపయోగ పడతాయనీ ప్రకటించారు. సంకుచిత ప్రయోజనాల పరిమితులు అధిగమిస్తూ, ఒక్క చైనా ప్రజల పురోగతేకాదు మొత్తం మానవాళి పురోగతికి మరిన్ని కొత్త దారులు వేసేందుకు పార్టీ కట్టుబడి ఉందని ప్రకటించారు.

చైనాకి ఈనాడు కేంద్రంగా ఉన్న ఈ పర్యావరణ నాగరికత గురించి పెట్టుబడిదారీ ప్రపంచం ఎందుకు మాట్లాడలేకపోతున్నది? అది పెట్టుబడిదారీ సిద్ధాంతం పరిధిలోనే ఎందుకు లేకుండా పోయింది? అది పశ్చిమ దేశాల సాంప్రదాయ సంస్కృతికి పూర్తిగా విరుద్ధమని లెంట్ వాదిస్తున్నారు. ప్లేటో నుండి నేటివరకు వారు ప్రకృతికి దూరంగా ఉన్నారు. ప్రకృతి అంటేనే జయించవలసిన విషయంగా చూస్తున్నారు. వేల సంవత్సరాలుగా చైనా పర్యావరణ విధ్వంసాన్ని చవిచూసినప్పటికీనూ... ఇది 5.000 చైనా ప్రాచీన పర్యావరణ నాగరికతకు విరుద్ధమైనది. వేల సంవత్సరాల నాడు ప్రాచీన నయా-కొన్ఫూషియన్ తాత్విక చింతనా పరుడు షేన్ శై రాసిన కింది పంక్తులను ఆయన ఉటంకిచ్చారు:

" స్వర్గం నా తండ్రి, పుడమి నా తల్లి, నేను పసివాడిగా వాటి మధ్యే, వాటితో ఎంతో సన్నిహితంగా జీవిస్తున్నాను. నా శరీరాన్ని ఆవహించింది ఈ విశ్వము. ఈ విశ్వాన్ని నడిపించేది నా ప్రకృతి అని నేను విశ్వసిస్తున్నాను. ప్రజలందరూ నా అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు. అన్ని వస్తువులు నా సహచరులు."

చైనా పర్యావరణ నాగరికత ఆలోచనలు గొప్పవే అయినా, వాటికీ ఈ నాటి చైనా రాజకీయ ఆర్థిక విధానాలకు, మార్క్సిజానికి ఎటువంటి సంబంధం లేదని లెంట్ అభిప్రాయం. నిజానికి అవి చైనా సాంప్రదాయ విలువలను పునరుద్ధరించడం అని లెంట్ భావన. అయితే ఇటువంటి దృక్పథం పశ్చిమ దేశాలలో ఊహించశక్యం కానీ విషయం. పశ్చిమ దేశాల, చైనా వారసత్వ సంస్కృతులు పూర్తిగా భిన్నమైనవి. పర్యావరణ నాగరికతకు సంబంధించిన భౌతిక పునాదుల విషయాలలో, పెట్టుబడిదారీ వ్యవస్థకీ సోషలిజానికీ సంబంధించిన విషయంలో ఆసియా, పశ్చిమ

> అందువలన మార్క్సిస్టు దృక్పథం ఈనాడు ఉద్భవిస్తున్న ప్రపంచ పర్యావరణ సంక్షోభాన్ని నివారించబడడానికీ, మార్క్సిజం విశ్లేషణకు అనుగుణమైన సుదీర్ఘ పర్యావరణ చరిత్ర విశ్లేషణకీ అనుగుణంగా, సోషలిస్టు పంథాకు అనుగుణంగా కొత్త పర్యావరణ నాగరికత ఉండాలని డిమాండ్ చేస్తుంది. పెట్టుబడి దారీ వ్యవస్థలో ఉండే పర్యావరణ వైరుధ్యాలను మార్క్స్ ఏంగెల్స్ సుదీర్ఘంగా విశ్లేషించారు.

దేశాలు పూర్తిగా భిన్నమైనవి. అందువలన చైనా పర్యావరణ నాగరికతకు ఇచ్చే ప్రాధాన్యతకీ పర్యావరణ మార్క్సిజానికీ ఎటువంటి సంబంధం లేదు. ఉంటేగింటే ప్రతికూల అర్థంలో ఏమాత్రమైనా ఉండి ఉంటుంది. పైగా పీపుల్స్ రిపబ్లిక్ అఫ్ చైనా ఒక నియంతృత్వ రాజ్యంగా చిత్రించబడింది. ఏమాత్రం స్వేచ్ఛ లేని అదుపాజ్ఞలకు మారుపేరుగా చెప్పబడింది. చైనాలో జరుగుతన్న ''విపరీత అభివృద్ధి'' పశ్చిమదేశాలలో జరుగుతున్న అభివృద్ధికంటే ఘోరమైనదనీ, అది మొత్తం భూమిని కాలుష్యమయం చేస్తుందనీ, వాస్తవంలో చైనా చెప్పుకుంటున్నట్టు పర్యావరణ నాగరికత నిర్మించడం లేదని అందుకు పూర్తి విరుద్ధంగా జరుగుతున్నదని వాదిస్తున్నారు.

యూరప్, ఉత్తర అమెరికాలలో బ్రహ్మాండ మైన రాజకీయ ఆర్థిక పునాదులు ఉండగా, అక్కడి పర్యావరణ అభివృద్ధి భంగపడడానికి కారణం, వారి వినాశకర సాంప్రదాయ పర్యావరణ సంస్కృతి అని లెంట్ అభిప్రాయం. అదే చైనాలో, వేల సంవత్సరాలుగా పర్యావరణ సంస్కృతి సామరస్య పూర్వ కంగా – మానవ అభివృద్ధి పర్యావరణం తో సామరస్యంగా జరగాలని – ఉంటుంది. కానీ అక్కడి “విపరీత పారిశ్రామిక అభివృద్ధి”, రాజకీయ ఆర్థిక నిరంకుశత్వం ఈ సామరస్యాన్ని నాశనం చేస్తున్నది. ఫలితంగా భూమి, దానిపై నివసిస్తున్న సమస్త జీవజాతి భవిష్యత్తు అంధకారంలో పడింది. అందువలన చైనాలో సాంప్రదాయకంగా ఉండే పర్యావరణ నాగరి కతను పునరుద్ధరించ కుంటే, మార్క్సిజంతో ప్రభావితమైన రాజకీయ ఆర్థిక లక్ష్యాలను విడిచిపెట్టకపోతే భూమికి ముప్పు తప్పదని లెంట్ భావన.

ఇది పూర్తిగా తప్పుడు అవగాహన అని నా అభిప్రాయం. చైనా సాంప్రదాయ విలువలు అనే పేరుమీద సోషలిజాన్నీ, మానవ అభివృద్ధినీ అడ్డుకునే ప్రయత్నం ఇది. పర్యావరణ నాగరికత అన్నది నిజానికి పర్యావరణ మార్క్సిజం అభివృద్ధి క్రమంలో ఒక చారిత్రిక ఘట్టం. చైనాకి సాంప్రదాయ విలువలు ఉన్నప్పటికీ, రెండిటినీ వేరుచేయడం అంటే, చారిత్రిక పర్యావరణ నాగరికత ప్రాధాన్యతను తక్కువ చేయడం. ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ విప్లవం ఆవశ్యకతనూ, ప్రాధాన్యతనూ తగ్గించి చూపడం.

### పర్యావరణ మార్క్సిజం, పర్యావరణ నాగరికత

1920–1930 దశకాల్లో ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ శాస్త్రం అభివృద్ధి చెందడంతో 1970–1980 దశకాల్లో సోవియట్ పర్యావరణ ఆలోచన పునరుత్థానం చెందింది. కానీ అనేక రాజకీయ సామాజిక కారణాల వలన ఆ తరువాతి కాలంలో పతనం అయింది. అయితే 1970, 1980లలో సోవియట్ యూనియన్‌లో పునరుత్థానం చెందిన తరువాత పర్యావరణ శాస్త్రం నాగరికతకు సంబంధించిన కొత్త రూపాన్ని, గుణాన్ని సంతరించుకుంది. ఇది 1983లో ఎడి ఉర్సుల్ సంపాదకత్వంలో ప్రచురించబడిన “ఫిలాసఫీ అండ్ ఏకాలోజికల్ ప్రోబ్లెంస్ అఫ్ సివిలైజేషన్” అన్న గ్రంథంలో ప్రధానంగా కనిపిస్తుంది. ఇందులో సోవియట్ యూనియన్‌లోని ప్రముఖ శాస్త్రవేత్తలు, తత్వవేత్తల వ్యాసాలు ఉన్నాయి. ఈ ప్రచురణ తరువాత ఇదే అంశం పై 1983–84 లలో మరిన్ని వ్యాసాలు ప్రచురించబడ్డాయి. దానితో పర్యావరణ నాగరికత అనే అంశం ప్రాధాన్యత సంతరించుకుందిబీ వెంటనే అది చైనీస్ మార్క్సిజం లోకి చేరింది. అక్కడ విశ్లేషణలతో ప్రధాన భాగంగా మారింది.

మార్క్సిజం అవగాహనలో పర్యావరణ నాగరికత అంటే వర్గ ఆధారంగా ఏర్పడ్డ నాగరికతల మధ్య పోరాటాలు. ప్రధానంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రకృతి, మానవులు..రెండు రకాలుగా ఆధిపత్యానికీ/ పరాయీకరణకీ గురవడాన్ని సూచిస్తుంది. పర్యావరణ సమస్యలు, తాత్వికత అనే అంశం మీద నాటి సోవియట్ అకాడమీ ఆఫ్ సైనెన్స్ ఉపాధ్యక్షులు పిఎన్ ఫెడోసీవ్ మాట్లాడుతూ “నాగరికత సాధించిన విజయాలను తిప్పికొట్టడం” గురించి వివరించారు. పర్యావరణాన్ని హరితంగా మార్చే ప్రయత్నంలో, అనేక చారిత్రిక ఊహలు నిండి ఉంటాయి. అవి తిరోగమన దిశగా, లేదా యాంత్రీకరణ దిశగా కూడా ఉండవచ్చు. మార్క్సుని అనుసరించే పర్యావరణ తత్వవేత్త ఇవాన్ ఫ్రొవోవ్.. మనిషి జీవవ్యవస్థకూ, ప్రకృతికీ మధ్య మనిషి శ్రమ, ఉత్పత్తి క్రమం, శాస్త్రీయ జ్ఞానం ఉందనీ, అదే ఉత్పత్తి విధానానికి దారి తీస్తుందని భావించారు. విఏ లాస్ అనే తత్వవేత్త, “సంస్కృతి ఎలా ప్రకృతికి విరుద్ధంగా తయారవుతుందో” పరిశోధించారు. అందువలన కొత్తగా “పర్యావరణ సంస్కృతి ” లేదా నాగరికత నిర్మించబడాలని, పర్యావరణం నిలబడే విధంగా సాంకేతిక రంగాలు పునర్నిర్మించ బడాలని అన్నారు. “పర్యావరణ సంస్కృతిని నిర్మించే క్రమంలో మనిషికీ అతని ఆవాసానికి మధ్య ఉన్న తీవ్రమైన వైరుధ్యాలు సైద్ధాంతికంగా మాత్రమేకాదు ఆచరణాత్మకంగా కూడా పరిష్కరించబడాలని” తేల్చారు.

అందువలన మార్క్సిస్టు దృక్పథం ఈనాడు ఉద్భవిస్తున్న ప్రపంచ పర్యావరణ సంక్షోభాన్ని నివారించబడడానికీ, మార్క్సిజం విశ్లేషణకు అనుగుణమైన సుదీర్ఘ పర్యావరణ చరిత్ర విశ్లేషణకీ అనుగుణంగా, సోషలిస్టు పంథాకు అనుగుణంగా కొత్త పర్యావరణ నాగరికత ఉండాలని డిమాండ్ చేస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉండే పర్యావరణ వైరుధ్యాలను మార్క్స్ ఏంగెల్స్ సుదీర్ఘంగా విశ్లేషించారు. కేవలం భూమి సారాన్ని కోల్పోవడం, పట్టణాలు పల్లెల మధ్య వ్యత్యాసాలు ఏర్పడడం, పారిశ్రామిక కాలుష్యం, బొగ్గు, శిలాజ ఇంధనాల తరుగుదల, అడవుల వినాశనం, ఆహార కల్తీ , మానవుల వలన వైరస్ వ్యాప్తి వగైరాలతో వారి అధ్యయనాన్ని సరిపెట్టలేదు. మార్క్స్ రూపొందించిన ‘జీవప్రక్రియ బీటలు వారడం’ సిద్ధాంతాన్ని వ్యాకోచింప చేస్తే, ఈనాటి పర్యారణ సంక్షోభానికీ, భూగోళంమీద పర్యావరణం విధ్వంసానికీ గల కారణాల అన్ని పార్శ్వాలు అర్థమవుతాయి.

ఇరవై ఒకటో శతాబ్దంలో చైనా పర్యావరణ మార్క్సిజం అభివృద్ధి చేసి, ఈ నాటి పర్యావరణ విధ్వంసానికి శక్తివంతమైన పరిష్కారాన్ని చూపడమే కాక పర్యావరణ సమస్యకు ఒక సమాధానంగా పర్యావరణ నాగరికతను నిలిపింది. సమాజం భౌతికంగా మనగలగడానికి కేవలం ఆర్థికాంశాలే ప్రధానం కాదు పర్యావరణ రక్షణ ప్రధానమనే స్పృహ

కల్పించింది. సి జిన్‌పింగ్ తన ప్రసంగంలో పర్యావరణ నాగరికతకు ప్రాధాన్యమిస్తూ, "సుందరమైన చైనా"ను , నిర్మించడానికీ, "ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండడానికి పర్యావరణం అత్యంత కీలకం" అని వివరించారు. "మనిషీ ప్రకృతీ ఒకే జీవరాశి. మనం మనుషులుగా ప్రకృతిని గౌరవించాలి, దాని విధానాలు అనుసరించాలి, దానిని రక్షించాలి. ప్రకృతికి మనం ఏ మేరకు హాని చేసినా అది మనలను వెంటాడుతూనే ఉంటుంది. ఇది మన ముందున్న వాస్తవం" అని ప్రకటించారు. ఇది మార్క్స్ ఏంగిల్స్‌ల ప్రాచీన పర్యావరణ విశ్లేషణకి దగ్గరగా ఉంది. "మనుషులు ప్రకృతిలో భాగం, ఉత్పత్తి చేసేటప్పుడు ప్రకృతి నియమాలను పాటించాలి. వాటిని గనక విస్మరిస్తే ప్రకృతి "పగ తీర్చుకుంటుంది" అని మార్క్స్-ఏంగెల్స్ శక్తివంతంగా వాదించారు. ఈనాడు చైనాలో పర్యావరణ నాగరికత అమలుచేస్తున్న సందర్భంలో కొత్త, విప్లవాత్మక మార్పు నాగరికతలో కనిపిస్తున్నది. ఇంతకు మునుపు నాగరికతలు మార్క్సిస్టు దృక్పథం నుంచి మాత్రమే విశ్లేషించేవారు. అవి వర్గ సమాజాలకు ముడిపడి ఉండేవి. అయితే చారిత్రికంగా కొత్త అభివృద్ధి స్థాయిలకు ఎదుగుతూ ఉండేవి. ఈ దృక్పథంలో పర్యావరణ నాగరికత అభివృద్ధిలో "ఒక మహత్తర ఆధునిక సోషలిస్టు సమాజ" నిర్మాణం ఒక దశ. ఇది పెట్టుబడిదారీ సమాజానికి పూర్తిగా భిన్నమైనది. ఇక్కడ ప్రజలను, భూగోళాన్ని లాభాల వేట కోసం త్యాగం చేయాల్సిన పనిలేదు. ఈనాడు పెట్టుబడిదారీ వ్యవస్థలో ఉండే సుస్థిర అభివృద్ధి అవగాహనకు భిన్నంగా, సోషలిస్టు వ్యవస్థ రాజకీయాలను, సంస్కృతిని పర్యావరణ నాగరికతలో అంతర్భాగం చేస్తుంది . ఇది "అయిదింట ఒకటిగా ఉండదు". స్వేచ్ఛాయుత స్థిర అభివృద్ధిగా చెప్పుకునే సాధారణ పర్యావరణ, ఆర్థిక, సామాజిక అంశాలను మించి ఉంటుంది. అందువలన సోషలిస్టు వ్యవస్థలో పర్యావరణ నాగరికత స్థిరమైన మానవ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుంటుంది. ఆర్థికేతర సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది. రాజకీయాలను తదనుగుణంగా నిలుపుతుంది.

చెన్ క్సు ఏమింగ్ 'ది ఇకొలాజికల్ క్రైసిస్ అండ్ లాజిక్ ఆఫ్ కాపిటల్' గ్రంథంలో సూచించినట్టు , సోషలిస్టు పర్యావరణ ఆధునికత పర్యావరణ నాగరికతలో మిళితమై ఉంటుంది. ఇక్కడ "నివారణ, సృజన, సమర్థత, భౌతికత, పర్యావరణ అనుకూలత, ప్రజాతంత్ర భాగస్వామ్యం, కాలుష్య ఫీజు వంటివి ఉండడం

> "పర్యావరణ నాగరికతను ఏర్పరచడానికి ఎనిమిది అంశాలుగా దీనిని విడగొట్టడం జరిగింది. 1. ప్రాదేశిక ప్రణాళిక, అభివృద్ధి 2. సృజనాత్మక సాంకేతికత, నిర్మాణాత్మక సర్దుబాట్లు 3. భూమి, నీరు, ఇతర సహజ వనరుల స్థిరమైన ఉపయోగం 4. పర్యావరణ, జీవ రక్షణ 5. పర్యావరణ నాగరికత వ్యస్థను క్రమబద్ధీకరించడం 6. పర్యవేక్షణ, నియంత్రణ 7. ప్రజల భాగస్వామ్యం 8. పర్యావరణ విధానం, ప్రణాళికను సంస్థాగతం చేయడం, అమలు చేయడం.



వలన ఆర్థిక, పర్యావరణ విషయాలలో కూడా ప్రయోజకరంగా ఉంటుంది.

"పర్యావరణ నాగరికతను ఏర్పరచడానికి ఎనిమిది అంశాలుగా దీనిని విడగొట్టడం జరిగింది. 1. ప్రాదేశిక ప్రణాళిక, అభివృద్ధి 2. సృజనాత్మక సాంకేతికత, నిర్మాణాత్మక సర్దుబాట్లు 3. భూమి, నీరు, ఇతర సహజ వనరుల స్థిరమైన ఉపయోగం 4. పర్యావరణ, జీవ రక్షణ 5. పర్యావరణ నాగరికత వ్యస్థను క్రమబద్ధీకరించడం 6. పర్యవేక్షణ, నియంత్రణ 7. ప్రజల భాగస్వామ్యం 8. పర్యావరణ విధానం, ప్రణాళికను సంస్థాగతం చేయడం, అమలు చేయడం.

చైనా విషయానికి వచ్చేసరికి, పర్యావరణ సంస్కరణలు ఇంత విప్లవాత్మక స్థాయిలో జరిపే ప్రయత్నం చేయడం, అదికూడా త్వరిత గతిన పశ్చిమ దేశాల స్థాయికి అభివృద్ధి చెందడాన్ని లక్ష్యంగా పెట్టుకోవడం ముదావహం. పర్యావరణాన్ని రక్షించడం ఆర్థిక అభివృద్ధి ప్రణాళికలన్నిటిలో భాగం చేయబడింది. ఈ పర్యావరణ ప్రణాళికలు అమలు చేయడం వలన ఆర్థికాభివృద్ధి కొంతమేరకయినా నెమ్మదిస్తుందన్న విషయం అంగీకరించడం అంటే పర్యావరణ నాగరికతకు వారిస్తున్న ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. కాలుష్యాన్ని నివారించడం, అడవుల విస్తరణ, ప్రత్యామ్నాయ ఇంధనాలను అభివృద్ధి చేయడం, నదీతీరాలపై నియంత్రణలు, గ్రామాలను పునరుజ్జీవింపచేయడం, సహకారం ద్వారా ఆహారంలో స్వయం సమృద్ధి సాధించ డం, ఇంకా ఇతర అనేక విషయాలలో చైనా పర్యావరణ నాగరికతను అమలు చేస్తున్నది. బొగ్గుపై ఆధారపడడాన్ని తీవ్రంగా తగ్గించింది. అయితే, గత కొంతకాలంగా కరోనా మహమ్మారి కారణంగా ఈ విషయాలలో కొంత వెనకపట్టు పట్టింది. అయినప్పటికీ పర్యావరణ నాగరికత అమలుచేయడానికి స్థిరమైన తేదీలను ఖరారు చేసుకుంది. 2035 కల్లా ఇందులోని అంశాలు అమలుచేయాలని నిర్ణయించుకుంది. 2050 కి అందమైన చైనా నిర్మించుకోవాలనీ, 2060 కల్లా కర్బన ఉద్గారాల విడుదల సున్నాకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ లక్ష్యాలను అధికార, ఆర్థిక శక్తులకు వదిలేస్తే, లక్ష్యాన్ని చేరుకోడం సాధ్యపడదని, ఫలితాలు పరిమితంగా ఉంటాయని చైనా గ్రహించింది. అందువలన చైనా విప్లవానంతర సమాజ పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుకోడానికి సమాజంలో పైనుండి, కింది నుండి కూడా తీవ్రమైన ప్రయత్నాలను చేస్తూవచ్చింది. పట్టణ గ్రామీణ ప్రాంతాల మధ్య అంతరాలను తగ్గించడానికి పూనుకుంది. ఉదాహరణకి, యిన్ యుజ్వెన్ అనే రైతు మహిళ ఇన్నర్ మంగోలియా

> " పర్యావరణ సమస్యలను చైనా ఎలా విజయవంతంగా పరిష్కరించుకుందో కరోనా మహమ్మారి ఆవరించిన సమయంలో చూడగలిగాము. అక్కడ పది లక్షల జనాభాకు నలుగురు మాత్రమే మరణించారు. అదే అమెరికాలో పది లక్షలమందికి 3,107 మంది మరణించారు. చైనా తన ప్రజలను కాపాడుకోవడంలో సఫలమైంది. అదే సమయంలో తన ఆర్థిక వ్యవస్థను కూడా కాపాడుకోగలిగింది. "

మారుమూల ప్రాంతంలో ఉన్న ఉక్సిన్ అనే ఎడారి ప్రాంతంలో నివసిస్తున్నది. ఆమె గత 37 సంవత్సరాలలో 5,00,000 చెట్లు నాటింది. ఆమె ఎడారులు సస్యశ్యామలం చేయడంలో ఆరితేరినది గా గౌరవించబడుతున్నది. ఆ ప్రాంతంలో అడవులను పెంచడంలో ఆమెకు రైతులు తోడయ్యారు. 6,700 చదరపు కిలోమీటర్ల ఇసక తిన్నెలను సస్యశ్యామలం చేశారు. అలాగే, యున్ జిఎంలో అనే పూర్వ హై స్కూల్ అధ్యాపకురాలు నీటి కాలుష్యాన్ని నివారించే సంస్థని విజయవంతంగా నిడిపించారు. 2002లో ఆమె గ్రీన్ హాన్ రివర్ అనే సంస్థను స్థాపించి హాన్ నది కాలుష్యానికి గురికాకుండా కాపాడారు. లెక్కలేనన్ని పర్యావరణ నివేదికలు రూపొందించారు. పరిశ్రమల యజమానులను, మేనేజర్లను వ్యతిరేకించారు. ఈ సంస్థలో 30,000 మంది స్వయం సేవకులు ఉన్నారు. 2018 కల్లా వేలాది ఫీల్డ్ ట్రిప్స్ ఏర్పరచి హాన్ నది కాలుష్యానికి గల కారణాలు కనుగొన్నారు. దీనికిగాను 1,00,000 కిలోమీటర్లు పర్యటించారు. పర్యావరణ రక్షణలో మొత్తం సమాజాన్ని భాగస్వాములను చేయడమే ఇందులో ప్రధానమైన అంశం. గోల్డ్ సాండ్ రివర్ ఒడ్డున ఉన్న షాంగ్రీ లాలో వా పింసాంగ్ అనే మహిళ తన గ్రామస్థులను సంఘటిత పరచి ఆనకట్ట నిర్మాణం జరగకుండా అడ్డుకుంది. ఆ ఆనకట్ట వలన లక్షమంది గ్రామీణులు నిర్వాసితులు అయి ఉండేవారు. 33,000 ఎకరాలు సారవంతమైన నేల నీట మునిగి ఉండేది. అక్కడ నివస్తున్న అనేక జాతులు ఈ ఉద్యమంలో ఆమెకు అండగా నిలిచారు. స్థానికంగా పర్యావరణానికి సంబంధించిన అంశాలను తీసుకోవడం, అందుకు ప్రజలను సంఘటిత పరచడం ఈ రోజు చైనాలో శక్తివంతమైన ఉద్యమంగా ఉంది. ఇది కొత్త పర్యావరణ కమ్యూనిజాన్ని అభివృద్ధి చేస్తుంది.

పర్యావరణ సమస్యలను చైనా ఎలా విజయవంతంగా పరిష్కరించుకుందో కరోనా మహమ్మారి ఆవరించిన సమయంలో చూడగలిగాము. అక్కడ పది లక్షల జనాభాకు నలుగురు మాత్రమే మరణించారు. అదే అమెరికాలో పది లక్షలమందికి 3,107 మంది మరణించారు. చైనా తన ప్రజలను కాపాడుకోవడంలో సఫలమైంది. అదే సమయంలో తన ఆర్థిక వ్యవస్థను కూడా కాపాడుకోగలిగింది. కానీ పశ్చిమ దేశాలు దీనిని కేవలం ఆధిపత్య ఫలితమని సమాజంపై నియంతృత్వంగా లాక్ డౌన్ విధించారని ప్రచారం చేస్తున్నాయి. అయితే , చైనా విజయానికి కారణం ప్రధానంగా మొదటిదశలోనే ప్రజావిప్లవ యుద్ధ వ్యూహం అమలుచేయడం. ప్రజాపంథా అవలంభించి రాజ్యం, పార్టీ తో ప్రజలను మమేకం చేయడం.

**చైనా, పర్యావరణ విప్లవం**

ప్రపంచమంతటిలో లాగే చైనా సమాజంలో కూడా పెద్ద ఎత్తున అంతర్గత జీవ వైరుధ్యాలు ఉన్నాయి. వార్షిక కర్బన ఉద్గారాల విడుదల పరంగా, చైనా అత్యంత ఎక్కువ కాలుష్యాలు విడుదల చేసే దేశం. అయితే, చైనా చేసే ఉత్పత్తులలో అత్యధిక శాతం వినియోగించేది పశ్చిమ దేశాలే. ఇప్పటికి కూడా అమెరికా, యూరప్ దేశాల కర్బన ఉద్గారాల విడుదలే చైనా కంటే ఎంతో ఎక్కువ. చైనా తలసరి ఉద్గారాల విడుదల అమెరికాలో సగం ఉంటుంది. చైనా భూమిని రక్షిస్తుందా అని బార్బరా ఫినమోర్ అనే అమెరికా కి చెందిన సీనియర్ 'స్ట్రాటెజిక్ డైరెక్టర్ ఫర్ ఆసియా ఆఫ్ ది నాచురల్ రిసోర్సెస్ డిఫెన్స్ కౌన్సిల్ పేర్కొన్నారు. "ఇప్పటికీ కర్బన ఉద్గారాల విడుదలలో ప్రథమస్థానంలో ఉన్నా , చైనా వాటిని తగ్గించేందుకు ఇతర దేశాలకన్నా ఎక్కువ ప్రయత్నాలు చేస్తున్నది. అయితే ఇప్పటికీ అనేక సవాళ్ళను ఎదుర్కొంటూనే ఉన్నది" అని ఆమె రాసారు. ఇది ఆర్థిక ప్రణాళికలో అత్యధిక శాతం సోషలిస్టు దృక్పథం ఉండడం వలన, ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేసుకుంటూ ఉండడం వలన, సమూహానికి విలువ ఉండడం వలన, రాజ్యం నిర్దేశం చేయడం వలన, పట్టణ పల్లె ప్రాంతాలు రెంటిలోనూప్రజలను నిరంతరంగా సమీకరిస్తున్నందువలన సాధ్యపడుతున్నది. ఇది మనలను తిరిగి లెంట్ ప్రశ్న వద్దకు తీసుకుని పోతుంది.. అమెరికా దేశాధినేత గాని యూరప్ దేశాధినేతలు గాని చైనా అధ్యక్షుడు సి జిన్‌పింగ్ ప్రకటించినట్టు సమాజ భవిష్యత్తును లక్ష్యంగా పెట్టుకుని ప్రస్తుత ఆర్థిక అభివృద్ధిపై ఒత్తిడిని తగ్గిస్తున్నామని ఎందుకు ప్రకటించ లేరు? దీనికి సమాధానం లెంట్ సూచించినట్టు చైనాలోని సాంప్రదాయకంగా ఉన్న పర్యావరణ విలువల ప్రాధాన్యత కాదు. లేదా పశ్చిమ దేశాల మాదిరిగా వేలాది ఏళ్లగా ప్రకృతిని జయించాలన్న దృక్పథం ఉండడం వలనా కాదు. మౌలికమైన బేధం, చైనా అనుసరిస్తున్న మార్క్సిజం- ప్రాచీన చారిత్రిక భౌతిక వాదం నుండి నేర్చుకున్న పర్యావరణ విధానం, దానిని సుదీర్ఘ సోషలిస్టు విప్లవం అంతాటా కేంద్ర బిందువుగా ఉంచుకున్న తీరు. ఇందుకు భిన్నంగా పెట్టుబడిదారీ వ్యవస్థ "సంచయనం! సంచయనం !!" మంత్రాన్నే జపిస్తూ ఉంటుంది. అదే విముక్తికి మార్గంగా చూపుతుంది.

కొద్ది మంది పెట్టుబడి దారుల ప్రయోజనాలు కాపాడానికే అంకితమైన అమెరికా సామ్రాజ్యవాద జీవన విధానానికి అలవాటు పడిన, పై స్థాయిలోని కొద్ది మంది ఉత్పత్తిదారుల లాభాలు కాపాడడానికి అంకితమైన అమెరికా, తన బాటను మార్చుకుని తక్కువ కర్బన ఉద్గారాలు విడుదల చేయడానికి పూనుకుంటుందనీ, "సాధారణ, హద్దులలో ఉండే, హరిత " విధానాలు అమలు చేస్తుందనీ, మితిమీరిన వినిమయాన్ని వ్యతిరేకిస్తుందనీ, చైనాలో లాగా అసమానతలను వ్యతిరేకిస్తుందనీ, పర్యావరణ నాగరికతను అమలు చేస్తుందని అనుకోలేము.

పశ్చిమ దేశాలలో ప్రపంచ పర్యావరణ విపత్తును ఎదుర్కోడం అంటే రాజ్యం అధీనంలో కొత్తగా కర్బన ఉద్గారాల విడుదల ఒప్పందాలు చేసుకోడం. మార్కెట్ యంత్రాంగం, సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు, పర్యావరణం కల్పించే ఉద్యోగాలు, అన్నీ రాజ్యం చేసుకోబోయే ఒప్పందాలతో ముడిపడి ఉంటాయి. అన్నిటికి మూలం ఉత్పత్తి నిరంతరంగా కొనసాగుతుండగలగడం. అమెరికాలోగానీ యూరప్‌లోగానీ శిలాజాల ఇంధన

శక్తిపెట్టుబడిని వ్యతిరేకించే ఒప్పందాలు, పాలక వర్గ ప్రయోజనాలకు భంగంగా ఉంటాయనే భావన వలన అమలుకాలేదు. ఫలితంగా మానవ మనుగడకి అవసరమైన ఈ భూమిని రక్షించే కర్తవ్యం ఈ నాటి పెట్టుబడిదారుల చేతులలో, ప్రైవేటు వ్యక్తుల చేతులలో ఉండిపోవడం దురదృష్టకరం. ఇది ప్రపంచ పర్యావరణ విధ్వంసానికి చారిత్రిక మూలాలుగా మిగిలిపోతుంది. మరో వైపు పర్యావరణ రక్షణ సంస్కరణలు రాజ్యం ఆర్థిక వనరులతో ప్రైవేటు కార్పొరేట్లకు మార్కెట్లు సృష్టించే సాధనంగా ఉంటాయి. ప్రకృతిని కూడా కొత్త రూపాలలో ద్రవ్యీకరించడం జరుగుతుంది. అందువలన పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ భవిష్యత్తును నాశనం చేస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థకు మూలంగా ఉన్న ధనిక , అభివృద్ధి చెందిన, సాంకేతికంగా పురోగతి సాధించినదేశాలు కేవలం వాటికున్న శక్తి వలన అతి సులభంగా పర్యావరణ సమస్యను పరిష్కరించగలవు. కానీ అలా చేయడం లేదు. వారి రాజకీయ అసమర్థతకు కారణం వారు సమూహంగా, ఆలోచించకపోవడం. పర్యవరణ సూత్రాలు వారి పెట్టుబడిదారీ వస్తు సమాజ సూత్రాలకు భిన్నంగా ఉండడం. ఏవిధమైన ప్రణాళికలు లేకపోవడం. ప్రజలు తమంతా తాముగా కదులుతారనే భయం పాలక వర్గాలలో ఉండడం. నిజానికి ఇది విప్లవాత్మకంగా మార్పులు జరగడానికి అత్యంత కీలకం. మానవ మనుగడకు అవసరమైన పర్యావరణ విప్లవం జరగాలంటే, పర్యావరణ సంస్కరణలు చేస్తే సరిపోదు.

విస్తృతంగా పర్యావరణ సామాజిక విప్లవాలు జరగాలి, వాటి లక్ష్యం పెట్టుబడిదారీ విధానాన్నే మార్చేదిగా ఉండాలి.

### విప్లవాత్మక పర్యావరణ సోషలిజం, భవిష్యత్తు

ఇప్పటివరకు నేను విప్లవ పర్యావరణ సోషలిజం లేదా పర్యావరణ మార్క్సిజం ప్రాధాన్యతను నొక్కి చెప్పాను. 1980లలో సోవియట్ యూనియన్‌లో మొదటిసారిగా ఈ అంశం వెలుగులోకి రావడం, అదే సూత్రం చైనాలో ప్రధాన ప్రాజెక్ట్ గా అమలవుతుండడం, ఈ విషయం ప్రపంచంలో మరెక్కడా అంతగా చర్చించక పోవడం యాదృశ్చికం కాదు. చైనా సంస్కృతిలో ఇది ఒక భాగమయినప్పటికీ, దీనిని కేవలం చైనా సాంప్రదాయ సంస్కృతిలో భాగమని చెప్పడం సరికాదు. తగిన సంబంధిత ఆధారాలు లేకపోవడం వలన ఈ విషయాన్ని ఆధునికాంతర సంస్కృతికి సంబంధించినదిగా చూడడంలో కూడా అర్థం లేదు. సోషలిజం నిర్మాణానికి ఆవల పర్యావరణ నాగరికత అనే భావనను ఊహించలేము. ప్రధానంగా మానవ అభ్యుదయానికి పెట్టుబడి సంచయమే అత్యంత కీలకమని భావిస్తున్న స్థితిలో, దానిని ఎదుర్కొంటున్న సందర్భంలో ఇక్కడే మార్క్సిస్టు పర్యావరణం పోషించ వలసిన ప్రధాన పాత్ర ఉంది.

> **“ చైనా అభివృద్ధి చేసిన పర్యావరణ మార్క్సిజం తన “స్వంత విప్లవ సంప్రదా యంలో” కొత్త పదజాలంతో సమస్యను గుర్తించి, సూటిగా పరిష్కరించే విధంగా విధానాలు రూపొందించి, వాటిని అమలు చేసే దిశగా శీఘ్రంగా అడుగులు వేస్తున్నది. ఇది పశ్చిమ దేశాల పరిశోధకులు పర్యావరణం గురించి చేసే నైరూప్య పరిశోధనలు, సూత్రీకరణ లకు పూర్తిగా భిన్నమైనది. ”**

చైనా అభివృద్ధి చేసిన పర్యావరణ మార్క్సిజం తన “స్వంత విప్లవ సంప్రదాయంలో” కొత్త పదజాలంతో సమస్యను గుర్తించి, సూటిగా పరిష్కరించే విధంగా విధానాలు రూపొందించి, వాటిని అమలు చేసే దిశగా శీఘ్రంగా అడుగులు వేస్తున్నది. ఇది పశ్చిమ దేశాల పరిశోధకులు పర్యావరణం గురించి చేసే నైరూప్య పరిశోధనలు, సూత్రీకరణలకు పూర్తిగా భిన్నమైనది. చైనా ముందుకు తెచ్చిన ఈ సరికొత్త పర్యావరణ విశ్లేషణ ప్రాచీన చారిత్రిక భౌతికవాద సిద్ధాంతం నుండి ఏర్పడ్డదే. ఇప్పుడు చైనాలో అనేకమంది పండితులు ఈ విషయంపై మరింత లోతుగా అధ్యయనాలు చేస్తున్నారు. అందులో కొన్ని “ప్రకృతిలో విశ్వవ్యాప్త జీవప్రక్రియ”, “సామాజిక జీవప్రక్రియ”, “సామాజిక జీవప్రక్రియ పరస్పరంగా ఆధారపడే క్రమంలో పూడ్చలేని బీటలు”, లేదా పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్న సందర్భంలో ఏర్పడుతున్న జీవప్రక్రియలో చీలికలు” అనే అంశాలు ఉన్నాయి. మనిషి కూడా విశ్వంలో గల సకల జీవరాశిలో అంతర్భాగమని విశ్వజీవన ప్రక్రియ గుర్తిస్తుంది.

మనిషి ఉత్పత్తి చేస్తున్న క్రమంలో ప్రకృతిని తనకనుగుణంగా మార్చుకుంటూ, ప్రతిస్పందిస్తూ ఎలా పురోగమిస్తాడో సామాజిక జీవనప్రక్రియ తెలియచేస్తుంది. జీవన ప్రక్రియ బీటలు వారిందంటే సామాజిక జీవన ప్రక్రియ పరాయీకరించబడిందన్నమాట. మనిషిని దోపిడీ చేసే క్రమంలో ప్రకృతి కూడా దోపిడీకి గురి చెయబడుతున్నది. అంటే పెట్టుబడి సంచయనం తప్పనిసరిగా పర్యావరణ సంక్షోభానికి దారితీస్తుంది.

మార్క్స్ ఇప్పుడు మనం మాట్లాడుకునే “సుస్థిర మానవాభివృద్ధి”ని గురించి సునిశితమైన నిర్ధారణ చేసారు. ఎవరికీ – ఈ భూమిపై నివసించే ప్రజలకు గానీ , లేదా ప్రపంచంలో ఉన్న దేశా లకు గానీ , భూమి సొంతంకాదు. మనం కేవలం పదిలంగా కాపాడుకోవలసిన నిర్వాహకులం మాత్రమే. భవిష్యత్తు తరాలకు అందించవలసిన బాధ్యత గల వారం. అంటే నిజంగా ప్రగతి సాధించాలంటే, ప్రకృతి నుండి దానితో అవినా భావ సంబంధంగల మానవ సమూహం నుండి , దోపిడీ చేసే, అణచివేసే క్రమంలో పరాయీ కరించ బడకూడదు. మార్పును తెచ్చేందుకు ప్రధానమైన శక్తి అంటే కేవలం ఆర్థిక కార్మికుడిగా, లేదా ఆర్థిక రైతుగా మాత్రవే ఉండకూడదు. పర్యావరణ కార్మికుడిగా, రైతుగా ఉండాలి. మరింత విస్తృతంగా భౌతిక వాదాన్ని తన ఆలోచనలలో భాగం చేసుకోవాలి. మనం ముందే చెప్పుకున్న– పర్యావరణ నాగరికత, పర్యావరణ విప్లవం, పర్యావరణ మార్క్సిజం అనే మూడు అంశాలు నాలుగో ప్రధానమైన అంశం– పర్యావరణ కార్మికుడు– లేకుండా అర్థరహిత మవుతాయి.

భూమితో మనకు మౌలికమైన భౌతిక సంబంధం ఉంది. దానినుండే, ఉత్పత్తి, చరిత్ర, సామాజిక సంబంధాలు పుట్టుకొస్తాయి. మరింతగా పరాయీకరించబడి, దోపిడీకి గురై, వ్యవస్థ ద్వారా ప్రకృతితో, భూమితో ఉన్న బంధం క్షీణింపబడిన వారే ఒక శక్తిగా, ఇరవై ఒకటో శతాబ్దంలో మార్పుకు సాధనాలుగా ఉంటారు. మార్క్స్ అన్నట్టు ,“(మనిషి) అవసరాల పారంపర్యం”, మనకు భూమితో ఉన్న సంబంధాన్ని తప్పనిసరిగా మొదటిస్థానంలో నిలుపుతుంది. అదే మన మనుగడకు పునాదిగా ఉంటుంది. అదే జీవనాభివృద్ధి.

(అనువాదం: ఎ. కోటిరెడ్డి)

జాతీయ పరిణామాలు

# మోడి నయవంచన, జగన్ దాసోహం


రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

**ఎ.కోటిరెడ్డి**

నవంబరు 11, 12 తేదీల్లో తెలుగు రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్రమోడి పర్యటించాడు. ఆద్యంతం మోసపు మాటలు, అబద్ధాలు, అర్ధ సత్యాలతో ప్రధాని పర్యటన సాగింది. విశాఖ పట్టణంలో జరిగిన సభలో ఏడు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశాడు. కాని రాష్ట్రానికి సంబంధించిన విభజన హామీలు, కీలకమైన అంశాలు వేటినీ ప్రస్తావించలేదు. సికింద్రాబాద్, విశాఖపట్టణం రైల్వేస్టేషన్‌లను ఆధునీకరిస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటువారికి అప్పగిస్తామని ప్రకటించిన వాటిలో ఆ రెండు రైల్వేస్టేషన్‌లు కూడా ఉన్నాయి. రైల్వేస్టేషన్‌లను ప్రైవేటువారికి ఇచ్చేటపుడు ప్రభుత్వం ఆధునికరించాల్సిన అవసరం ఏముంది? ప్రభుత్వ సొమ్ముతో ఆధునీకరించి, ప్రైవేటు వారి చేతుల్లో పెట్టటానికేనని మోడి ప్రకటన స్పష్టం చేస్తున్నది. ఆధునీకరణ కోసం ప్రైవేటు వారు వారి చేతిసొమ్ము ఖర్చు పెట్టరు. ఆధునీకరణ చేయటం, లాభాలు దండుకోవటం తదితరాలన్నీ ప్రజల (ప్రభుత్వ)సొమ్ముతోనే చేస్తారు. అందువలననే ప్రభుత్వం తన నిధులతో ఆధునీకరణ పూర్తిచేసి, లాభాలు దండుకోటానికి తన అనుయాయులైన పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరించి తీరుతామని పార్లమెంటులో ప్రకటించిన ప్రధాని సింగరేణిని ప్రైవేటీకరించే ఆలోచనే తమకులేదని పచ్చి అబద్ధం చెప్పాడు. రాష్ట్ర ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉంటే తామెలా ప్రైవేటీకరిస్తామని ప్రశ్నించాడు. ఆయన ప్రకటన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సిఐటియులు సింగరేణి బొగ్గు బ్లాకులను కేంద్రం వేలానికి పెట్టిన వాస్తవాన్ని వెల్లడించారు. రెండు రాష్ట్రాలలోనూ ప్రాధాన్యత లేని అంశాలపై నానాయాగీ చేస్తున్న బిజెపి నాయకులు ఈ అంశంపై మాత్రం నోరు మెదపలేదు. ఆర్‌ఎఫ్‌సిఎల్‌ను జాతికి అంకితం చేశాడు. ప్రైవేటీకరణనే తమ విధానంగా పెట్టుకున్న మోడి నాయకత్వంలోని ప్రభుత్వం ఒక ప్రభుత్వరంగ సంస్థను జాతికి అంకితం చేయటం అంటే దానిని అతి త్వరలో అదానికో, అంబానికో అప్పగించటానికేనని భావించటంలో ఏ మాత్రం అతిశయోక్తి ఉండదు. మరో మూడు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేశాడు. నేషనల్ మానెటైజేషన్ పైప్‌లైన్‌లో భాగంగా రహదారులతో సహా ప్రతిదానిని ప్రైవేటీకరిస్తామని ప్రకటించిన ప్రధాని రహదారులను జాతీయ రహదారులుగా ప్రకటించటం అంటే వాటిని ప్రజల ధనంతో నిర్మించి, ప్రైవేటు వారికి అప్పగిస్తారని స్పష్టం చేయటం మినహా వేరుకాదు.

కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడితోనూ తమకు ఉన్నది రాజకీయాలకు, పార్టీలకు అతీతమైన బంధమని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి వై ఎస్ జగన్మోహనరెడ్డిగారు చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలే మా అజెండా, అంతకు మించిన అజెండా తమకు ఉండదు, ఉండబోదు అని కూడా ఆయన చెప్పారు. ఒక రాజకీయ పార్టీ నాయకుడు, ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి తమ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధానిని గురించి ఈ విధంగా వ్యాఖ్యానించటం అంటే ఇంతకన్నా లొంగుబాటు మరేదైనా ఉంటుందా! గతంలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పరిపాలన చేస్తున్నపుడు ఆ పార్టీ ముఖ్యమంత్రులు కేంద్ర నాయకత్వాన్ని ప్రసన్నం చేసుకోవటం కోసం లొంగుబాటును ప్రదర్శిస్తూ కేంద్ర నాయకత్వంపై పొగడ్తలు కురిపించేవారు. కేంద్రం, రాష్ట్రాలలో వేరువేరు పార్టీలు పరిపాలన సాగిస్తున్న సమయంలో ఇప్పటి వరకు ఏ పార్టీ కూడా ఇంతగా లొంగిపోయి, కేంద్రానికి, ప్రధానికి దాసోహం అనటం జరగలేదు. చివరకు బిజెపికి మిత్రపక్షాలుగా ఉన్న పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలలోని ముఖ్యమంత్రులు కూడా ఇంత లొంగుబాటును ప్రదర్శించలేదు. ఈ విధమైన లొంగుబాటును ప్రదర్శించటం ద్వారా తాము రాష్ట్ర ప్రయోజనాలను ఏ మాత్రం పట్టించుకోవటం లేదని, విభజన హామీలు, రాష్ట్ర హక్కులను సాధించటం, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రతిఘటించటం తనవల్లకాదని జగన్మోహన రెడ్డిగారు ప్రకటించినట్లైంది. రాష్ట్ర ప్రయోజనాల పట్ల చిత్తశుద్ధి లేమిని, విశాఖ ఉక్కు ఫాక్టరీని ప్రైవేటీకరించవద్దని 600 రోజులకు పైగా పోరాటం చేస్తున్న కార్మికులను ప్రధాని రాక సందర్భంగా అరెస్టు చేయించటం ఉక్కుఫ్యాక్టరి ప్రైవేటీకరణకు మద్దతు తెలియజేయటమేనా! విశాఖ ఉక్కుఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై ప్రజలలో వ్యతిరేకత రాకుండా ఉండటం కోసం కేంద్రానికి పైపై విజ్ఞప్తులు చేయటం మినహా ప్రైవేటీకరణను అడ్డుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఏ మాత్రం కృషి చేయటం లేదని కూడా ఈ ఘటన స్పష్టం చేస్తున్నది.

రాష్ట్రానికి ప్రయోజనం కలిగించే ఒక్క అంశంపై కూడా ప్రధాని ప్రకటన చేయలేదు. విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టు పునరావాస వ్యయం, విశాఖ ఉక్కుఫ్యాక్టరి ప్రైవేటీకరణ, రైల్వేజోన్, వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధి, కడప ఉక్కుఫ్యాక్టరి నిర్మాణం తదితరాలపై ప్రధాని నోరు మెదపలేదు. అయినప్పటికీ ముఖ్యమంత్రి, వైసిపి ఏ మాత్రం అసంతృప్తి వ్యక్తం చేయలేదు. ప్రధాని రాష్ట్రానికి గొప్పగా ఒరగబెట్టినట్లు నటిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షం టిడిపి, జనసేన పార్టీలు కూడా ప్రధాని రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించటంపై నోరెత్తలేదు. రాష్ట్ర ప్రయోజనాలకు కేంద్రం విఘాతం కలిగిస్తుంటే అధికార పార్టీ, ప్రతిపక్షాలు అంతా బాగున్నట్లు ప్రజలను మభ్యపెట్టటం రాష్ట్ర ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా పరిణమిస్తుంది. ఈ వాస్తవాన్ని ప్రజలు గుర్తించి, కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలి. రాష్ట్రానికి అవసరమైన పథకాలు, ప్రాజెక్టులను సాధించుకోవటానికి

జరుగుతున్న ఉద్యమాలలో భాగస్వాములు కావాలి.

**టిఆర్ఎస్ ప్రభుత్వంపై అవాకులు**

టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించటమే లక్ష్యంగా తెలంగాణలో మోడి పర్యటన జరిగింది. టిఆర్ఎస్ ప్రభుత్వ దోపిడీని అంతం చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌ను అవమానిస్తున్నదని తెలంగాణలో చేసిన ప్రసంగాలలో మోడి చెప్పాడు. రాష్ట్రంలో బిజెపి అధికారానికి వస్తుందని హామి ఇచ్చి బిజెపి రాష్ట్ర నాయకత్వంలో ఉత్సాహం నింపటానికి ప్రయత్నం చేశాడు. తమకు లొంగివుంటే వారు సచ్ఛరితులని, తమను వ్యతిరేకించేవారు ప్రజావ్యతిరేకులైనట్లు, వారు అక్రమాలకు పాల్పడుతున్నట్లు బిజెపి, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని మోడి ఆంధ్ర, తెలంగాణ పర్యటనలలోనూ కొనసాగించాడు. రాజ్యాంగంలో నిర్దేశించిన విధులను పక్కన పెట్టి, ఎన్నికైన ప్రభుత్వం కన్నా తానే అధికురాలినన్నట్లుగా వ్యవహరిస్తున్న గవర్నర్‌ను అవమానిస్తున్నారని చెప్పటం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గవర్నర్‌ను మరింతగా రెచ్చగొట్టటమే కదా! టిఆర్ఎస్ ప్రభుత్వంపై గవర్నర్ చేస్తున్న దాడి మరింత తీవ్రం కావటానికి ఇది దారితీస్తుంది.

తెలంగాణలో ఏదో విధంగా అధికారాన్ని చేజిక్కించుకోవాలని బిజెపి చేస్తున్న ప్రయత్నం ఎంఎల్ఎల కొనుగోలు వ్యవహారంతో అందరికీ స్పష్టమయింది. ఆ కేసు విచారణలో బిజెపి కేంద్ర నాయకుల పేర్లు కూడా బయటికి వస్తున్నాయి. విచారణ ముందుకుసాగితే వివిధ రాష్ట్రాలలో ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూల్చటం కోసం బిజెపి చేసిన, చేస్తున్న కుట్రలు, కుతంత్రాలు వెల్లడయే అవకాశం ఉంది. దానితో తీవ్రంగా ఆందోళన చెందుతున్న బిజెపి కేంద్ర నాయ కత్వం కేసు విచారణను రాష్ట్ర ప్రభుత్వ పరిధి నుండి తప్పించటానికి శతవిధాలుగా ప్రయత్నం చేస్తున్నది. కేసు విచారణను సిబిఐకి అప్పగిం చాలని, విచారణను నిలిపివేయించా లన్న లక్ష్యంతో తన అనుయాయుల చేత హైకోర్టు, సుప్రీంకోర్టులలో కేసులు వేయిస్తున్నది. ఒకవైపున ఎంఎల్ఎలను కొనుగోలు చేయటానికి ప్రయత్నం చేసిన వారితో తమకు సంబంధం లేదని చెబుతూనే మరోవైపున సిబిఐ విచారణను డిమాండ్ చేస్తూ కేసు విచారణను కేంద్రం పరిధిలోకి తీసుకోవటానికి చేస్తున్న ప్రయత్నాలు ఆ పార్టీ కపటత్వాన్ని వెల్లడిస్తున్నాయి.

**ఎన్నికలలో మతోన్మాదాన్ని పెంచటానికి చర్యలు**

ఏ రాష్ట్రంలో లేదా కేంద్రంలో ఎన్నికలు జరిగినా మతోన్మాదాన్ని పెంచటం లక్ష్యంగా బిజెపి పనిచేస్తున్నది. మతోన్మాదాన్ని రెచ్చగొట్టక పోతే, ప్రజలు ఏ ఉన్మాదానికి గురికాకుండా తమ జీవితానికి సంబంధించిన సమస్యలను గురించి ఆలోచిస్తుంటే తమపార్టీ ఏ ఎన్నికల లోనూ గెలవలేదని బిజెపి, ఆర్ఎస్ఎస్ నాయకులకు అర్థం అయింది. అందుకే పార్ల మెంటు ఎన్నికల నుండి పంచాయితీ ఎన్నికల వరకు ప్రతి ఎన్నికకు మతోన్మాదాన్ని పెంచటమే పనిగా పెట్టుకున్నారు. తాజాగా జరిగిన హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ ఎన్నికలలో కూడా మతోన్మాదాన్ని ఉధృతం చేయటమే తమ గెలుపుకు సోపానంగా కమలం పార్టీ నాయకులు భావించారు. అందువలననే కామన్ సివిల్ కోడ్, పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేస్తామని వాగ్దానాలను గుప్పిస్తున్నారు. ఈ రెండు అంశాలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి. ఈ రెండింటినీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలి మినహా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయటం సాధ్యం కాదు. అయినప్పటికీ ఇప్పటికే పూర్తయిన హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలలో, డిసెంబరు 1-5 తేదీలలో జరుగుతున్న గుజరాత్ శాసనసభ ఎన్నికలలో ఈ రెండు చట్టాలను అమలుచేస్తామని బిజెపి ప్రచారం చేస్తున్నది. మతోన్మాదాన్ని రెచ్చగొట్టటం, కార్పొరేట్ మీడియా సమర్థుడిగా ప్రచారం చేస్తున్న నరేంద్రమోడి చేత ప్రతి ఎన్నికలలోనూ-పార్లమెంటు నుండి స్థానికసంస్థల వరకు-ప్రచారం చేయించటమే విజయం సాధించటానికి మార్గాలుగా బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు భావిస్తున్నాయి.

❝ ఏ రాష్ట్రంలో లేదా కేంద్రంలో ఎన్నికలు జరిగినా మతోన్మాదాన్ని పెంచటం లక్ష్యంగా బిజెపి పనిచేస్తున్నది. మతోన్మాదాన్ని రెచ్చగొట్టక పోతే, ప్రజలు ఏ ఉన్మాదానికి గురికాకుండా తమ జీవితానికి సంబంధించిన సమస్యలను గురించి ఆలోచిస్తుంటే తమపార్టీ ఏ ఎన్నికల లోనూ గెలవలేదని బిజెపి, ఆర్ఎస్ఎస్ నాయకులకు అర్థం అయింది. అందుకే పార్ల మెంటు ఎన్నికల నుండి పంచాయితీ ఎన్నికల వరకు ప్రతి ఎన్నికకు మతోన్మాదాన్ని పెంచటమే పనిగా పెట్టుకున్నారు. ❞



ఇటీవల విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని మోడీని ఆహ్వానిస్తున్న సిఎం జగన్

స్వాతంత్ర్యం సాధించిన 75వ వార్షికోత్సవాన్ని "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" అని ప్రచారం చేశారు. దానిని కూడా మతోన్మాదాన్ని పెంచటానికి సాధనంగా వినియోగించుకున్నారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 2002 లో గుజరాత్‌లో జరిగిన హింసాకాండలో మైనారిటీలపై అత్యాచారాలు, మానభంగాలు, హత్యలకు పాల్పడి, జీవితఖైదు అనుభవిస్తున్న దోషులకు గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించి, విడుదల చేయించింది. కేంద్ర ప్రభుత్వ ఆమోదంతోనే వారిని విడుదల చేసినట్లు తర్వాత వెల్లడైంది. దారుణమైన హింసాకాండకు పాల్పడి శిక్ష అనుభవిస్తున్న దోషులకు క్షమాభిక్ష ప్రసాదించటంపై రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు, ప్రముఖులైన వ్యక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇపుడు గుజరాత్ ఎన్నికల ప్రచారంలో ఈ

> **"మతోన్మాదాన్ని రెచ్చగొట్టటం ద్వారా ఎన్నికలలో తాత్కాలికంగా విజయాలు సాధించి నప్పటికీ అంతిమంగా ప్రజల నిత్య జీవిత సమస్యలపై ప్రజలు చేసే పోరాటాలే రాజకీయ పార్టీల భవిష్యత్‌ను నిర్ణయిస్తా యని అనేక సందర్భాలలో రుజువయింది. తాజాగా హర్యానాలో జరిగిన స్థానికసంస్థల ఎన్నికలలో వచ్చిన ఫలితాలు కూడా దీనిని బలపరుస్తు న్నాయి."**

అంశాన్ని కూడా బిజెపి వినియోగించుకుంటున్నది. గుజరాత్‌లో అత్యాచారాలకు పాల్పడుతున్న వారిని 2002లో తాము శిక్షించినట్లు, అందువలననే రాష్ట్రంలో శాంతి, భద్రతలు ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చినట్లైతే యువతను తీవ్రవాదులుగా మార్చేవారిని నిరోధించటం కోసం ప్రత్యేకమైన సంస్థను ఏర్పాటు చేస్తామని ప్రచారం చేస్తున్నారు. అంటే తీవ్రవాదాన్ని నిరోధించటం పేరుతో తమ విధానాలను వ్యతిరేకిస్తున్న మైనారిటీలకు చెందిన యువతను వేటాడటం కొనసాగిస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్నారు. నిజమైన బాధితులను నేరస్తులుగా, నేరస్తులను బాధితులుగా ముద్రవేసి బిజెపి ప్రచారం చేస్తున్నది. ఆ విధంగా రాష్ట్ర ప్రజలలో బిజెపి ప్రభుత్వంపై వ్యక్తమౌతున్న వ్యతిరేకతను దారి తప్పించటం ద్వారా ఎన్నికలలో విజయం సాధించగలనని ఆ పార్టీ భావిస్తున్నది.

మతోన్మాదాన్ని రెచ్చగొట్టటం ద్వారా ఎన్నికలలో తాత్కాలికంగా విజయాలు సాధించినప్పటికీ అంతిమంగా ప్రజల నిత్య జీవిత సమస్యలపై ప్రజలు చేసే పోరాటాలే రాజకీయ పార్టీల భవిష్యత్‌ను నిర్ణయిస్తాయని అనేక సందర్భాలలో రుజువయింది. తాజాగా హర్యానాలో జరిగిన స్థానికసంస్థల ఎన్నికలలో వచ్చిన ఫలితాలు కూడా దీనిని బలపరుస్తున్నాయి. రైతాంగానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేసిన మూడు నల్లచట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో హర్యానా రైతాంగం ప్రధానపాత్ర నిర్వహించారు. ఆ ప్రభావం ఈ ఎన్నికలలో వ్యక్తమైంది. బిజెపిని చిత్తుగా ఓడించారు.

### ఎన్నికల కమిషనర్‌గా అరుణ్‌గోయల్ నియామకంపై నిలదీసిన సుప్రీంకోర్టు

కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా మాజి ఐఎఎస్ అధికారి అరుణ్‌గోయల్ నియామకం శరవేగంతో జరిగిందని, 24 గంటల్లోనే మొత్తం నియామక ప్రకియ పూర్తయిందని, ప్రభుత్వం ఎందుకంత వేగంగా వ్యవహరించాల్సివచ్చిందని జస్టిస్ కె ఎం జోసెఫ్ నాయకత్వంలోని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్‌ల నియామకానికి ప్రస్తుతం సరైన వ్యవస్థ లేదని, అందుకు కొలీజియం వంటి స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేయాలని దాఖలైన పిటిషన్లపై విచారణ జరుపుతున్న ధర్మాసనానికి నాయకత్వం వహిస్తున్న కె ఎం జోసెఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ధర్మాసనం ఆదేశాల మేరకు అరుణ్ గోయల్ నియామకానికి సంబంధించిన ఫైళ్ళను అటార్నీ జనరల్ కోర్టుకు అందజేశారు.

ఎన్నికల కమిషన్ స్వతంత్రతను గురించి ప్రభుత్వం కేవలం ప్రచారం మాత్రమే చేస్తున్నదని, ఎన్నికల కమిషనర్‌లను నియమిస్తున్న తీరు దీనిని దృఢపరుస్తున్నదని రాజ్యాంగ ధర్మాసనం ప్రభుత్వాన్ని నిలదీసింది. 1950వ దశాబ్దంలో ఎనిమిది సంవత్సరాలకు పైగా పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న ప్రధాన ఎన్నికల కమిషనర్‌లు ఉన్నారని, 2004 తర్వాత వారి పదవీ కాలం కేవలం కొన్ని వందల రోజులకు తగ్గిపోయిందని, ఈ కాలంలో పూర్తి పదవీ కాలం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకోవటానికి అవకాశం ఉన్నవారిని ఒక్కరిని కూడా నియమించలేదని చెప్పింది. ఈ విధమైన నియామకాల ద్వారా ఎన్నికల కమిషన్ స్వతంత్రతను పూర్తిగా నాశనం చేస్తున్నారని ధర్మాసనానికి నాయకత్వం వహించిన కె ఎం జోసెఫ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. 2004లో అధికారంలోకి వచ్చిన యుపిఎ ప్రభుత్వం ఎనిమిది సంవత్సరాలలో ఆరుగురు ప్రధాన ఎన్నికల కమిషనర్‌లను నియమించిందని, ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015 నుండి 2022 నాటికి ఏడు సంవత్సరాల కాలంలో ఎనిమిది మంది ప్రధాన ఎన్నికల కమిషనర్‌లు బాధ్యతలు స్వీకరించారని చెప్పాడు.

ఐఎఎస్ అధికారిగా పనిచేస్తున్న అరుణ్ గోయల్ నవంబరు 17వ తేదీన స్వచ్ఛంద పదవీ విరమణ చేశాడు. 18వ తేదీన ఆయనను ఎన్నికల కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆయన నియామకానికి సంబంధించిన ఫైలు ప్రారంభమైన రోజే అప్పాయింట్‌మెంటు కూడా ఇచ్చారు. ఆయన 17వ తేదీన పదవీ విరమణ చేయగా, 18వ తేదీన ఎన్నికల కమిషనర్‌గా అప్పాయింట్ చేయటం కోసం సూచించిన నలుగురి పేర్లలో ఆయన పేరును కూడా చేర్చారు. ఆరోజే ఫైలును ప్రధానమంత్రి కార్యాలయానికి పంపారు. వెంటే గోయల్ పేరును ప్రధాని సిఫార్సు చేశారు. ఆయనను నియమించటానికి, లిస్టులోని మిగతా వారిని తిరస్కరించటానికి ప్రాతిపదిక ఏమిటి అని ధర్మాసనం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

ఈ వ్యవహారాన్ని పరిశీలించినట్లైతే ఎన్నికల కమిషన్‌ను మరింతగా తన గుప్పెట్లో పెట్టుకోవటానికి ముందస్తుగా రూపొందించిన పథకం ప్రకారమే ప్రభుత్వం వ్యవహరించిందని స్పష్టమౌతున్నది. సర్వీస్‌లో ఉన్న అరుణ్‌గోయల్ నవంబరు 17వ స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తాడని ఎన్నికల కమిషనర్‌ను ఎంపిక చేస్తుయటానికి జాబితాను రూపొందిస్తున్న న్యాయశాఖకు ముందే ఎలా తెలిసింది? 17వ తేదీన పదవీ విరమణ చేయగా 18వ తేదీన ఏ విధంగా ఎన్నికల కమిషనర్‌గా నియమించటానికి పరిశీలించనున్న వారి జాబితాలోకి ఆయన పేరు ఎలా చేరింది? అంటే తనను ఎన్నికల కమిషనర్‌గా నియమిస్తారని అరుణ్ గోయల్‌కు ముందే తెలుసునని, న్యాయశాఖ, ప్రధాని అందరూ కలిసి ముందే సమాలోచన చేశారని కూడా ఈ నియామకం జరిగిన తీరు స్పష్టం చేస్తున్నది. ఎన్నికల కమిషనర్‌గా నియమించబడటం కోసమే ఆయన స్వచ్ఛంద పదవీ విరమణ చేశాడు. కాబట్టే వెంటనే ఆయన పేరు లిస్టులో చేరటం, ఆ రోజే ప్రధాని ఆమోదించటం జరిగిపోయాయి. ఆయన ఐఎఎస్ అధికారిగా పనిచేస్తున్నపుడు రాజకీయంగా బిజెపికి విధేయంగా వ్యవహరించాడని కూడా స్పష్టమౌతున్నది. కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఇప్పటికే దిగజార్చిన బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దానిని పూర్తిగా తన చేతి పనిముట్టుగా వినియోగించుకోవటం కోసం ఆగమేఘాల మీద అరుణ్‌గోయల్‌ను నియమించింది. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన వ్యవస్థలను, సంస్థలను ధ్వంసం చేస్తున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు మొత్తం ప్రజాస్వామిక వ్యవస్థనే విచ్ఛిన్నం చేయటానికి ప్రయత్నం చేస్తున్నాయి. విస్తృత ప్రజా మద్దతుతో కూడిన రాజకీయ ప్రతిఘటన ద్వారానే దీనిని తిప్పికొట్టటం సాధ్యమౌతుంది.

❋

# అస్థిరతలో అమెరికా ప్రజాస్వామ్యం



బి. అర్జున్

అమెరికాలో ద్రవ్యోల్బణం 8 శాతానికి పైగా పెరిగిపోయినప్పటికీ ఇటీవల జరిగిన అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఆ దేశపు ఓటర్లకు అదేమీ పట్టినట్టు కనిపించలేదు. ఓటర్లు తీర్పు ఇచ్చేటప్పుడు ప్రస్తుత అధ్యక్షుని పనితీరును పరిగణనలోకి తీసుకోలేదు. సాధారణంగా మధ్యంతర ఎన్నికల్లో అప్పుడున్న అధ్యక్షుని పార్టీని ఓటర్లు శిక్షించడం జరుగుతుంది. కానీ ఈసారి దానికి భిన్నంగా అమెరికన్లు డొనాల్డ్ ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు లేకుండా చేయాలన్న లక్ష్యంతో వ్యూహాత్మకంగా తీర్పు ఇచ్చారు. రాజకీయ పండితుల విశ్లేషణ ప్రకారం 2022 అమెరికా ఎన్నికలు చాలా వరకు మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా, అస్థిరమైన అమెరికా ప్రజాస్వామ్య భవిష్యత్తుపై ఇచ్చిన తీర్పు.

వాషింగ్టన్ పోస్ట్ సర్వే ప్రకారం ఎన్నికలకు ముందు "47 శాతం మంది రిపబ్లికన్లు, రిపబ్లికన్ సానుభూతిపరులైన స్వతంత్రులు 2024 ఎన్నికల్లో ట్రంప్ తిరిగి అధ్యక్ష పదవికి పోటీ చేయాలని కోరుకున్నారు."2024 ఎన్నికల్లో ట్రంప్ విజయం సాధిస్తే అమెరికన్ "రిపబ్లిక్ అంతమైపోతుందన్న" భయం పలువురు రిపబ్లికన్లనూ, డెమాక్రాట్లనూ వెన్నాడింది.

ట్రంప్ ఒక అబద్దాలకోరు, అసమర్థతకు మారుపేరు. అయినప్పటికీ ఆయన అమెరికా రాజకీయ యవనిక మీద ఒక పెద్ద శిలావిగ్రహంలాగా వెలుగొందుతున్నాడు. రాజకీయ చెత్తకుండీలో కంపుకొట్టే వ్యక్తి కూడా అమెరికా అధ్యక్ష పీఠం అధిష్టించ గలిగే పరిస్థితి ఉన్నదంటేనే అమెరికా ప్రజాస్వామ్యం ఎంతగా అస్థిరతతో కూడి ఉందో అర్థమవుతుంది. ట్రంప్ రెండు సార్లు అభిశంసనకు గురయ్యాడు. అమెరికా అధ్యక్ష భవనం మీద దాడిని ప్రోత్సహించాడని ఆయన మీద ఆరోపణలున్నాయి. ఇంకా అనేక కేసుల్లో న్యాయస్థానాల్లో తీవ్రమైన అభియోగాలను ఎదుర్కొంటున్నాడు. 2022 ఎన్నికల్లో ఓడిపోయినప్పటి నుండీ ట్రంప్, ఆయన అనుచరులు బ్యాలెట్ బాక్సులు రిగ్గింగ్ చేశారని ప్రత్యర్థులపై అడ్డూఆపూ లేకుండా ఆరోపణలు చేస్తూనే ఉన్నారు.

అమెరికాలో రాజకీయ పరిస్థితి భయంకరంగా ఉంది. మధ్యంతర ఎన్నికల్లో ఎదురుదెబ్బలు తగిలినప్పటికీ, తను నిలబెట్టిన అనేక మంది అభ్యర్థులు ఓడిపోయినప్పటికీ ట్రంప్ ఓటమిని అంగీకరించడం లేదు. ఆ విధంగా తన పనిఅయిపోలేదని బలమైన సంకేతాలు పంపిస్తున్నారు.

ఓటమిని అంగీకరించకపోవడమే కాదు, అనేక రాష్ట్రాల్లో ఎన్నికలను ట్రంప్ "ఓటరు విజ్ఞత లేనితనం"గా అభివర్ణించారు. "చెడ్డ యంత్రాలతోనూ, జాప్యాలతోనూ" తన ప్రత్యర్థులు ఎన్నిల్లో గెలిచారని చెబుతున్నాడు. ప్రపంచ వ్యాపితంగా పచ్చి మితవాదులంతా అనుసరించే ఎత్తుగడే అది. ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు ఓటింగ్‌పై అబద్ధాలను ప్రచారం చేయడం ద్వారా ఆ ఎన్నికలనే అప్రతిష్ట చేయడం, బలవంతంగా అధికారాన్ని చేజిక్కించుకోవడం వారు చేసే పని.

ట్రంప్ ఆయన అనుయాయులు ఒకవైపు ప్రజాస్వామ్యాన్ని ఉపయోగించుకుని లాభపడ్డం అదే సమయంలో ఎన్నికల క్రమాన్ని తప్పుడు ప్రచారంతో అప్రతిష్టపాలు చేయడం జరుగుతోంది. "ప్రస్తుత ఉద్యమం ప్రజాస్వామ్య పరిపాలనకు సంబంధించిన ఆధునిక చరిత్రలో అతి భయంకరమైన అధ్యాయం" అని అనేక మంది అమెరికన్ పండితులు ఆందోళనతో అభివర్ణిస్తున్నారు.

2024 ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష పదవికి డిశాంటిస్ బరిలో దిగనున్నారని అనుకుంటున్నారు. ఆయన ఈ మధ్యంతర ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజారిటీతో రిపబ్లిన్ పార్టీనుండి గెలుపొందారు. 20 పాయింట్ల ఎన్నికల వాగ్దానాలతో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి చార్లీ క్రిస్ట్ మీద డిశాంటిస్ గెలుపొందడం పట్ల రిపబ్లికన్లలో పెద్ద ఎత్తున హర్షం వ్యక్తమయ్యింది.

తన అభ్యర్థుల ఓటమి బాధ్యతనుండి ట్రంప్ తప్పుకోడానికి ప్రయత్నించవచ్చు గాక కానీ రిపబ్లికన్ శిబిరంలో చాలా మంది ఆయనను మొగ్గలోనే తెంచేయడానికి ఇది ఒక

> **"అయినప్పటికీ ట్రంప్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రమాదం పొంచి ఉండనే ఉంది. రాజకీయ రంగంలో ట్రంప్‌ను చెరిపేయడం డిశాంటిస్‌కు గానీ మరెవరికి గానీ అంత సులువు కాదు. ట్రంప్ నిరంతరం రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు, దేశవ్యాపితంగా క్యాంపెయిన్ తరహా ర్యాలీలు నిర్వహిస్తుంటారు. ఆయనకు విధేయులైన, ఉత్సాహవంతులైన అనుయాయుల పునాది ఉంది."**


మంచి అవకాశంగా భావిస్తున్నారు. రిపబ్లిన్ ఓటు బేస్‌లో ట్రంప్ ఆకర్షణ శక్తిని అడ్డుకోగల ఆశాకిరణంగా గవర్నర్ రాన్ డిశాంటిస్‌ను చాలా మంది రిపబ్లికన్లు భావిస్తున్నారు.

అయినప్పటికీ ట్రంప్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రమాదం పొంచి ఉండనే ఉంది. రాజకీయ రంగంలో ట్రంప్‌ను చెరిపేయడం డిశాంటిస్‌కు గానీ మరెవరికి గానీ అంత సులువు కాదు. ట్రంప్ నిరంతరం రాజకీయ కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు, దేశవ్యాపితంగా క్యాంపెయిన్ తరహా ర్యాలీలు నిర్వహిస్తుంటారు. ఆయనకు విధేయులైన, ఉత్సాహవంతులైన అనుయాయుల పునాది ఉంది.

ట్రంప్ నియంతృత్వ పోకడలున్న వ్యక్తి. "ముస్సోలినీ జాకెట్ వేసుకున్న వ్యక్తి" ట్రంప్ అని గతంలో సెనెటర్ టెడ్ క్రుజ్ వ్యాఖ్యానించారు. "ట్రంప్ ఆయన ప్రత్యర్థులు అనుకున్న దానికన్నా తెలివైన వాడు. ఆయనకు అమెరికా చరిత్రలో అందరికన్నా ఎక్కువగా కష్టాలను గట్టెక్కే గుణం ఉంది" అని ఆయన పేర్కొన్నారు.

ట్రంప్ మళ్లీ అధికారం చేపట్టడం అంతర్జాతీయ ఉదారవాద శక్తులకు కూడా మంచిది కాదు. ట్రంప్ నాయకత్వంలో ఉంటే ప్రపంచ వ్యాపితంగా పచ్చి మితవాద శక్తులకు లభించే మద్దతు, ప్రోత్సాహం పట్ల అన్ని దేశాల్లోని ప్రజాస్వామిక శక్తులు ఇప్పటికే ఆందోళన చెందడం ప్రారంభించాయి.

ఇప్పటికే ప్రపంచంలోని అగ్ర దేశాలు ప్రపచం శాంతికి భంగం కలిగిస్తూ అణ్వస్త్రాల ప్రయోగం గురించి బెదిరింపులకు దిగుతున్న తరుణంలో ట్రంప్ తిరిగి అధికారంలోకి వస్తే ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయి.



జో బైడెన్



డొనాల్డ్ ట్రంప్

ట్రంప్ తిరిగి అధికారంలోకి వస్తే బాగా సంతోషించేవారిలో మోడీ ప్రభుత్వం ఒకటి. ఎందుకంటే ట్రంప్ హయాంలో భారత్–అమెరికా సంబంధాలు బాగా ఉన్నంతగా నేడు లేవు. 2021 జనవరిలో జో బైడెన్ అధికారం చేపట్టినప్పటి నుండి భారత్‌లో అమెరికా రాయబారి స్థానం ఖాళీగా ఉంది. 1950 తరువాత భారత్‌లో అమెరికాకు పూర్తి కాలం దౌత్యవేత్త లేకుండా ఉండడం ఇదే సుదీర్ఘకాలం. గత 22 మాసాల్లో అమెరికా ప్రభుత్వం ఢిల్లీలో అయిదుగురు తాత్కాలిక దౌత్యవేత్తలను (చార్జి డి ఎఫైర్స్) నియమించింది. గత నెల అమెరికా విదేశాంగ శాఖ భారత్‌కు మరోసారి తాత్కాలిక దౌత్యాధికారిని ప్రకటించింది.

చైనా అధ్యక్షుడు సి జిన్‌పింగ్‌తో కరచాలనం చేయడానికి బైడెన్ వ్యతిరేకంగా లేడు. ఉక్రెయిన్‌లో అణ్వస్త్రాలు ఉపయోగించడం లేదా బెదిరించడానికి వ్యతిరేకంగా ఇరువురు నేతలు ఒకే మాట మాట్లాడారు. వాతావరణం, రుణాలు, ఆరోగ్యం, ఆహారభద్రత వంటి ప్రపంచ వ్యాపిత సవాళ్లపై అమెరికా, చైనాలు కలిసి పనిచేయాలన్న ప్రపంచ ఆకాంక్షలతో ఇరువురూ ఏకీభవించారు.

అమెరికా అంతర్గత ఒత్తిళ్ల వల్ల చైనా, రష్యాల విషయంలో ఆ దేశం మనసు మార్చుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ద్రవ్యోల్బణం రెండెంకల స్థాయిలో ఉండగా తాము 2024 ఎన్నికల్లో పోటీ చేసి గెలవలేమని బైడెన్‌కూ, డెమోక్రాట్లకూ తెలుసు. అధిక ద్రవ్యోల్బణం నుండి బయటపడాలంటే అమెరికా చైనా ఆర్థిక వ్యవస్థతో తెగతెంపులు చేసుకోవడం వాయిదా వెయ్యక తప్పదు, ఉక్రెయిన్ యుద్ధానికి సహకారం ఆపక తప్పదు.

తెల్లజాతి దురహంకారులు మినహా ప్రపంచలో మరెవరూ 2024 ఎన్నికల్లో ట్రంప్ గెలవాలని కోరుకోరు. మితవాద శక్తుల పురోగమనాన్ని అడ్డుకోవడానికి ప్రపంచ వ్యాపితంగా వామపక్షాలు ఇప్పటికే నిలదొక్కుకుని ముందుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నాయి. బ్రెజిల్ ఎన్నికల్లో పచ్చి మితవాద అధ్యక్షుడు జైరో బోల్సనారోను ఓడించి లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా తిరిగి అధికారం చేపట్టడం ద్వారా ఈ విషయం రుజువైంది. ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా ఉండి ఉంటే లూలా విజయం సాధించడం సాధ్యమయ్యేది కాదు. ఓట్ల రిగ్గింగు కోసం బోల్సనారోకి ట్రంప్ చురుకుగా మద్దతిచ్చి ఉండేవాడు, లేదా సైనిక కుట్రకు పాల్పడి రెండో సారి అధికారం చేపట్టేవాడు.

**(అనువాదం: ఎస్. వెంకట్రావు)**

# ఉమ్మడి పౌరస్మృతి సరే ఉమ్మడి నియమావళి మాటేమిటి?



రచయిత ప్రముఖ రాజకీయ, సాంస్కృతిక, సామాజిక విశ్లేషకుడు. అనేక అంశాలపై ఆయన జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో రాసిన వ్యాసాలతో సంకలనం వెలువడింది, ప్రపంచ వ్యాపితంగా ఆయన రచనలకు అభిమానులున్నారు.

బద్రిరైనా

**ఉమ్మడి పౌర స్మృతి వాగ్దానం ద్వారా హిందూ–ముస్లింలను విడదీసి గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ ఎన్నికలలో విజయం సాధించడమే బిజెపి ఉద్దే శ్యం....** బద్రి రైనా

భారత రాజ్యాంగంలో 4వ విభాగం ముఖ్యంగా మితవాదులు ఏరికోరి ఎంచుకునేది. ఇది 'రాజ్య విధానాల నిర్దేశిక సూత్రాలు' అని పిలవబడే వాటిని నిర్దేశిస్తుంది.

ఆదేశిక సూత్రాలలో చెప్పబడిన ఆర్థిక న్యాయపు దృక్కోణం నుండి చూస్తే... రాజ్యాంగం గుండెకాయ 38, 39 అధికారణాలలో పొందుపరచబడిన నిబంధనలలో ఉంది.

ఈ అధికారణాలలో పొందు పరచబడిన సమానత్వ ఆదర్శాలు ఎంతో అద్భుతమైనవి. అవి ప్రాథమికంగా ప్రజలకు చెందిన అన్ని భౌతిక వనరుల గురించి మాట్లాడతాయి. కొంతమంది చేతుల్లో సంపద కేంద్రీకరణ జరగకుండా చూసుకోవలసిన "విధి" ప్రభుత్వానికి ఉందనే ఆదేశం ఇస్తాయి. ఆదాయ అసమానతలు కనిష్ట స్థాయికి తగ్గించబడాలనీ, పురుషులు, స్త్రీలు అందరికీ గౌరవప్రదమైన జీవనోపాధి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలనీ, సమాన పనికి సమాన వేతనం ఉండాలని, పౌరులకు ఆహారం, పని, ఆరోగ్యం కోసం హక్కు ఉండాలని, ఇలా ఇంకా అనేకమైన వాటి గురించి మాట్లాడతాయి.

ఈ ఆదేశ సూత్రాలని చదివి, అదే సమయంలో ప్రజాతంత్ర రాజ్యంగా నడవాల్సిన దేశాన్ని ప్రస్తుతం పాలిస్తున్న మితవాద పక్ష ఆర్థిక సిద్ధాంతాల్ని చూడండి. ప్రభుత్వ వనరులను విచ్చలవిడిగా ప్రైవేట్ చేతులకు బదిలీ చేయడం, ఆదాయాల్లో, కొనుగోలు శక్తిలో అసమానతలు, సంపదను ఒక అవమానకర స్థాయికి కేంద్రీకరించడం, ఈ అధికరణాలలో నిర్దేశించిన జీవనోపాధి అనే ప్రాథమిక హక్కును తిరస్కరించి కేవలం "ఉచితాలు"తో సరిపెట్టటం, మొదలైనవి.

ఇందువల్లనే రాజ్య విధాన నిర్దేశక సూత్రాలలోని 38, 39 అధికారణాలను మితవాదులు ఎన్నడూ అమలు చేయలేదు. వీరే కాదు 1990 వాషింగ్టన్ ఒప్పంద ప్రకటనకి ముందు ఏ ప్రభుత్వమూ కూడా వీటిని అమలుచేయలేదు. వాటి ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా డబ్బు ఏలుబడి విచ్చలవిడి అయి, "నయా–ఉదారవాద" ప్యాకేజీలు వచ్చాయి. ఇవి అంతర్జాతీయ ఆర్థికరంగానికి విశేష అధికారాలు ఇచ్చి జాతీయ సరిహద్దులను వెనక్కి నెట్టాయి.

అయితే, మితవాదులు అమలు చేయాలని చూసేది ఆర్టికల్ 46. ఇది ఆవులు, దూడల వధ నిషేధించాల్సిన వాంఛనీయత గురించి తెలియజేస్తుంది, అలానే మీరు ఊహించిన విధంగా, అధికరణం 44 కూడా. ఇది "ఉమ్మడి పౌర స్మృతి" గురించి ఉద్దేశించినది. ఆ స్మృతి ఎలా ఉండాలి, లేదా అది ఎలా రావచ్చు అనే దాని గురించి ఆ అధికరణం ఎటువంటి వివరణను అందించనప్పటికీ, దాని భావన ఏంటంటే మతం, తరగతి, కులం, లింగం లేదా మరేదైనా ఇతర రూపాలలో ఉండే ఏ వేరైన గుర్తింపుతో సంబంధం లేకుండా భారతీయ పౌరులందరు భారతీయ అపరాధ స్మృతి యొక్క నిబంధనలకు ఎలా సమానంగా లోబడి వుంటారో, అలానే సమాజ జీవనంలో కూడా వివాహం, విడాకులు, ఆస్తి హక్కులు, వారసత్వ హక్కులు, వివాహిత, అవివాహిత స్త్రీల హక్కులు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థలను ప్రభావితం చేసే అంశాలు మొదలైన అన్ని పౌర అంశాలలో ఏకరూపతను సాధించవచ్చునన్నది.

ఉమ్మడి పౌర స్మృతిని చట్టం ద్వారా అమలు చేయాలనే మితవాదుల పట్టుదల ప్రధానంగా హిందువులనూ ముస్లింలనూ విడదీసేందుకు, భారతీయ ముస్లింలకి విరుద్ధంగా పన్నిన మరొక ఎత్తుగడగా ఉంది. ఈ ఉమ్మడి స్మృ సాధన అంతర్లీనంగా (కుల) హిందువులు ఆచరించే సూత్రాలపై పెంపొందాలని కోరుతోంది. 44వ అధికరణంలో కొంత యోగ్యతను చూసే వారు తరచూ ప్రతిపాదించేది, ప్రభుత్వం ఈ అధికరణాన్ని సక్రియం చేయాలనుకుంటే, ఒక ముసాయిదాను రూపొందించి, దానిని అన్ని మతాల, తెగల భారతీయులకు పంపిణీ చేసి, చర్చించటం ఉత్తమం. ఇంకా, బహుశా, వివిధ మతాల అత్యంత హేతుబద్ధమైన, సమానమైన ఆచారాలను ఒక చోట చేర్చి అందరూ అంగీకరించే గ్రంథంగా చేయవచ్చు. అయినప్పటికీ భారతదేశంలోని షెడ్యూల్డ్ తెగల కమ్యూనిటీలపై అది ఎలా అమలు చేయబడుతుందనేది ఇప్పటికీ పరిష్కరించలేని సమస్యగా మిగిలిపోతుంది. కానీ, ఇది కాదు ఏ మితవాద ప్రభుత్వమయినా చేయాలని కోరుకునేది. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిస్తే ఉమ్మడి పౌర స్మృతిని ఏర్పాటు చేస్తామని ఇటీవలే అధికార పార్టీ ప్రకటించింది.

అటువంటి అధికారాలు పార్లమెంటు ద్వారా కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంటాయి, ఏ రాష్ట్ర ప్రభుత్వంలోనూ ఉండవు. కానీ, పర్వాలేదు లెండి. ఎవరు వింటున్నారు కనుక?

ఇక్కడ హిందూ–ముస్లిం విభజనను తీసుకురావటం ద్వారా ఈ రాష్ట్రాలను

**"ఇలాంటి వాంఛనీయమైన రాజకీయ/నైతిక ఏకరూపతలని సూత్రీకరించి ఆచరిస్తే, ఉమ్మడి పౌర స్మృతిని ప్రతిఘటించాల్సిన అవసరం దానంతటదే క్రమంగా తగ్గిపోవచ్చు. ప్రజల మనస్సుకి ఏ రాజ్యాంగ నిబంధన అయినా విశ్వసనీయంగా తోచాలంటే దాన్ని ఆచరించాల్సిన బాధ్యత అప్పగించబడినవారు విశ్వస నీయులై ఉండాలి."**

గెలుచుకోవడమే ముఖ్య ఉద్దేశ్యం. ఈ నేపథ్యంలో, ముందుగా ఉమ్మడి రాజకీయ నియమావళి, ఉమ్మడి నైతిక నియమావళి ఉంటే ఎలా ఉంటుంది అన్న ఆలోచన రాకమానదు.

ఉమ్మడి పౌర స్మృతిని ఎలా సాధించవచ్చనే దానిపై ఉత్తమ రాజ్యాం గాలు, సమాజంలోని ఉత్తమ మేధావులు బాగా ఆలోచించినప్పటికీ, ఇదంతా ఉత్తమ సార్వజనీన ఉద్దేశాలతో ఉన్నప్పటికీ, మొట్టమొదటగా దేశంలోని ప్రజాప్రతినిధుల కోసం ఉమ్మడి రాజకీయ, నైతిక నియ మావళికి తీసుకురావటానికి ప్రయత్నించడం వాంఛనీయం కదా?

**దీని కోసం ఏం చేయాలి?**

భారతీయ ప్రజాస్వామ్యంలో పాలుపంచుకునే అన్ని రాజకీయ శక్తులు తమ ఓటింగ్ బలానికి అనుగుణంగా నిధుల పరంగా ఒకే స్థాయిని కలిగి ఉండాలి. అదే విధంగా తగిన మీడియా సమయం వారికి అందుబాటులో ఉండాలి. వేర్వేరు రాజకీయ ప్రతినిధులచే పాలించబడుతున్న రాష్ట్రా లలో రాజకీయ ప్రతినిధుల అతిక్రమణలను ఒకే పేరుతో పిలిచి, ఒకేరకంగా విచారణ చేయాలి. ఒకరి ద్వేషపూరిత ప్రసంగం, మరొకరి ద్వేషపూరిత ప్రసంగం రెండింటినీ ఒకే విధంగా చూడాలి. రెండు వేర్వేరు రాజకీయ పార్టీలు ఉన్న రెండు వేర్వేరు రాష్ట్రాల్లో వంతెనలు కూలిపోయినప్పుడు, ఒకటి దేవుని చర్య అని, మరొకటి మోసపూరిత చర్య అని పిలవకూడదు. రాష్ట్రంలోని దర్యాప్తు సంస్థలు ఒక నిందితుడికి మరొక నిందితుడికి వారి రాజకీయ అనుబంధాల ఆధారంగా వివక్ష చూపకూడదు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నప్పుడు చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం నిజమైన ప్రాతిపదికన ప్రతిపక్షాలు ప్రతిపాదించిన తీర్మానాలు వంద శాతంతో తిరస్కరించబడకూడదు. ఎలక్టోరల్ బాండ్లను ఎవరు కొనుగోలు చేస్తున్నారో, ఎవరి ప్రయోజనం కోసం కొంటున్నారో ఓటు వేసే ప్రజలకు తెలియజేయాలి. ముఖ్యమైన అధికారులు రాష్ట్రాల పర్యటనలలో ప్రతిపక్ష పార్టీలు నిర్వహించే రాష్ట్ర ప్రభుత్వాలను ఏకరీతిగా దూషించకూడదు. అలానే తన స్వంత పార్టీ ఆధ్వర్యంలో నడిచే ప్రభుత్వాలను ఏకరీతిగా ప్రశంసించదు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఆధ్వర్యంలో నడిచే రాష్ట్రాలు ప్రతిపక్ష పార్టీలు నడుపుతున్న వాటికి వ్యతిరేకంగా ప్రత్యేక ఆదరణ పొందుతాయని సూచించే "డబుల్ ఇంజిన్‌కి సర్కార్" అనే రాజ్యాంగ విరుద్ధమైన నినాదాన్ని తక్షణమే రద్దు చేయాలి. రాష్ట్రాలు లేదా వ్యక్తులు, వారెవరైనప్పటికీ, వారి పని పాటవాలకి సంబంధించిన ఏ సమాచారం అయినా యధేచ్ఛగా నిర్లక్ష్యంగా ఎవరూ వాడకూడదని ఆ సంబంధిత భాగస్వాముల మధ్య ఒక ఒడంబడిక కుదరాలి. మార్గ దర్శక సూత్రాలలోని 44 వ అధికరణాన్ని ఉపయోగించుకోవాలని కోరుకోడం ఎలా అయితే జరుగుతోందో అలానే ఏ మినహాయింపు లేకుండా భారత రాజ్యాంగంలో ఉన్న అన్ని విధి విధానాలని కూడా అన్ని ప్రభుత్వాలు, వాటి సంస్థలు గౌరవిస్తూ పారదర్శకంగా బహిరంగ పరిశీలనకు లోబడి ఉండాలి. నిజానికి, ఇక్కడ ఒక కాలమ్‌లో క్రోడీకరించబడ గలిగిన దానికంటే ఏకరూపత కావాల్సిన జాబితా చాలా ఉంది.

ఇలాంటి వాంఛనీయమైన రాజకీయ/ నైతిక ఏకరూపతలని సూత్రీకరించి ఆచరిస్తే, ఉమ్మడి పౌర స్మృతిని ప్రతిఘటించాల్సిన అవసరం దానంతటదే క్రమంగా తగ్గిపోవచ్చు. ప్రజల మనస్సుకి ఏ రాజ్యాంగ నిబంధన అయినా విశ్వసనీయంగా తోచాలంటే దాన్ని ఆచరించాల్సిన బాధ్యత అప్పగించబడినవారు విశ్వసనీయులై ఉండాలి. అందరినీ ఒకే రకంగా పాలించకుండా, మొండిగా వివక్షతో పాలించాలన్న లక్ష్యంతో ఉన్న పాలకులు తక్షణావసరాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఏదో ఒక్క రంగంలో సమానత కోసం డిమాండ్ చేస్తే, ఆ విషయం తప్పనిసరిగా అసమ్మతికి గురవ్వాల్సిందే.

ఆడబాతు ఏతిండి తింటుందో మగబాతు కూడా అదే తింటుంది అనే సమానత పరిపాలనకు సంబంధించిన అన్ని విషయాలలోనూ రూపు దాల్చాలి. అలా కాకపోతే, ఉమ్మడి పౌర స్మృతి కోసం ఇచ్చిన ప్రేరేపిత పిలుపు ఏదైనా, ఏకరూపతను సాధించే బదులు జాతీయ ఆత్మని మరింత విచ్ఛిన్నం చేయడానికి దారితీయగలదు.

**(అనువాదం- కె. పుష్పవల్లి)**

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి**

**పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

# కొరియా వర్కర్స్ పార్టీ :
# కొత్త శకంలో పార్టీ నిర్మాణం



కొరియా వర్కర్స్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఈ ఏడాది అక్టోబర్ 17వ తేదీన పార్టీ కేంద్ర నాయకత్వ శిక్షణా పాఠశాలలో "కొత్త శకంలో మన పార్టీ నిర్మాణం, కొరియా వర్కర్స్ పార్టీ కేంద్ర నాయకత్వ శిక్షణా శిబిరం కర్తవ్యాలు" అన్ని అంశం మీద ప్రధానోపన్యాసం చేశారు. తక్షణ విప్లవ కర్తవ్యాల నిర్వహణ, పార్టీ నిర్మాణం కోసం కొరియా వర్కర్స్ పార్టీ కేంద్ర కమిటీ మార్గదర్శకత్వంలో కేంద్ర పార్టీ నాయకత్వానికి శిక్షణ ఇచ్చేందుకు గాను 1946లో ఈ కేంద్ర పార్టీ నాయకత్వ శిక్షణా పాఠశాల ఏర్పాటయింది.

పార్టీ నిర్మాణాన్ని మరింత బలపరుచుకోవాల్సిన కర్తవ్యం గతంలో కన్నా నేడు మరింత అవసరమైందనీ, విప్లవ భవిష్యత్తు దృష్ట్యా ఇది మరింత ప్రముఖ చారిత్రక కర్తవ్యంగా ముందుకొచ్చిందనీ కిమ్ జోంగ్ ఉన్ చెప్పారు. పార్టీ నిర్మాణంలోనూ, సోషిలిజం నిర్మాణంలోనూ శిక్షణా పాఠశాల నిర్వహించిన మహోన్నత పాత్ర గురించి ఆయన వివరించారు. దేశంలో సోషలిజం శాశ్వత స్థానాన్ని మరింత పటిష్ట పరచాల్సిన అవసరం ఉన్న దృష్ట్యా ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పాఠశాల బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు.

గత పదేళ్ల కాలంలో పార్టీ బలోపేతానికి చేసిన పోరాటం పార్టీ మనుగడకూ, దాని భవిష్యత్తుకూ చాలా కీలకం అని కిమ్ జోంగ్ ఉన్ పేర్కొన్నారు. ఈ కాలంలో కొరియా వర్కర్స్ పార్టీ ఒక పార్టీ మహాసభనూ (నాల్గవ కాన్ఫరెన్స్), రెండు పార్టీ సదస్సులనూ (ఏడు, ఎనిమిదవ కాంగ్రెస్‌లు) నిర్వహించింది. విప్లవం ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ దాని మౌలిక లక్షణం మారలేదని ఈ సభలు పునరుద్ఘాటించాయి. పార్టీ నిర్మాణంలో అవసరమైన, చురుకైన పరిణామాలపైన ఈ సమావేశాల్లో చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.

ఈ కాలంలో పార్టీని బలోపేతం చేయడంలో మూడు ప్రధాన విజయాలు సాధించినట్లు కిమ్ జోంగ్ ఉన్ చెప్పారు. "మొదటిది, పార్టీ సిద్ధాంతాన్నీ, నాయకత్వాన్నీ అది గట్టిగా బలపరిచింది. రెండవది, అది తన నాయకత్వ పనినీ, పాత్రనూ గణనీయంగా పెంచుకుంది. ఇక మూడవది, ప్రజలకు సేవ చేసే తన విప్లవాత్మక పనిని అది మరింత పెంపొందించుకుంది".

2015 ఫిబ్రవరిలో జరిగిన పార్టీ పొలిట్ బ్యూరో విస్తృత సమావేశంలో పార్టీ తన కర్తవ్యాలను అమలు జరిపే క్రమంలో సాధించిన విజయాలు, సంపాదించిన అనుభవాలు, గమనించిన లోపాలు, నేర్చుకున్న గుణపాఠాలను గురించి సమగ్రంగా సమీక్షించింది. దానిక కనుగుణంగా దేశాన్ని నడిపే విషయంలో అవసరమైన చర్యలు తీసుకుంది. "పార్టీ నాయకత్వ సామర్థ్యం గణనీయంగా పెరడం అనేది గత పదేళ్ల కాలంలో మన పార్టీ నిర్మాణంలో సాధించిన మరో విజయం. పార్టీ పోరాట పటిమ, పార్టీ సంస్థల కార్యకలాపాలు మెరుగుపడ్డాయి. గత దశాబ్ద కాలంలో నిజమైన ప్రజా పార్టీగా మన పార్టీ విప్లవ లక్షణాన్ని గట్టిగా నిలబెట్టుకోవడం, మరింత పటిష్ట పరుచుకోవడం అనేది మనం సాధించిన మరో విలువైన విజయం" అని ఆయన పేర్కొన్నారు.

విప్లవ లక్ష్యాన్ని గురించి కిమ్ జోంగ్ ఉన్ వివరిస్తూ "విప్లవం అనేది ప్రజాబాహుళ్యపు స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు జరిపే పోరాటం గనుక విప్లవానికి నాయకత్వం వహించే పార్టీ ఏన్నడూ ప్రజలను ముందుకు తీసుకుపోయే ప్రాథమిక సిద్ధాంతం, మౌలిక కర్తవ్యం నుండి పక్కకు మళ్ల కూడదు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారి ప్రయోజనాలను కాపాడే పంథాను విడనాడకూడదు" అని చెప్పారు. దీర్ఘ కాలంలో అధికారంలో ఉన్నందువల్ల వచ్చిన ప్రమాదాలను గురించి హెచ్చరిస్తూ పార్టీ తన విప్లవ లక్షణాన్ని నిరంతరం నిలుపుకోవాలని అన్నారు. "సోషలిస్టు పాలక పార్టీ రాజకీయ చరిత్ర ఎంత ఎక్కువైతే, అంత ఎక్కువగా ప్రజలకు సేవ చేయాలన్న స్ఫూర్తి తగ్గిపోతుంది. దాని వల్ల ప్రజలపై పెత్తనం చేసే బ్యూరాక్రాటిక్ కార్యాచరణ ఏర్పడే అవకాశాలు అంతగా పెరిగే అవకాశాలు ఏర్పడతాయి" అని చెప్పారు.

ప్రజల ఆశలు, డిమాండ్లు, ప్రయోజనాలకు, వారి వెసులుబాట్లకు పార్టీ అగ్ర ప్రాధాన్యత ఇస్తుందనీ, ఏ విధానాలు చేపట్టినా, అమలు పరిచినా వాటి పరమార్థం ప్రజలే అని గుర్తుంచుకుంటుందనీ కిమ్ జోంగ్ ఉన్

> **"పార్టీ పోరాట పటిమను పెంపొందించాల్సిన అవసరాన్ని గురించి కిమ్ జోంగ్ ఉన్ నొక్కిచెప్పారు. అన్ని పనులకన్నా ముందు పార్టీ సైద్ధాంతిక పనికి ప్రాధాన్యత ఇవ్వాలి. అది నేడు చాలా అవసరంగా ఉంది. అప్పుడు మాత్రమే పార్టీ దిగజారిపోకుండా ఆపగలం, విప్లవాత్మకమైన, సృజనాత్మకమైన అభివృద్ధిని సాధించగలం. విప్లవాత్మక అభివృద్ధి, కాలంలోపాటు వస్తున్న మార్పులు, ప్రజల చైతన్య స్థాయికి అనుగుణంగా సైద్ధాంతిక కృషిని సమర్థవంతంగా నిర్వహించాల్సి అవసరం ఉంది."**




పోంగ్యాంగ్‌లో జరుగుతున్న కొరియా వర్కర్స్ పార్టీ మహాసభ

పేర్కొన్నారు. అయితే ఈ ఆదేశాలు అమలు చేయడంలో జరిగిన పొరపాట్ల గురించి ఆయన వివరించారు. "ప్రజలే ముందు అన్న పార్టీ రాజకీయాలను అమలు జరపడానికి ప్రధాన అడ్డం పడుతున్న అంశం అధికారుల్లో నెలకొని ఉన్న తప్పుడు సైద్ధాంతిక ధోరణి, పని పద్ధతి" అని ఆయన చెప్పారు. ఈ బలహీనత నుండి బయటపడ్డం కోసం పార్టీ "సైద్ధాంతిక విద్యనూ, పోరాటాన్నీ నిరంతరాయంగా పెంచింది. పార్టీ నిర్దిష్ట లక్షణాన్ని కాపాడుకోవాలన్నా, దాని మనుగడ, అభివృద్ధి గ్యారంటీ సాధించాలన్నా, పార్టీ లోపల విప్లవకర, ఉత్తమ రాజకీయ వాతావరణం కొనసాగించాలన్నా పార్టీ అధికారుల తప్పుడు పని విధానాన్ని సరిదిద్దడం అత్యంత కీలక విషయం కనకనే దాని కోసం పార్టీ విద్యనూ, పోరాటాన్నీ నిరంతరాయంగా పెంచడం జరిగింది".

పార్టీ లోపల దాని అధికారుల్లోనూ ఈ తప్పుడు ధోరణులను నిర్మూలించడానికి జరిపిన పోరాటాన్ని గురించి వివరిస్తూ ఆయన ఇలా చెప్పారు: "అధికార దుర్వినియోగం, నిరంకుశాధికారతత్వం (బ్యూరాక్రాటిజం), అవకతవకలు, అవినీతి, డిపార్టమెంటలిజం, పన్నులు కాకుండా ఇతర వసూళ్ల వంటి వాటిని నిర్మూలించడం కోసం మేము వాటిపై యుద్ధం ప్రకటించాం. దశల వారీగా గట్టి సంస్థాగత, న్యాయపరమైన చర్యలు తీసుకున్నాం. అప్పగించిన పనిపట్ల బాధ్యతారాహిత్యం, తెలివితేటలు లేకపోవడం, పనిని పైపైన చేసుకు పోవడం, ఆత్మరక్షణ వాదం, ప్రజల జీవనం పట్ల నిర్లక్ష్యంగా ఉండడంతో సహా అన్ని రకాల తప్పుడు పని పద్ధతులు, తప్పుడె సైద్ధాంతిక ధోరణులను అధిగమించేందుకు పార్టీలోని అన్ని స్థాయిల్లో లోతైన పోరాటం జరిగింది." ఈ చర్యల వల్ల పార్టీ లోపల నెలకొన్న "ప్రజా వ్యతిరేక చర్యలను అరికట్టం, ప్రజాబాహుళ్యాన్ని అవమానించడం, వారి హక్కులు, ప్రయోజనాలను పాటించకపోడం వంటి పెడధోరణులు నిర్మూలించబడ్డాయి. అత్యధిక అధికారులు చాలా వరకు చైతన్యం పొంది సరిదిద్దు కున్నారు"

గత దశాబ్ద కాలంలో పార్టీ నిర్మాణంలో పార్టీ చాలా విలువైన విజయాలు సాధించిందని ఆయన చెప్పారు. ఇప్పుడు పార్టీని అయిదు అంశాల్లో బలోపేతం చేయాలని కర్తవ్యంగా పెట్టుకున్నామని చెప్పారు. అవి: పార్టీని రాజకీయంగా పరిపక్వం గావించడం. నిర్మాణ పరంగా పటిష్టం చేయడం. సైద్ధాంతికంగా స్వచ్ఛంగా ఉంచడం. ఉక్కు క్రమశిక్షణ. కొత్త శకానికి అవసరమైన రీతిలో పనిలో పటుత్వం సాధించడం. "ప్రపంచ సోషలిస్టు ఉద్యమానికి ఎదురైన చారిత్రిక గుణపాఠాల దృష్ట్యా, మన పార్టీ లోపల నెలకొన్న పరిస్థితి రీత్యా ఈ కొత్త అయిదు సూత్రాల మార్గదర్శకత్వం చాలా ముఖ్యమైనది" అని ఆయన వివరించారు.

ఈ అయిదు అంశాల్లో కూడా పార్టీ రాజకీయ పరిపక్వతను పెంపొందించడం అనేదాన్ని కేంద్ర కర్తవ్యంగా గుర్తించారు. పార్టీ నాయకత్వ సామర్థ్యాన్ని నిరంతరాయంగా పెంపొందిచడం, దాని సరైన రాజకీయ లక్షణాలను కొనసాగించడం దృష్ట్యా ఇది కేంద్ర కర్తవ్యమయింది.

పార్టీ ఆంతరంగిక ప్రజాస్వామ్యాన్ని పూర్తి స్థాయిలో పనిచేయిస్తూనే పార్టీ కమిటీల సమిష్టి నాయకత్వం ద్వారా అన్ని పనులు జరిగేట్లు పార్టీ కమిటీలు చూడాలని ఆయన చెప్పారు. పార్టీ పని నిరంకుశాధికార (బ్యూరాక్రాటిక్) పనిగా మారే ధోరణిని అధిగమించేందుకు గాను పార్టీ సంస్థల పనిని ప్రజలే చేసేట్లు దాన్ని రాజకీయ కార్యకలాపాలుగా మార్చాలి. పార్టీ సభ్యులందరూ ఉన్నతమైన రాజకీయ చైతన్యంతో రాజకీయ కార్యకర్తలుగా పనిచేసేట్లు ప్రోత్సహించాలి. ఆ విధంగా నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించాలి.

పార్టీ పోరాట పటిమను పెంపొందించాల్సిన అవసరాన్ని గురించి కిమ్ జోంగ్ ఉన్ నొక్కిచెప్పారు. అన్ని పనులకన్నా ముందు పార్టీ సైద్ధాంతిక పనికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. అది నేడు చాలా అవసరంగా ఉందన్నారు. "అప్పుడు మాత్రమే పార్టీ దిగజారిపోకుండా ఆపగలం, విప్లవాత్మకమైన, సృజనాత్మకమైన అభివృద్ధిని సాధించగలం" అని పేర్కొన్నారు. విప్లవాత్మక అభివృద్ధి, కాలంలోపాటు వస్తున్న మార్పులు, ప్రజల చైతన్య స్థాయికి అనుగుణంగా సైద్ధాంతిక కృషిని సమర్థవంతంగా నిర్వహించాల్సి అవసరాన్ని గురించి ఆయన విపులంగా వర్ణించారు.

సోషలిస్టు–వ్యతిరేక, సోషలిస్టేతర కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. పార్టీలో అన్ని

రకాల అవకాశవాద, విప్లవ-వ్యతిరేక సైద్ధాంతిక ధోరణులపై రాజీలేని పోరాటం చేయాలన్నారు.

పార్టీ నిర్మాణంలో క్రమశిక్షణను పెంపొందించాల్సిన, పార్టీ పనివిధానాన్ని సరిదిద్దాల్సిన అవసరం గురించి ఆయన విపులంగా వివరించారు. "పార్టీ అధికారులు తమ కర్తవ్యాలను బాధ్యతాయుత పద్ధతిలో, విప్లవ పనిచేస్తున్నామన్న ధోరణితో నిర్వహించేట్లు పార్టీ దృష్టి పెట్టాలి...మన పార్టీ నిజమైన ప్రజా సేవకురాలిగా ఉండాలంటే ప్రజల పట్ల సరైన దృష్టి, ధోరణి కలిగిఉండాలన్న విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మరిచిపోకూడదు" అని చెప్పారు.

పార్టీ తన లక్షణాన్ని, కర్తవ్యాన్ని ఒక్క క్షణం మరిచిపోయి నిరంకుశంగా వ్యవహరించినట్లయితే అది తన సహజమైన గుణాన్ని కోల్పోతుంది. అప్పుడు ప్రజలు దాన్ని విడిచిపెట్టేస్తారు. "అధికారులంతా ప్రజల పట్ల పార్టీ ధోరణినీ, తత్వాన్నీ తమ పని నినాదంగా, తమ జీవిత నినాదంగా మార్చుకోవాలి. ప్రజలకు సేవచేయడమే ధ్యేయంగా తమ పనిని మెరుగు పరుచుకోడానికి చేయాల్సినంతా చేయాలి. ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రజల్లో పనిచేసే పార్టీ పాత పద్ధతిని సుసంపన్నం చేయాలి. ప్రజలు ఏ సమయంలోనైనా ఆందోళన లేకుండా నమ్మదగిన, ఆధారపడదగిన అధికారి ఎవరూ అంటే చైతన్యంతో కూడిన, నిజాయితీగల అధికారి మాత్రమే. చైతన్యం, నిజాయితీ కలిగి నిరంతరం కొత్తదనంతో, నమ్రతగా, ఆదర్శప్రాయంగా పనిచేసే వారు మాత్రమే ప్రజల చేత గుర్తింపబడతారు."

> "పార్టీ అధికారులు తమ కర్తవ్యాలను బాధ్యతాయుత పద్ధతిలో, విప్లవ పనిచేస్తున్నామన్న ధోరణితో నిర్వహించేట్లు పార్టీ దృష్టి పెట్టాలి...మన పార్టీ నిజమైన ప్రజా సేవకురాలిగా ఉండాలంటే ప్రజల పట్ల సరైన దృష్టి, ధోరణి కలిగిఉండాలన్న విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మరిచిపోకూడదుపార్టీ తన లక్షణాన్ని, కర్తవ్యాన్ని ఒక్క క్షణం మరిచిపోయి నిరంకుశంగా వ్యవహరించినట్లయితే అది తన సహజమైన గుణాన్ని కోల్పోతుంది. అప్పుడు ప్రజలు దాన్ని విడిచిపెట్టేస్తారు."

పార్టీ గనుక అయిదు అంశాల్లో అంటే రాజకీయ, సంస్థాగత, సైద్ధాంతిక నిర్మాణంలోనూ క్రమశిక్షణ, పని విధానం మెరుగుపరుచుకోవడంలోనూ బలోపేతం అయితే పార్టీ నిర్మాణానికి సంబంధించిన తక్షణ కర్తవ్యాలను పరిపూర్తి చేయడమే కాదు, తన నాయకత్వ సామర్థ్యాన్నీ, పోరాట పటిమనూ పెంపొందించుకోగలుగుతుంది, ప్రజల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతగల విప్లవ పార్టీగా తన విధులను సక్రమంగా నిర్వర్తించగలుగుతుంది.

"కొరియా వర్కర్స్ పార్టీ కేంద్ర నాయకత్వ శిక్షణా పాఠశాల ప్రధాన పని విద్యార్థులను నిజమైన విప్లవకారులుగా తయారు చేయడమే. మన పార్టీ భావాలు, సిద్ధాంతాలను అధ్యయనం చేసి, వివరించడం, ప్రచారం చేయడం పాఠశాలకు చెందిన మరో పని" అని ఆయన చెప్పారు.

"మన పార్టీ విప్లవ సిద్ధాంతాన్ని కేంద్ర నాయకత్వ శిక్షణా పాఠశాల లోతుగా అధ్యయనం చేయాలి. కొత్తగా రూపొందించబడిన సూత్రాలు, విధానాలు, పోరాట విధానాల ప్రాసంగికత, శాస్త్రీయ ఖచ్చితత్వం, చలనశీలతలను నిరూపించాలి, వివరించాలి. ఆ విధంగా ఇది మన పార్టీ సైద్ధాంతిక సంపదను మరింత సుసంపన్నం చేయాలి."

ప్రణాళికా బద్ధమైన పాఠశాల కార్యక్రమం గురించి ఆయన చర్చిస్తూ, "పాఠశాల వ్యవస్థను సరైన రీతిలో రూపొందించడం, పాఠశాల లక్ష్యం, విధులకూ నేటి పరిస్థితులకూ అనుగుణంగా విద్యార్థును ఎంపిక చేసే విధానం రూపొందించడం చాలా అవసరం. అంతేకాదు పార్టీ స్ఫూర్తిని గుండెల నిండా నింపే విధంగా సైద్ధాంతిక, ఆచరణాత్మక విద్యను జయప్రదంగా నిర్వహించేందుకు పాఠశాల కార్యక్రమాన్ని సరైన రీతిలో నిర్వహించాలి" అని పేర్కొన్నారు.

రానున్న 50 ఏళ్లు, 100 ఏళ్లు ఇంకా వందలాది సంవత్సరాల పాటు పార్టీ ఎటువంటి చింత లేకుండా పార్టీ పనిని అప్పగించగలిగే సమర్థులైన పార్టీ అధికారులను, మంచి రాజకీయ కార్యకర్తలను ఈ కేంద్ర నాయకత్వ శిక్షణ పాఠశాల అందిస్తుందన్న నమ్మకాన్ని కిమ్ జోంగ్ ఉన్ వ్యక్తం చేశారు.

(కెసిఎన్ఎ వార్తా సంస్థ సౌజన్యంతో.....
అనువాదం: ఎస్. వెంకట్రావు)

# బౌద్ధ ధర్మం గురించి చక్కగా వివరించారు

## అభిప్రాయాలు

మార్క్సిస్టు పత్రిక సంపాదకులకు,

మార్క్సిస్టు పత్రికలో శర్మగారు రాస్తున్న చరిత్ర వ్యాసాలు బాగున్నాయి. గత జనవరి నెల సంచికలో బుద్ధుని పరిణామ క్రమ అంశాన్ని చక్కగా వివరించారు. లోక కల్యాణం కోసం బుద్ధుడు ప్రతిపాదించిన "దశ శీల" అనే పది మంచి నడవడిక సూత్రాల ఆవశ్యకత నేటి 21వ శతాబ్దంలో కూడా చాలా ఉన్నది. ఆయన చెప్పిన నీతి సూత్రాలు 1. ప్రాణాలు తీయవద్దు 2. దొంగతనానికి పాల్పడవద్దు 3. ఇంద్రియానందంలో మునిగిపోవద్దు 4. అబద్ధాలు చెప్పవద్దు 5. మత్తు పదార్థాలను సేవించవద్దు 6. ఇతరులపై నిందలు మోపవద్దు, అవహేళన చేయవద్దు 7. స్వంత పొగడ్తలు కూడదు 8, కాపట్యం, దాపరికం కూడదు 9. శత్రుత్వం విద్వేషం వద్దు 10. ధర్మాన్ని, త్రిరత్నాలను వ్యతిరేకించవద్దు.

ప్రస్తుత అస్తవ్యవస్థ సమాజ పరిస్థితుల్లో 5000 ఏళ్ల నాడు చెప్పిన నడవడిక సూత్రాలు చదివినప్పుడు మన సమాజం ఏ దుస్థితిలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. మంచి సమాజాన్ని నిర్మించే కర్తవ్యం ఎంతో కష్టమైనది, క్లిష్టమైనది. అయినా మన యువతీ యువకులు, ప్రగతి శీలురు వామపక్షాల మార్గదర్శకత్వంలో వాటిని సాధించడం అసాధ్యమేమీ కాదు. వీటిని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ వంటి ప్రజా సంఘాలు ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని నా అభిప్రాయం. నైతిక విలువల ఆవశ్యకతను పాఠశాల్లో బోధించాల్సిన అవశ్యకత మీద కూడా గొంతు విప్పాలి.

అభినందనలతో

మహమ్మద్ అక్బర్,
గుంటూరు.

# భారతదేశంలో హిందూత్వ పునరాగమనం ఎలా జరిగింది?

సుభాష్ ఘటాడే



రచయిత ప్రముఖ పాత్రికేయుడు, వామపక్ష ఉద్యమకారుడు. 'మోడీనామా', 'హిందూత్వ పునరాగమనం' వంటి అనేక పుస్తకాలు రాశారు. వర్తమాన రాజకీయాలపై వ్యాఖ్యానాలు, వ్యాసాలు రాస్తుంటారు.

"దేశభక్తి అనేది మన చివరి ఆధ్యాత్మిక మజిలీ కాకూడదు. నేను వజ్రాల ధరనిచ్చి గాజుపూసలు కొనుక్కోను. నా జీవిత కాలంలో ఎన్నడూ దేశభక్తి మానవత్వాన్ని అధిగమించనీయను." – 1908లో రవీంద్ర నాథ్ ఠాగూర్ తన స్నేహితుడు ఏఎం బోస్‌తో అన్న మాటలివి.

**మనిషి, ముసుగులు**

చిన్న పిల్లల కల్పితాలకు, ఊహలకు అంతే ఉండదు. వాళ్లు పులి తొడుగులు వేసుకుని పులిలాగా అరుపులు అరుస్తూ చుట్టూ ఉన్న స్నేహితులను, సన్నిహితులను భయ పెడుతూ ఉంటారు. ఆ మర్నాడే స్పైడర్ మాన్ ముసుగు వేసుకుని అంతెత్తున గాలిలో ఎగిరి పోతున్నట్టు ఊహించుకుంటుంటారు. ఈ పిల్ల చేష్టలను చూసి ఏ పెద్దవారైనా ఎప్పుడైనా భయపడతారా? ఎన్నడూ అలా జరగదు.

కానీ రేపొద్దున్న పెద్దవాళ్ళు ఒక సమూహంగా రకరకాల ముసుగులు వేసుకుని వచ్చి వీధుల్లో పడి తిరుగుతూ, కేకలేస్తూ ఉంటే ఏమవుతుంది? వారి మానసిక ఆరోగ్యాన్ని సంశయించకుండా ఉంటామా? కావలసిన వారైతే వాళ్లకు మానసిక రోగులను సంప్రదించమని సలహా ఇవ్వకుండా ఉంటామా?

నరేంద్రమోడీ భారత ప్రధానిగా పదవిని అలంకరించి ఎనిమిదేళ్లు పూర్తయిన సందర్భంలో అయన ఆ పదవిలోకి వచ్చిన వైనం ఒకసారి పునఃశ్చరణ చేసుకుందాము. మొదట ఆయన గుజరాతీ హిందువుల నాయ కుడు. 'గుజరాత్ సింహం'గా పేరుతెచ్చు కున్నారు. ఆ తరువాత భారతదేశ జాతీయ స్థాయికి ఎదిగారు. భారతదేశ సింహంగా మారారు. అతను తొడుక్కుంటున్న ముసుగులనే తన చుట్టూ ఉన్నవారికి కూడా తొడిగారు. అతని అనుయాయులు తమ సొంత గుర్తింపులను వదులుకుని అతనివెంట నడిచారు.

మోడీ, తన వ్యక్తిత్వంతో, చుట్టూ జనాన్ని ఆకర్షించగల మొదటి వ్యక్తి కాదు. కానీ ఇరవై నాలుగు గంటలూ టీవీలు నట్టింట్లో మోగుతున్న పుణ్యామా అని, మోడీ సజీవంగా ప్రజల పడకటింట్ల వరకు చేరిన మొదటి వ్యక్తి. అతని హావభావాలు, మాయమాటలు, అతను తన పేరుతో నేసి ఉన్న కోటు ధరించడం, డిలెక్సియా (పిల్లలకు చూపు సరిగానే ఉన్నా చదవడం కష్టమయే ఒక వ్యాధి) గురించి చేసిన వ్యంగోక్తులు వగైరాలతో కుటుంబాలలోకి జొరబడిపోయారు. ముందు ముందు చరిత్ర రాసే వారు, ఇంతకు ముందు హిందుత్వ క్యాంపు నుండి ప్రధానులు, ప్రధాన పాత్ర పోషించిన వారెవరికన్నా – వాజ్‌పేయిగానీ, అద్వానీ గానీ, బాలథాకరే గానీ, లేదా అటువంటి ఇతరులెవరికన్నా – మోడీ ఎక్కువ ప్రాచుర్యం గల నాయకుడని చెప్పడానికి ఏమాత్రం సందేహించవలసిన అవసరం లేదు.

మోడీ పాలించిన గత ఐదేళ్ళను పరిశీలిస్తే, భారతదేశం స్వతంత్రం వచ్చిన తరువాత ఇంతటి గడ్డు రోజులను ఎన్నడూ ఎదుర్కోలేదని అర్థం అవుతుంది.

మోడీ పైన, అతని పాలనపైన భిన్నాభిప్రాయాలు, విమర్శలు ఉండవచ్చుగాక. కానీ అతని నేతృత్వంలో భారతదేశం 'ఒక కొత్త శకం' లోకి అడుగిడిందనేది నిర్వివాదాం శం. నిజంగానే ఇది ఒక 'కొత్త భారతదేశం' – స్వతంత్ర పోరాటకాలంలో ఉన్న ముందుతరం నాయకులెవరూ ఊహించని భారతదేశం.

దేశంలో చాలామంది, మోడీ దేశం లో ఉన్న వ్యవస్థలనన్నిటిని చైతన్యపూరితంగా సర్వనాశనం చేశారని, నిర్వీర్యం చేశారని, రాజ్యాంగాన్ని పలచన చేశారని, పురాణాలను ఆకాశానికెత్తి శాస్త్ర విజ్ఞానాన్ని అవమాన పరిచారని అంటున్నారు. ఈ కాలంలో లౌకికతత్త్వం అనే ఆలోచనను చులకనచేశారు. ప్రజాస్వామ్యం స్థానాన్ని మెజారిటేరియనిజం ఆక్రమించింది. భారతదేశం అంటే ఉన్న పాత అభిప్రాయాలు విచ్ఛిన్నం చేయబడ్డాయి. వాటి స్థానంలో, అధికార పీఠానికి, ఆర్ఎస్ఎస్‌కి, దాని సంఘాలకు మధ్య ఉన్న బంధాల పుణ్యమా అని కొత్త భారతదేశం ఆవిష్కరించబడింది, ప్రదర్శించబడింది.

ఈ కొత్త భారతదేశానికి కొత్త చిహ్నాలు ఏర్పడ్డాయి.

ఈ సందర్భంలో అందరి మనసులను ఒకే ప్రశ్న తొలుస్తున్నది. ఈ కొత్త భారతదేశ గమనం ఇలాగే సాగిపోతుందా? లేక దీనికేమైనా అడ్డు కట్టలు పడతాయా? యుద్ధ భేరీల మోతలు మధ్య, చైతన్య పూరితంగా భావోద్వేగాలు రెచ్చగొడుతూ, 'ఇతరులుగా' చూపి కొందరిపై దాడులకు తెగబడుతున్న నేపథ్యంలో, అలనాటి భారతదేశం, తిరిగి

> ❝ ఆటగాళ్లు మారడంతో, కొత్త ఆట మొదలవడంతో, కొత్త మార్పులు రాబోతున్నట్టు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. 'హిందూ భారతదేశాన్ని' తీవ్రవాదం వైపు నడిపే విధానం, వేగాన్ని కూడా పుంజుకుంటున్నది. అందులో సందేహం లేదు. ❞

రెట్టింపు వేగంతో బలంతో పుంజుకుంటుందా?

రాబోయే రోజుల్లో ప్రజలకు ఏమైనా స్వాంతన ఉంటుందా? లేదా పరిస్థితులు కుహనా దేశభక్తి, కుహనా జాతీయవాదంతో ఇలాగే కొనసాగుతాయా? ఈనాటి "పగబట్టిన జాతిగా, పిడత మెదళ్లతో, సంకుచిత ఆత్మలతో" ఇలాగే కొనసాగుతుందా? ప్రజాతంత్ర వ్యవస్థ పునరుజ్జీవనం చెందుతుందా? అంతర్జాతీయం గా వేలెత్తి చూపబడుతున్న "విభజన విధానా లకు" అంతం ఉంటుందా? ఆర్థిక పురోగతికి అడ్డంకిగా మారుతున్న ఈ దారికి అడ్డుకట్ట ఎలావడుతుంది? 'సంకుచిత రాజకీయ ప్రయోజనాలు లక్ష్యంగా చేసుకుని ఇప్పటికే అసమానతలు గల సమాజంలో, దుర్బలులను మరింత వెనక్కి నెట్టేస్తే, ఫలితాలు మరింత తీవ్రంగా ఉంటాయి.

ఆటగాళ్లు మారడంతో, కొత్త ఆట మొదలవడంతో, కొత్త మార్పులు రాబోతున్నట్టు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. 'హిందూ భారతదేశాన్ని' తీవ్రవాదం వైపు నడిపే విధానం, వేగాన్ని కూడా పుంజుకుంటున్నది. అందులో సందేహం లేదు.

**దేశభక్తి సులభతరం!**

సామాజిక మాధ్యమాలు, ముఖ్యంగా వాట్సప్, ప్రజలను అత్యంత సులువుగా చేరుకునే సామాజిక మాధ్యమం. 2010 నుండి దాని వినియోగ వేగం మరింత పెరిగింది. ఈ నాటికి భారతదేశంలో 20 కోట్ల మంది వాట్సప్ వినియోగిస్తున్నారు. అదో అద్భుతం. ఏ ఇతర ప్రజాతంత్ర దేశం కన్నా మన దేశంలోనే వాట్సప్ వినియోగదారులు ఎక్కువమంది ఉన్నారు. ఇది ఎన్నికలను ప్రభావితం చేస్తుందని పరిశీలకుల అభిప్రాయం. సామాజిక మాధ్యమాలు వేగంగా భావాలను ప్రభావితం చేయగలవు. ఎంతగా అంటే, ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలను వాట్సప్ ఎన్నికలని అంటున్నారు. 2014లో ఎన్నికలు వేరుగా ఉండేవి. ఈ మధ్యకాలం చరిత్రను గమనిస్తే, ఆశ్చర్యంగా, సామాజిక మాధ్యమాలు – ఇది వరకు ఫేస్‌బుక్, ఇప్పుడు వాట్సప్ మితవాద భావాలను, వారి విభజిత ఆలోచనలను శరవేగంగా ప్రజలలోకి తీసుకెళుతున్నాయి. సామాన్యులు, ప్రజలంతా కలిసి మెలిసి ఉండాలనుకునే వారు వెనక పడుతున్నారు. ఇది చాల నష్టం కలిగిస్తుంది.

గతంలో బ్రెజిల్‌లో ఎన్నికలు జరిగినప్పుడు మితవాద ఫైర్ బ్రాండ్‌గా పేరుతెచ్చుకున్న బోల్సనారో అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు. (ఇటీవలి ఎన్నికల్లో ఆయనను బ్రెజిల్ ప్రజలు ఓడించారు. అది వేరే విషయం) డోనాల్డ్ ట్రంప్ శ్వేత సౌధానికి ఎన్నికవడం ఫేస్ బుక్ ద్వారా వేగంపుంజుకుంటే, బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికలలో వాట్సప్ ప్రధాన పాత్ర పోషించింది. బ్రెజిల్‌లో వాట్సప్ విస్తృతంగా ఉపయోగిస్తారు. దాదాపు 12 కోట్ల వినియోగదారులు అక్కడ ఉన్నారు. ఇది రాజకీయ సమీకరణకు అక్కడ మంచి ఆయుధంగా పనిచేసింది. అంతేకాదు. తప్పుడు కథనాల ప్రచారానికి కూడా ఉపయోగపడింది. తప్పుడు వార్తల కల్లోలం ఎంత ఎక్కువగా ఉండేదంటే, దాదాపు 24 మీడియా సంస్థలు, టివి చాన్నాళ్ళుగాని, వార్త పత్రికలుగాని, స్థానిక పత్రికలుగాని తప్పుడు సమాచారాన్ని నిరంతరంగా ప్రసారం చేస్తూ ఉండేవి. వీటన్నిటికీ కలిపి కోమ్ ప్రూవ అని పేరుపెట్టారు.

ఇక భారతదేశం సంగతికి వస్తే, క్వీన్ మేరి విశ్వవిద్యాలయం భాగస్వామ్యంతో వాట్సప్ ఒక నివేదికను రూపొందించింది. తన జర్నల్‌లో ఒక పతాక శీర్షిక కథనాన్ని ప్రచురించింది. వాట్సప్ పోషించిన పాత్రవలనే 2019 ఎన్నికలను వాట్సప్ ఎన్నికలు అని అంటున్నారు. ఇందులో తప్పుడు సమాచారాల ప్రచారమే ఎక్కువగా జరిగింది. ఒక నివేదిక ప్రకారం, రాజకీయ పార్టీలు దేశంలో ప్రాచుర్యం పొందిన మాధ్యమాలను ఉపయోగించుకుంటున్నాయి. వాట్సప్‌తో తప్పుడు సమాచారాలు ప్రచారం కావడంతో భారతదేశంలో హింస బాగా పెరిగిపోయింది. ఇది ప్రజాతంత్ర వ్యవస్థకే నష్టదాయకం.

క్వీన్ మేరి విశ్వవిద్యాలయం, లండన్‌లోని అధ్యాపకుడు, ఫిలిప్ విల్లియమ్స్, జిందాల్ స్కూల్ అఫ్ లిబరల్ ఆర్ట్స్ అండ్ హ్యూమనీటిఎస్, సహాయ ఆచార్యురాలు లిపికా కామ్రా కలిసి చేసిన అధ్యయనంలో, "బిజెపి 9 లక్షల మంది సెల్ ఫోన్ ప్రముఖ్ లను" భారతదేశవ్యాప్తంగా నియమించుకుంది. వారు ప్రధాని నరేంద్ర మోడీ ''విజయాలను'' కిందిదాకా తీసుకెళ్లారు. కాంగ్రెస్ కూడా ఈ విధమైన డిజిటల్ సాథీలను నియమించుకుంది.

వాట్సప్ ఏవిధంగా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసి హత్యలకు, దాడులకు కారణమయ్యిందో ఈ మధ్యకాలంలో జరిగిన 30 సంఘటనలు ప్రధానంగా తెలియచేస్తున్నాయి. ఉదాహరణకి ఒక గ్రామంలో పిల్లలను ఎత్తుకు పోయేవారు తిరుగుతున్నారని తప్పుడు సమాచారం వాట్సప్‌లో ప్రచారమయింది. ఇంకేముంది, హిందూ మితవాదులు సాధారణ ప్రజలలోకి ఈ వార్తను అమితంగా తీసుకెళ్లి సమాజంలో భయాందోళనలు కలగచేయడంలో సఫలీకృతులయ్యారు.

ఈ మధ్యనే మైక్రోసాఫ్ట్ నిర్వహించిన ఒక సర్వేలో భారతదేశంలో ప్రచారమయ్యే వార్తలలో 64% తప్పుడు వార్తలే అని తేల్చింది. ప్రపంచవ్యాప్తంగా తప్పుడు వార్తలు ప్రచారం 57% ఉంది. అంతర్జాలంలో తప్పుడు వార్తల ప్రచారం అంతర్జాతీయంగా 50% ఉంటే మన దేశంలో 54% ఉన్నది. అంతర్జాలంలో ప్రచారమయ్యే తప్పుడు వార్తలు హత్యలకు దారితీసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కిందటేడాది జరిగిన హత్యలలో 40% స్మార్ట్ ఫోన్‌ల ద్వారా రెచ్చగొట్టబడి జరిగిన హత్యలే.

బిబిసి 'నకిలీ వార్తలకు ఆవల' అనే కథనాన్ని ప్రసారం చేసింది. అందులో కూడా నకిలీ వార్తలు అంతర్జాలంలో ప్రచారం పొందడం వలన మరిన్ని హత్యలు జరుగుతున్నాయని మైనారిటీలకు వ్యతిరేకంగా సెంటిమెంటు వ్యాపింప చేయగలుగుతున్నారని ధ్రువపరిచింది. బిబిసి ప్రపంచ సేవలలో పనిచేసే సంతాను చక్రవర్తి, "ప్రేక్షకుల మనోగతాలను" తెలుసుకోడానికి నియమితులైనవారు. నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా ఎదిగినప్పటి నుంచి చాలామంది హిందువులు, ప్రధానమంత్రి సామాజిక మాధ్యమాల నుండి వచ్చిన వార్తలను ఇతరులకు పంపడం, పంచుకోడం ఒక దేశభక్తునిగా తమ బాధ్యతగా భావిస్తున్నారని సంతాను చక్రవర్తి వెల్లడించారు. ఈ మాధ్యమాలను హిందువులు తమ గుర్తింపును ధృవీకరించుకోడానికి ఉపయోగించుకుంటుంటారు. ఆ ధ్రువీకరించుకొనే క్రమంలో

> **❝ పాకిస్తాన్ మతరాజ్యంగా నెమ్మదిగా మార్పుచెందు తుండడం చాలారోజుల నుండి జరుగుతున్నది. భారతదేశ ఈ మధ్యకాలంలో మొదలయింది. 20 లక్షల మంది హత్య కావించ బడి, ఒక కోటికి పైగా ప్రజలు గాయాల పాలైన విభజన జరిగిన కాలంలో కూడా గట్టిగా లౌకికతత్వానికి కట్టుబడిన దృఢమైన నాయకత్వం గల దేశం, స్వతంత్రం వచ్చిన వెంటనే ఎదురైన అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్న దేశం, ఈ రోజు ఎందుకు ఒక మతాన్ని శత్రువులుగా చూస్తున్నదో చాలామందికి అర్థం కావడం లేదు. ❞**

వాస్తవాలు నిర్ధారించుకోవడం మరుగున పడిపోతుంటాయి" అన్నారు.

ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ మాటలలో, వారు జాతీయతను, మతాన్ని, దేశభక్తిని కలగలిపేశారు. అందువలన సామాజిక మాధ్యమాలలో తమ ప్రయోజనాలు సాకారం చేసుకోడానికి చారిత్రిక వాస్తవాలను మసకబార్చి గుప్పిస్తూపోతున్నారు. ఈ పరిశీలనాలన్నీ నరేంద్రమోడీ క్రియాశీల రాజకీయ కార్యకలాపాలకూ, నకిలీ వార్తలకూ సంబంధం ఉందని తెలియచేస్తున్నాయి. అంటే, "నరేంద్రమోడీకి సంబంధించిన నకిలీ వార్తలను చురుకుగా, సమర్ధవంతంగా వండి వార్చబడుతున్నాయి. వాటిని ప్రచారం చేయడానికి ట్విట్టర్, వాట్సప్, ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాలను వాడుకుంటున్నారు,"

విస్తృతమైన సామాజిక, సాంస్కృతిక సమస్యలకు నేడున్న సాంకేతిక పరిజ్ఞానం తోడైతే ఎటువంటి ఫలితాలు వస్తాయో చూడాలి. ఇప్పటికే మన సమాజం కులాలు, జాతులు, మతాలు, లింగ బేధాలతో విడివడి ఉంది. ఇది విద్వేషాలు వేగంగా వ్యాప్తిచెందడానికి అనువైన రంగస్థలాన్ని కల్పిస్తాయి. సఫియా ఉమోజ నోబెల్, 'అల్గోరిథమ్స్ అఫ్ అప్పోజిషన్ : హౌ సెర్చ్ ఇంజిన్స్ రీఇన్ఫోర్స్ రేసిజం' అనే పుస్తకంలో అంతర్జాలం వివక్షతను ఎలా పెంచుతుందో, ఎలా నిలుపుతుందో, ఎలా వ్యాప్తిచేస్తుందో వివరించారు. స్త్రీ పురుషుల మధ్య, నలుపు, తెలుపు జాతుల మధ్య వివక్షత కొనసాగించడానికి ,పెంచి పోషించడానికి అంతర్జాలం పోషించే పాత్రను వివరించారు.

సరిగ్గా 25 సంవత్సర క్రితం రువాండాలో జాతి హననం జరిగిన సంగతి చాలామందికి గుర్తుండే ఉంటుంది. ఎనిమిది లక్షల మంది టూటిసి జాతికి చెందిన వారిని హిట్స్ జాతీవారు చంపేశారు. ఇది 20వ శతాబ్దపు అతిదారుణమైన సంఘటన. అప్పుడు ఆ ప్రాంతంలో వార్తాపత్రికలు, రేడియోలే తప్ప ఇతర సామాజిక మాధ్యమాలు లేవు. మనదేశంలో ప్రాంతీయ భాష వార్తాపత్రికలు రామజన్మ భూమి ఉద్యమకాలంలో ఎటువంటి పాత్ర పోషించాయో మనందరికీ తెలుసు. ఉద్రిక్తతలు రెచ్చగొట్టడంలో హిందీ పత్రికల పాత్రను ప్రెస్ కౌన్సిల్ అఫ్ ఇండియా ఖండించక తప్పలేదు.

**3**

2019 ఎన్నికల ఫలితాల కోసం ఊపిరి బిగబట్టి వేచిచూస్తున్న సమయంలో 'ఆజ్మీష్: ఎ జర్నీ త్రూ ది సబ్కాంటినెంట్' అనే పాకిస్తానీ సినిమా నిర్మాత తయారు చేసిన డాక్యుమెంటరీ గుర్తుకొచ్చింది. ఈ సినిమా రెండేళ్ల కిందట లండన్ ఫిలిం ఫెస్టివల్‌లో సంచలనం సృష్టించింది. ఇందులో, 70 ఏళ్ల స్వతంత్రం తరువాత భారతదేశం కూడా పాకిస్తాన్ లాగా మత తీవ్రవాదం వైపుకు మరలుతున్నదా అని చర్చిస్తారు. సరిహద్దుకు రెండు వైపుల ఉన్న రాజ్యాలు ఉదారవాద ప్రజాస్వామ్యం నుండి వెనక్కి మళ్లుతున్నాయి.

పాకిస్తాన్ మతరాజ్యంగా నెమ్మదిగా మార్పుచెందుతుండడం చాలారోజుల నుండి జరుగుతున్నది. భారతదేశ రంగుల మార్పు ఈ మధ్యకాలంలో మొదలయింది. ఇదే అందరినీ దిగ్భ్రాంతికి గురి చేస్తున్నది. 20 లక్షల మంది హత్య కావించబడి, ఒక కోటికి పైగా ప్రజలు గాయాల పాలైన విభజన జరిగిన కాలంలో కూడా గట్టిగా లౌకికతత్వానికి కట్టుబడిన దృఢమైన నాయకత్వం గల దేశం, రక్తసిక్తమైన ఆ రోజుల్లో కూడా మతతత్వానికి వ్యతిరేకంగా నిలిచిన దేశం, స్వతంత్రం వచ్చిన వెంటనే ఎదురైన అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్న దేశం, ఈ రోజు ఎందుకు ఒక మతాన్ని శత్రువులుగా చూడవలసి వస్తున్నదో చాలామందికి అర్థం కావడం లేదు. ఇటువంటి పరిస్థితి భారతదేశం లాంటి ప్రత్యేకతలు గల దేశాలకి మాత్రమే వస్తుందా? వలసవాదానికి వ్యతిరేకంగా అన్ని జాతులు, మతాలవారు భుజం భుజం కలిపి పోరాడిన, లౌకిక భావాలు గలవారి నాయకత్వంలో జరిగిన ఉద్యమాల కొనసాగింపు ఈ విధంగా ఉంటుందా?

ఈ సినిమా దర్శకురాలు దక్షిణాసియా సంస్కృతిలోనే కష్టాలలో ప్రజలు మతం వైపుకి పరిష్కారం కోసం చూస్తారని చెప్పారు. 'హిందుత్వ, పశ్చిమదేశాలు చేత ప్రభావితం అయిన లౌకిక ఉన్నత తరగతుల వారు, వారి నయా – ఉదారవాద విధానాలకు భారతీయుల ప్రతిస్పందనగా' వచ్చిందని ఆమె అభిప్రాయం.

భారతదేశం రంగులు మారుతుండడానికి అనేక కోణాలు ఉన్నాయని చెప్పుకోవచ్చు. అందులో సందేహమే లేదు.

ప్రపంచవ్యాప్తంగా మితవాద భావజాలాలు పెరుగుతున్న క్రమంలో భారతదేశంలో కూడా మితవాద పార్టీ అభివృద్ధి చెందుతున్నది. పైగా ఇక్కడ అధికారంలో ఉన్నది కూడా వాళ్లే. దీనికి 90 ఏళ్ల చరిత్ర ఉంది. ఇది నయా – ఉదారవాద విధానాల అమలుకు అనుకూలం. ఈ నయా–ఉదారవాద విధానాల అమలు దుఃష్ఫలితాలు చాల దారుణంగా ఉంటాయి. సమాజం విచ్ఛిన్నమవుతుంది. వ్యక్తులు ఉపశమనం కోసం మార్చలేని 'కులం, జాతి, మతం, ప్రాంతం వగైరాల వైపు చూడవలసివస్తుంది. అది వ్యక్తులుగానో సమూహాలుగానో జరగవచ్చు.

1980లలో బ్రిటన్‌లో మితవాద రాజకీయాలను విశ్లేషిస్తూ, సాంస్కృతిక సిద్ధాంతకర్త స్టువర్ట్ మిల్ దీనిని 'ఆధిపత్యానికి ప్రజాదరణ' అన్నారు. ఇటువంటి విధానంలో సాధారణ ప్రజలకూ ఉన్నతవర్గాలకూ మధ్య వైరుధ్యాలు విస్మరించబడుతూ, ఆధిపత్యాన్ని ప్రజలపై రుద్దడాన్ని చట్టబద్ధం చేసుకోవడం రాజ్యం లక్షణంగా ఉంటుంది. ఆ వైరుధ్యాలలో ఒక భాగం, తమతో ఉండే ప్రత్యేకమైన సమూహాలను శత్రువులుగా చూపడం జరుగుతుంటుంది – వారు ప్రజల ప్రయోజనాలకు శత్రువులుగా, భంగం కలిగించేవారిగా చూపబడతారు''. సమాజం మీద, రాజకీయాలమీద తమ పట్టును పెంచుకుని, ప్రజాతంత్ర వ్యవస్థకి హాని కలిగిస్తారు.

హిందుత్వ ఎదగడానికి, రాజకీయ శూన్యతని బిజెపి తెలివిగా వాడుకోగలిగిందని, పాలక పార్టీల మధ్య 'ఉదారవాద విధానాల అమలు, దేశ పాలనా విధానాలు, విదేశాంగ విధానాలలో సయోధ్య కుదరడం బిజెపి తనకు తాను,' ఈ విధానాల అమలు చేయగల సత్తా ఉన్న ఏకైక పార్టీగా చిత్రించుకోగలగడం కారణమని విప్లవాత్మక వామపక్షాలు అభిప్రాయ పడ్డాయి. అంతేకాదు, ప్రజా సమూహాలను

బయటికి నెట్టేయడమే అభివృద్ధికి చెల్లించక తప్పని మూల్యంగా సాధారణ ప్రజలను ఒప్పించ గలిగింది. ఆ క్రమంలో మానవ హక్కుల బలిదానం తప్పదని, రహస్యంగా పనిచేసే ఆర్ఎస్ఎస్ 'తన విద్వేష సాధనాలతో, అసత్యా లతో, పుకార్లతో, తీవ్రవాద ప్రైవేటు సైన్యాల నెట్‌వర్క్‌తో', పనిచేయడం తప్పనిసరి అని ప్రజలను నమ్మించింది.

వీటన్నిటిని పరీక్షిస్తే, అందులో వాస్తవాలు లేకపోలేదనిపిస్తుంది. పంకజ్ మిశ్రా మాటల్లో, "వారి జీవితాలను నిర్ధారించే అన్ని సామాజిక, రాజకీయ, ఆర్థిక శక్తులు శూన్యంగా మారినవేళ, ఈ ప్రపంచంలో చాలా మంది వ్యక్తులు నిరంతరం భయం మధ్య బతుకుతుంటారు. జాతి రాజ్యాలను ప్రపంచీకరణ, నిరంతరంగా చలిస్తున్న మార్కెట్లు కుదిస్తుండగా, స్వేచ్ఛగా చర్యలు తీసుకోగలిగే అవకాశాలు కుంచుకుపోతాయి. వలసలు పెరిగి నిర్వాసితులు అధికమవుతారు. ఇవి పౌరసత్వాన్ని, జాతి సంస్కృతిని, సంప్రదాయాలను సవాలు చేస్తాయి. దానితో భయం, అభద్రత పెరుగుతుంది. పోటీతత్త్వం పెరిగడంతో భయం గుప్పిట్లో చిక్కుకుంటారు. ఓడిపోతామన్న భయం నిరంతరం వెన్నాడుతుంటుంది. కాస్తంత మెరుగైన జీవితాలు గడిపేవారికి కూడా తమ చుట్టూ శత్రువులు కనిపిస్తుంటారు – వారు సోషలిస్టులో, ఉదారవాదులో, నల్ల జాతీయులో, స్వేతసౌధంలోని ముస్లింలో కావచ్చు – వారిని తమ పీడనలకు బాధ్యులను చేస్తారు. "బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి భారతదేశ ప్రజాస్వామ్యాన్ని ఒక కొత్త సైద్ధాంతిక చట్రంలో ఇమిడ్చింది, సాధారణ ప్రజల జీవితాలలో కొత్త మార్పును తెచ్చింది. కొత్త పాలనా రాజకీయాలను రూపొందించింది."

డాక్టర్ సుహాస్ పాలీషికార్, రెండో ఆధిపత్య పార్టీ విధానంలో, బిజెపిని గురించి చెపుతూ, ఇది కేవలం కొత్త పార్టీ వ్యవస్థ మాత్రమే కాదు. కొత్త ఆధిపత్య ఆలోచనలు గలది, వ్యాకులతకు గురిచేసేది. ఆధిపత్య పార్టీ విధానానికి సైద్ధాంతిక రూపం ఇచ్చేది. 'కొత్త రాజకీయాలకు తెరతీసేది. హిందుత్వ, రాజకీయ అర్థశాస్త్రం కలగలిసి ఉండేది' అన్నారు. ఈ హిందుత్వ, తన అనుయాయులను బహిరంగంగా తమ మత నమ్మకాలను ప్రదర్శించమంటుంది. జాతీయవాదులకు హిందుత్వవాదులకూ మధ్య ఉన్న గందరగోళమే 'కొత్త ఆధిపత్య సిద్ధాంతానికి మూలం', ఈ సిద్ధాంతం రాజకీయంగా, మతపరంగా హిందువులుగా ఉండమంటుంది. ఈ సిద్ధాంతం బిజెపి ఎదగడానికి ఉపయోగపడడమే కాదు, బిజెపిని

**"డాక్టర్ సుహాస్ పాలీషికార్, రెండో ఆధిపత్య పార్టీ విధానంలో, బిజెపిని గురించి చెపుతూ, ఇది కేవలం కొత్త పార్టీ వ్యవస్థ మాత్రమే కాదు. కొత్త ఆధిపత్య ఆలోచనలు గలది, వ్యాకులతకు గురిచేసేది. ఆధిపత్య పార్టీ విధానానికి సైద్ధాంతిక రూపం ఇచ్చేది. 'కొత్త రాజకీయాలకు తెరతీసేది. హిందుత్వ, రాజకీయ అర్థశాస్త్రం కలగలిసి ఉండేది' అన్నారు."**

వ్యతిరేకించిన వారు దేశ ద్రోహులుగా చూడబడేటట్టు చేస్తుంది. అంతేకాదు, హిందుత్వాన్ని నమ్మడం అంటే తమ జాతీయతను తెలియజేయడంగా ఉంటుంది. హిందుత్వ ఆలోచనలను జాతీయతను జోడించి, వాటిని రాజకీయ సైద్ధాంతిక దాడికి అస్త్రాలుగా ఎలా మార్చుకోడం సాధ్యపడిందో ఈ వ్యాసంలో వివరించారు. ఆర్ఎస్ఎస్ సంస్థలన్నీ వేటికవే ఉన్నట్టు ఉండి కూడా ఎలా ఒకదానితో ఒకటి సంబంధాలు కలిగి ఉండడం వలన వాటికి కలిగే లాభాలు గురించి చెప్పారు.

తన ఆధిపత్యాన్ని స్థాపించాలని 'హిందుత్వ' ఎప్పటి నుండో కలలు కంటున్నది. ఆర్ఎస్ఎస్, తనకు తాను సాంస్కృతిక సంస్థగా చెప్పుకుంటుంది. వేలాదిగా ఉన్న దాని అనుబంధ సంస్థలు, ఈ మార్పులన్నిటిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆర్ఎస్ఎస్ తాను సమాజంలో ఒక సంస్థను కానని సమాజం కోసం (పనిచేసే) సంస్థనని చెప్పుకుంటుంది.

డాక్టర్ జయంత్ లేలే, బాబ్రీమసీదు విధ్వంసం తరువాత హిందుత్వ గురించి రాస్తూ, 'ఈనాటి హిందుత్వ గతంలో తాను తారుమారు చేస్తూ వచ్చిన అంశాలలో మూడు కచ్చితమైన లక్షణాలను వివరంగా మనముందు ఉంచుతుంది. దాని అభిప్రాయాలూ, ఆధిపత్యం, సజాతీయత, బోధన, ఇవన్నీ ఒకేసారి పనిచేస్తుంటాయి. ఒకదానితో ఒకటి మిళితమై కూడా పనిచేస్తుంటాయి. అది రాజకీయ అధికారం పొందాలనుకుంటున్నది కాబట్టి ఆధిపత్య వ్యవస్థ అయింది. తన రాజకీయాలకు అవసరమైన ఎన్నికల సందర్భంలోను, ఇతర సంబరాలు జరుపుకునే సందర్భంలోను ప్రజలను సమీకరించగలుగుతుంది. దీర్ఘకాలంలో దాని లక్ష్యం – రాజకీయ సంస్థలన్నిటితో సంబంధాలు పెట్టుకోవడం. తద్వారా విధాన రూపకల్పన చేయడం. అదే సమయంలో గర్వించదగ్గ హిందువును రూపొందించడం' అని చెప్పారు.

1980ల నుండి హిందుత్వ శక్తులు వివిధ సంస్థల ద్వారా, అనేక విధాలుగా కొత్త పాలనను ప్రవేశ పెట్టే ప్రయత్నాలు చేశారు. దాని లక్ష్యం హిందువుగా గుర్తింపు జాతి అంతటికీ ఉండాలని, అది అందరిని తనలో కలుపుకుపోయే విధంగా వైవిధ్యమైన మార్పులకు స్థానం కల్పిస్తూ ఉండాలని. ఇది, భారతదేశ సంప్రదాయంలో ఉన్న వైవిద్యభరితమైన సృజనాత్మకతని, విమర్శనాత్మక ప్రేరణలను బ్రాహ్మణీకరణ పేరుతో ఒక్కటిగా మలచాలనే ఆర్ఎస్ఎస్ మునుపటి విధానాన్ని పోలి ఉంటుంది.

కె.ఎం.పనిక్కర్.. 'కన్వెన్షన్ ఆన్ సెక్యులర్ కల్చరల్ యాక్షన్' అనే సదస్సులో వాజ్‌పాయ్ ప్రభుత్వం ఎలా పాలిస్తున్నదో నొక్కి చెప్పారు. "భవిష్యత్తులో హిందూ రాష్ట్రం, సమాజం ఏర్పాటు చేసేందుకు అనుగుణమైన సామాజిక సైద్ధాంతిక, రాజకీయ పరిస్థితులను సృష్టించడానికి బిజెపి, సంఘ్ పరివార్ సభ్యులు అధికారం వచ్చిన నాటి నుండి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పని మూడు రకాలుగా అమలు అవుతున్నది. బ్రాహ్మణ శాస్త్రాలకనుగుణంగా, హిందూ జాతినంతటిని ఒక గొడుగు కిందకి చేర్చడం. ఇతరులను తొలగించడానికి వీలు లేకపోతే, తమకింద అణగిమణిగి ఉండేటట్టు చేసుకోవడం, శక్తివంతమైన హిందూ జాతిని నిర్మించడం" అని చెప్పారు. కేంద్రంలో అధికారం చేజిక్కడంతో ఈ మూడు విధానాల అమలు ఎంత సులువయిందో పణిక్కర్ చర్చించారు. "అందుకే ఎట్టి పరిస్థితులలోను అధికారాన్ని వీడకూడదని నిశ్చయించుకుని, అధికారం చేజిక్కించుకోడానికి ఎటువంటి అడ్డదారులైనా తొక్కేందుకు బిజెపి సిద్ధంపడింది. అందుకోసం రాజ్యంలోని వివిధ వ్యవస్థలలోకి జొరబడింది. అవసరమైన, అనుకూల సైద్ధాంతిక వాతావరణాన్ని తయారు చేసుకుంది. ఇది హిందుత్వ వైపుకు మరింత మందిని ఆకర్షించే వీలు కల్పించింది" అని ఆయన వివరించారు.

**“ బ్రిటిష్ వారి పాలనలో సామాజిక కట్టుబాట్లు కొంతమేరకయినా తగ్గడం, సమాజంలో వివక్షతలకు వ్యతిరేకంగా సాగిన బ్రహ్మాండమైన సంస్కరణ ఉద్యమాల ప్రభావం, సూద్ర, అతి సూద్ర కులాలకు వ్యతిరేకంగా బ్రాహ్మణులు భారతదేశ సమాజంలో తమ అధికారాన్ని, ఆధిపత్యాన్ని నిలుపుకునేందుకు చేసిన ప్రతిఘాతక విప్లవంగా హిందుత్వ ఎదుగుదలను చూడవచ్చు. ”**

మత చిత్రణలకి అతీతంగా

ఈ రోజు పరిస్థితులను చూసిన ఎవరికైనా మనం ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఇవి సూచనలని సులువుగా అర్థం అవుతుంది. ఇవి, ఇందిరా గాంధీ పాలనలో విధించబడిన అత్యవసర పరిస్థితి కంటే కూడా దారుణమైనవి. 2019 ఎన్నికలలో నరేంద్రమోడీ గెలిస్తే ఏమవుతుందని కొంతమంది ఆలోచనాపరులు ఆందోళన చెందారు. వారు మోడీ పాలనలోని బలాలు బలహీనతలు అంచనా వేశారు. నిజానికి ఈ 'కొత్త గుర్తులతో' 'కొత్త భారతదేశం', ఏర్పడడానికి లోతైన కారణాలు ఉన్నాయి. సూక్ష్మంగా పరిశీలించిన వారికి భారతదేశ పరిస్థితులలో ఒక ఆధిపత్య పాలన, వెలివేత ధోరణులు, మన సంస్కృతిలో, సమాజంలో తమస్వార్థం కోసం ప్రజలను రెచ్చగొట్టే నాయకులు వచ్చే అవకాశాల మూలాలు పుష్కలంగా ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తుంది. బహుశా హిందుత్వను ఇప్పుడు ఎలా అర్థం చేసుకుంటున్నామో అన్న విషయం పునఃపరిశీలించాల్సిన సమయం వచ్చింది.

సాధారణంగా హిందుత్వ ఆలోచనలు, రాజకీయాలు మతపరమైన చిత్రణలుగా అర్థం చేసుకుంటుంటాం. హిందుత్వాన్ని సమర్ధించే వారు, 'దాడులు చేసిన రకరకాల జాతుల వారి 'చారిత్రిక తప్పిదాలను' సవరించడం' అని అంటారు. అనాదిగా హిందూ జాతి మనుగడ లో ఉందని అంటారు. పురాణాలను చరిత్రతో కలిపి తమ అనుయాయులకు బోధించడం వలన, అవి భయంకరమైన పరిణామాలకు దారితీస్తున్న వైనం మనముందుంది. కానీ, వెలివేత ఆలోచనలకు దారితీసే 'మనం', 'ఇతరులు' అనే భావన నిరంతరంగా ఘర్షణలకు పాల్పడే వారి చర్యలను సమర్ధించలేదు. కొంతమంది 'చెడ్డవారి' చేష్టల వలనే మత ఘర్షణలు చెలరేగుతున్నాయని భావించడం జరుగుతున్నది. అలా భావించడం వలన లౌకికతత్త్వం అంటే అన్ని మతాలను సమానంగా గౌరవించడం అని, అలా గౌరవించడం వలన ఘర్షణలు జరగవని అభిప్రాయపడే అవకాశం ఉంటుంది. అంతేకాని మతాన్ని రాజ్యం నుంచి, సమాజం నుంచి వేరుచేయాలని అనిపించదు.

అప్పుడప్పుడూ కొన్ని పరాజయాలు ఎదుర్కొన్నప్పటికీ, గత రెండున్నర దశాబ్దాలుగా హిందుత్వ పెరుగుతూనే ఉంది. హిందూ జాతీయవాదం ముస్లిం జాతీయవాదానికి ప్రతిస్పందనగా వచ్చిందని అంటుంటారు. కానీ వాస్తవంగా రెండూ స్వతంత్రంగా ఉద్భవించాయి. రెండు మతాలలోని ఉన్నత వర్గాలవారు, అణగారిన తమ గళం, తమ తమ జాతులలో వినిపించడానికి ఏర్పాటు చేసుకున్నారు.

బ్రిటిష్ వారి పాలనలో సామాజిక కట్టుబాట్లు కొంతమేరకయినా తగ్గడం, సమాజంలో వివక్షతలకు వ్యతిరేకంగా సాగిన బ్రహ్మాండమైన సంస్కరణ ఉద్యమాల ప్రభావం, సూద్ర, అతి సూద్ర కులాలకు వ్యతిరేకంగా బ్రాహ్మణులు భారతదేశ సమాజంలో తమ అధికారాన్ని, ఆధిపత్యాన్ని నిలుపుకునేందుకు చేసిన ప్రతిఘాతక విప్లవంగా హిందుత్వ ఎదుగుదలను చూడవచ్చు.

హిందూ ఐక్యతను సాధించడానికి ఏర్పడ్డ ఒకేఒక సంస్థ ఆర్ఎస్ఎస్ కాదన్నది వాస్తవం. స్వామి దయానంద సరస్వతి 19వ శతాబ్దపు చివరిలో ఆర్య సమాజం స్థాపించారు. ఆర్ఎస్ఎస్ స్థాపించడానికి ముందు సావర్కర్ కొంత ప్రయత్నం చేశారు. అయితే, అదంత ముందుకు సాగలేదు. సావర్కర్ కృషి గాలిలో కలిసిపోయింది. ఆర్య సమాజం పంజాబ్ హర్యానా ప్రాంతాలకు పరిమితమయింది. హిందుత్వ సంస్థలన్నిటిలో ఆర్ఎస్ఎస్ మాత్రమే నిలిచింది.

అయితే, ఒక ప్రశ్నకి మాత్రం ఎప్పుడూ సమాధానం దొరకడం లేదు. పూలే, అంబేద్కర్, సాహు మహారాజ్ వంటి ఉద్దండ సామాజిక కార్యకర్తలు నిర్విరామంగా పనిచేసిన మహారాష్ట్రలో, మైనారిటీలు ఏనాడూ పది శాతానికి మించి నివసించని ప్రాంతంలో, వారేనాడు రాజకీయంగా ప్రాధాన్యత గలిగిన వారు కాని చోట, హిందూ సిద్ధాంతకర్తలు ఇంతమంది - సావర్కర్, హెగ్డేవార్, గోల్వాల్కర్, వారి సంస్థలు, ఎలా పెరిగాయి? వారికి బలమైన పునాదులు ఎలా ఏర్పడ్డాయి?

ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థ, లేదా మొత్తం హిందుత్వ ఆలోచన ఎలా చట్టబద్ధత సంతరించుకుంది? ఇటువంటి పరిస్థితి భారతదేశంలోని ఇతర ప్రాంతాలలో లేదు. మనం హిందుత్వను చూస్తున్న తీరుకు ఇది పూర్తి విరుద్ధంగా ఉంది.

జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలె వంటి వారు బ్రహ్మణ్యానికి వ్యతిరేకంగా పోరాడిన నేలలో హిందుత్వ ఎలా వేళ్లూనుకుంది? జ్యోతిబాపూలేతో పాటు ఆ ఉద్యమాలలో సత్యశోధక్ సమాజ్, బహిష్కృతిక్ హితకారిణి సభ, ఇండిపెండెంట్ లేబర్ పార్టీ, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు, అణగారిన తరగతులకు దారిచూపిన అంబేద్కర్ లాంటి గొప్ప గొప్ప నాయకులు పాల్గొన్నారు.

ఈ ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే మనం హిందుత్వ ఎందుకు ప్రాచుర్యం పొందిందో తెలుసుకోడానికి ఇదివరకు అనుకుంటున్న సమాధానాలు పక్కనపెట్టి, సంతృప్తికరమైన సమాధానాలు అన్వేషించాలి. దిలీప్ మీనన్ మాటల్లో చెప్పాలంటే, “హిందూమతంలో అంతర్గతంగా ఇమిడి ఉన్న హింస కొంతవరకు ముస్లింలపై జరుగుతున్న హింసను అర్థం చేసుకోడానికి సహాయపడుతుంది. అయితే ముందుగా హిందూమతంలో అంతర్గతంగా హింస ఉండేదని మనం అంగీకరించగలగాలి. హిందూ మతంలో అంతర్గతంగా దళితులపై జరుగుతున్న హింస (హిందు మతంలోనే ప్రాథమికంగా అసమానతలు ఉన్నాయని నిర్ధారించబడింది) హిందూమతానికి బయటనున్న ముస్లింలవైపుకు ఏ పరిస్థితులలో మళ్లిందో తెలుసుకోవలసిన అవసరం ఉంది. భారతీయ సమాజంలో కేంద్రంగా ఉన్న హింస, అసమానతలు మతతత్వం వైపుకు మళ్లాయా?

## 5

**ఈనాటి అభ్యుదయ, ఉదారవాదుల పూర్వీకులు దేశభక్తి అంటే ఏమిటో నిజంగా అర్థం చేసుకుని ఉంటే, వారు తమ దేశంలో సూద్రులను పశువులకన్నా హీనంగా చూపుతున్న పుస్తకాలలో వ్యాసాలు రాసేవారు కాదు...–**
జ్యోతిబా పూలే

భారతదేశ చరిత్రలో అత్యధిక భాగం అసలు చరిత్ర కానేకాదు. దానర్థం భారతదేశానికి చరిత్ర లేదని కాదు. ఎంతో

ఉంది. కానీ అది తన స్వభావాన్ని కోల్పోయింది. అది మహిళలకి, పిల్లలకి వినోదాన్ని అందించే పురాణం అయిపోయింది. బ్రాహ్మణ రచయితలు సంకల్పితంగానే అలా చేసినట్టున్నారు. ఉదాహరణకు 'దేవా' అనే పదాన్నే తీసుకోండి. దానర్థం ఏమిటి? జన విశేష్ అనే పదం మానవ కుటుంబానికి ప్రాతినిధ్యం వహిస్తుందా. కానీ దానిని మనవాతీత వ్యవస్థ అనిపించేటట్టు చేశారు. అక్కడితో అందులోని చారిత్రిక అంశం పూర్తిగా తొలగించబడింది.

– అంబెద్కర్ వలస రాజకీయం ఇక్కడి సామాజిక సూత్రాలతో ఎలా కలిసిపోయింది?

చరిత్రను తరచి చూస్తే, బ్రిటిష్ వారు వచ్చినప్పుడు, తమ పాలనను బలపరుచుకుని, చట్టబద్ధత కల్పించుకునే సందర్భంలో ఆనాడున్న బ్రాహ్మణవాదం– సామాజిక వ్యవస్థ, నీతి సూత్రాల – నుండి అనేక సవాళ్లు ఎదుర్కొంది. మతం ప్రాతిపదికన జ్ఞానానికి దూరంగా ఉంచబడిన వారికి జ్ఞానాన్ని పొందడానికి అవకాశం కలిగించడం వలన బ్రాహ్మణులు చరిత్రలో మొదటి సారిగా బెదిరిపోయి ఉంటారు. పైగా మనువాదులకు మరో ప్రతికూలాంశం ఏమిటంటే, ఆధునిక విద్యా విధానంలో తాము విద్య నిరాకరించిన తరగతుల నుండే, అంటే వెనుకబడిన తరగతులను మరింత శక్తివంతులను చేసే నాయకులు వచ్చారు.

**" చరిత్రను తరచి చూస్తే, బ్రిటిష్ వారు వచ్చినప్పుడు, తమ పాలనను బలపరుచుకుని, చట్టబద్ధత కల్పించుకునే సందర్భంలో ఆనాడున్న బ్రాహ్మణవాదం- సామాజిక వ్యవస్థ, నీతి సూత్రాల - నుండి అనేక సవాళ్లు ఎదుర్కొంది. మతం ప్రాతిపదికన జ్ఞానానికి దూరంగా ఉంచబడిన వారికి జ్ఞానాన్ని పొందడానికి అవకాశం కలిగించడం వలన బ్రాహ్మణులు చరిత్రలో మొదటి సారిగా బెదిరిపోయి ఉంటారు. "**

మహాత్మా పూలే, సావిత్రిబాయి పూలే నుండి ఫాతిమా షేక్, ఆమె సోదరుడు ఉస్మాన్ షేక్, తారభాయ్ షిండే, జ్యోతి దాస్, అయ్యంకాళి, అచ్యుతానంద్, పెరియార్,వంటి వారెందరో సామాజిక ఉద్యమాలు మొదలు పెట్టి,వాటికి నాయకత్వం వహించారు. వారు బ్రాహ్మణ వ్యవస్థకి వ్యతిరేకంగా విప్లవాత్మకంగా రాజీలేని సామాజిక పోరాటాలు చేశారు. జ్యోతి దాస్ విషయమే తీసుకోండి. (1845–1914). ఆయన మనుధర్మాన్ని సమూలంగా వ్యతిరేకించినవారు. చార్వాక, బుద్ధుడు అనుసరించిన తాత్విక చింతన కలిగినవాడు. వర్ణ వ్యవస్థను సమూలంగా నిరాకరించినవాడు. దళితుల సంపూర్ణ విముక్తికి ప్రచారం చేసినవాడు. అలాగే అయ్యంకాళి కేరళలో తిరుగుబాటు బావుటా ఎగరేసినవాడు. అక్కడి వ్యవసాయ కూలీలను సంఘటితం చేశాడు. 1904లో విద్య హక్కు కోసం వారి చేత సమ్మె చేయించాడు. పూలే, హిందూ సంస్కృతి పై రెండు విషయాల ఆధారంగా తీర్పు చెప్పారు. ఒకటి హేతువాదం, రెండోది సమానత్వం. కుల వ్యవస్థలో, మహిళల విషయంలో ఉన్న అసమానతలను ఎండగట్టారు.

జ్యోతి రావ్ పూలె గురించి జిపి దేశ్ పాండే రాస్తూ, 'పూలె దృక్పథం విశాలమైనది. అతని చూపు గంభీరమైనది. అతను తన కాలంలోని ఏంతో ప్రధానమైన సమస్యను గుర్తించారు. సిద్ధాంతీకరించారు. వర్ణాశ్రమ ధర్మం, ఆచారాలు, భాష, సాహిత్యం, బ్రిటిష్ వారి పాలన, పురాణాలు, లింగ సమస్య, వ్యవసాయ ఉత్పత్తి పరిస్థితులు, రైతుల సమస్యలు వగైరా. మరి పూలే సామాజిక సంఘ సంస్కర్త మాత్రమేనా? కాదు. ఒక సామాజిక సంఘ సంస్కర్త కేవలం మానవతావాది. పూలె విప్లవకారుడు. తనకంటూ ప్రత్యేకమైన ఆలోచనలు గలవాడు. భారతదేశ సమాజంలోని మొదటి తరం మేధావులలో ఒకరు. భారత సమాజంలోని ద్వివర్ణ విధానాన్ని విశ్లేషించినవాడు. సూద్రులను సామాజిక విప్లవానికి నాయకులుగా గుర్తించినవాడు.'

బ్రిటిష్ వారు నూతన విద్య విధానాన్ని ప్రవేశ పెట్టినప్పుడు, ఉన్నత వర్ణం వారు ఆ విద్యావిధానం అలవరచుకోడానికి కష్టపడితే, నిమ్న కులస్థులు సులువుగా అలవాటుపడ్డారు. అంతే కాదు. ఆ విధానంలో బాగా రాణించారు కూడా. మొంస్టువార్ట్ ఎల్ఫిన్ స్టోన్ అనే బ్రిటిష్ అధికారి, 19వ శతాబ్దం మధ్య భాగానికి వచ్చేసరికి 'మిషనరీలు కింది తరగతుల విద్యార్థులు బాగా చదువుకుంటున్నట్టు' గ్రహించారు. 'బోర్డు అఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తన 1850–51 నివేదికలో విద్యను అభ్యసించ డానికి నిమ్న జాతులవారికి అవకాశం ఉంటే, ఉన్నత కులాలవారి కంటే ఎంతో తెలివైన వారుగా మారతారని' అన్నారు. భారతదేశానికి సంబంధించిన విద్యా రికార్డులలో, "భారత దేశస్థులు, శాస్త్రీయ విజ్ఞానంలో, విద్యలలో ఆసక్తి కనబరిచేవారు కాదు. నిజానికి శాస్త్రీయ విజ్ఞానంలో వెనకబడి ఉండేవారు, అపజయాలే అధికంగా ఉండేవి.' అని ఉంది.

విద్యావిధాన ప్రభావం సూద్రులపైనా, అతి సూద్రులపైనా ఎలాఉండేదో 'మంగుల మహాజర్ల దుఃఖ గాథ '(జ్యోతిబా పూలె శిష్యురాలు) –1855 లో ధ్యాన్నోదయ పత్రికకు రాసిన ఉత్తరంలో కనిపిస్తుంది. "మహార్లు, మంగులారా, మీరు పేదలు, రోగులు. కేవలం వైద్య విద్యే మీ రోగాన్ని నయంచేస్తుంది. మిమ్మల్ని భయంకరమైన మూఢనమ్మకాల నుండి దూరం చేస్తుంది. మీరు నీతిమంతులు, సత్ప్రవర్తన గలవారు అవుతారు. అదే మిమ్మల్ని దోపిడీకి గురికాకుండా కాపాడుతుంది. మిమ్మల్ని పశువులుగా పరిగణిస్తున్నవారు ఇంకెంత మాత్రం అలాపరిగణించకుండా నిలువరిస్తుంది. అందువలన మీరు కష్టపడి పనిచేయండి. చదువుకోండి. మంచి మనుషులుగా బతకండి. '19వ శతాబ్దం చివరి రోజుల్లో 20 శతాబ్దపు తోలి రోజుల్లో ఆనాటి అణగారిన తరగతుల ఆందోళనలను ఇది ప్రతిబింబిస్తుంది.

లోకమాన్య తిలక్ని, స్వాతంత్రోద్యమంలో భారతదేశ అశాంతికి తండ్రిగా, కాంగ్రెస్ తీవ్రవాదిగా చెప్పుకుంటుంటారు. ఆధిపత్య కులాల వారి తీవ్రమైన ఆందోళనలు – రాజకీయంగా స్వాతంత్ర్యాన్ని కోరుతూ, సామాజికంగా సంస్కరణల పట్ల – ఎలావుండేవో అతని ఆలోచనలలో తెలుసు కోవచ్చు. "తిలక్ ఏజ్ అఫ్ కన్సెన్ట్" (వివాహ వయసును పెంచుతూ చేసే చట్టం) ని ఎంతగా వ్యతిరేకించారంటే, జస్టిస్ ఎం.జి.రానడే 1895లో కాంగ్రెస్ పెవిలియన్లో జాతీయ సామాజిక సదస్సును నిర్వహించుకోనివ్వలేదు. అప్పటి వరకు అలా సామాజిక సదస్సు నిర్వహించుకోవడం ఆనవాయితీగా ఉండేది. 1887లో రానడే సామాజిక సదస్సును, తన ఆలోచనలకు తోడయిన వారితో నిర్వహించుకున్నారు. 'మహిళలను విద్యావంతులను చేయండి, జాతీయతను కోల్పోండి' అనే వ్యాసంలో

“ తల్లిదండ్రులే పిల్లలకు వారి వృత్తులలో నైపుణ్యాలను నేర్పించాలన్నది వారి ఉద్దేశం. అంటే పిల్లలందరికీ ఒకే విద్యా విధానం ఉండడం నప్పదని అనుకునే వారు. “విద్యను నేర్పే పేరు మీద ఒక రైతు కొడుకుని నాగలి నుండి వేరుచేస్తే, ఒక కమ్మరి తన కొడుకుని ఇనుమును తీర్చిదిద్దడం నుండి వేరుచేస్తే. ఒక చర్మకారుని బాలుడిని చర్మం నుండి దూరం చేస్తే ఆ పిల్లలు తమ తండ్రుల వృత్తులను అసహ్యించుకుంటారు. పైగా తండ్రులు కూడా కొడుకు సహాయాన్ని కోల్పోతారు” అన్నారు తిలక్. ”

పరిమళ. వి.రావు మహా రాష్ట్రలో జాతీయత గురించి నలభై ఏళ్లుగా జరిగిన చర్చలను గురించి చెప్పాడు. “బ్రాహ్మణేతరులు, తమ ఇంటి ఆడపిల్లలకు చదువు చెప్పిస్తే జాతీయతను కోల్పోవలసి వస్తుంది. 1881–1920 మధ్య తిలక్ వంటి జాతీయవాదులు బ్రాహ్మణేతర ఆడపిల్లలను బడికి పంపడాన్ని, నిర్బంధ విద్యను తీవ్రంగా వ్యతిరేకించారు. ...చదువంటే వారి ఉద్దేశం ధర్మశాస్త్రాలు అధ్యయనం చేయడం, కొన్ని నైపుణ్యాలను తెలుసుకోవడం” అని రాశారు.

తల్లిదండ్రులే పిల్లలకు వారి వృత్తులలో నైపుణ్యాలను నేర్పించాలన్నది వారి ఉద్దేశం. అంటే పిల్లలందరికీ ఒకే విద్యావిధానం ఉండడం నప్పదని అనుకునే వారు. “విద్యను నేర్పే పేరు మీద ఒక రైతు కొడుకుని నాగలి నుండి వేరుచేస్తే, ఒక కమ్మరి తన కొడుకుని ఇనుమును తీర్చిదిద్దడం నుండి వేరుచేస్తే. ఒక చర్మకారుని బాలుడిని చర్మం నుండి దూరం చేస్తే ఆ పిల్లలు తమ తండ్రుల వృత్తులను అసహ్యించుకుంటారు. పైగా తండ్రులు కూడా కొడుకు సహాయాన్ని కోల్పోతారు. తమ సాంప్రదాయ వృత్తులకి ఆటంకాలు ఏర్పడతాయి” అన్నారు తిలక్.

మితవాదుల ఆందోళనలు విద్య విధానానికి మాత్రమే పరిమితమవలేదు. దళితులూ, బహుజన సమాజంవారు, క్రమంగా ముస్లింల మిశ్రమ సంస్కృతికి, ముఖ్యంగా మొహర్రం ప్రదర్శనలలో భాగస్వాములు కావడం మొదలుపెట్టారు. ఇది హిందువులకి కంటగింపుగా ఉండేది. పవిత్రత, అపవిత్రతలకు విలువనిచ్చే హిందుత్వ వాదులకు ఇది మింగుడు పడలేదు. వారు బహిరంగంగా ఇటువంటి ఉత్సవాలను ఎన్నడూ ప్రోత్సహించలేదు.

వార్కరీస్ సందర్భంగా పాడుకొనే భక్తి గీతం చూడండి: ఓరి! ఈ రోజు హిందూ మతాన్ని ఎందుకు పరిత్యజించావు? నువ్వు గణపతిని, శివుడిని, మారుతిని ఎలా మరిచి పోయావు? తురకలను కొలిచి ఏమి సాధించావు? ముసల్మానుగా మారడమేనా? నీకు సంబంధం లేని మతాలతో కలవకు. నీ బంధాలను తెంచుకుని పతనం కాకు. తురకలను ఎంతమాత్రం గౌరవించకు. ఆవు నీ తల్లి, ఆమెను మరువకు.

ఇటువంటి బోధనలతో మిశ్రమ సంస్కృతికి అడ్డుకట్ట వేయడంతో, 1894లో ఉత్సవాలు జరుగుతుండగా పూనాలో, 1895లో ధూలియాలో మతఘర్షణలు మొదలయ్యాయి.

## 6

వలసవాద వ్యతిరేక పోరాటంలో ఇటువంటి చిన్న చిన్న మతతత్వ పోకడలు అక్కడక్కడా కనిపిస్తూ ఉండేవి. అణగారిన తరగతులను మతతత్వం వైపుకు నడిపించడం దేశవ్యాప్తంగా జరగడం ఆసక్తికరమైన అంశం. తిలక్ తదితరులు గణేష్ పూజల ద్వారా ప్రజలను ఆకర్షించాలనుకుంటే, ఆర్యసమాజ్ అనుయాయులు దళితులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేశారు. అయితే అంతగా విజయం సాధించలేదు. పంజాబ్‌లో పారిశుధ్య కార్మికులను ‘వాల్మీకి’ కులస్థుల దేవుడు హిందువని ప్రచారం చేయడం ద్వారా వారిని హిందూమతంలో నుండి బయటికిపోకుండా ఉంచే ప్రయత్నాలు చేశారు.

బ్రాహ్మణ సంస్కృతిలో ‘ఆర్య’ జాతి పుట్టుకని మాక్స్ ముల్లర్ లాంటి పశ్చిమదేశాల పండితులు ప్రచారంలోకి తేవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. వివేకానంద, తిలక్, రానడే, దయానంద్ సరస్వతి, ఆరోబిందో ఘోష్, బి.సి.పాల్, బంకించంద్ర ఛటర్జీ, వంటి ఎంతోమంది మేధావులు మాక్స్ ముల్లర్‌తో ఏకీభవించారు. ఈ మంత్రం భారతదేశ ఉన్నత వర్గాలలో తాము బ్రిటిష్ వారికి సరిసమానమన్న భావనను కలిగించింది. సామాజికంగా సూద్రులకన్నా ఉన్నతులమనే భావనకు మద్దతునిచ్చింది.

ఆర్‌ఎస్‌ఎస్ పుట్టుకని ఈ నేపథ్యంలో చూడాలి. సి.పి. భిషికార్ రాసిన హెగ్డేవార్ జీవిత కథ, మనకు కొన్ని విషయాలను స్పష్టం చేస్తుంది. బ్రాహ్మణ్యాన్ని పునరుత్తేజం చేయాలని సంకల్పించిన వారిలో హెగ్డేవార్, మూంజ, ఎల్.వి.పరాంజపి, బి.బి.తల్కర్, బాబురావు సావర్కర్లు ప్రధానంగా ఉన్నట్టు మనకు తెలుసు. వీరందరూ కలిసి 1925లో ఆర్‌ఎస్‌ఎస్‌ని స్థాపించారు. అందుకు హెగ్డేవార్ రెండు కారణాలను చెప్పారు: ఒకటి, ముస్లిమ్‌ల నుండి ఆపద. రెండోది, నిమ్న కులస్థులు తమ హక్కులను కోరడం. “వివిధ జాతుల మధ్య వైరాలు మొదలయ్యాయి. బ్రాహ్మణులకు బ్రాహ్మణేతరులకు మధ్యఘర్షణలు స్పష్టంగా కనిపిస్తున్నాయి”. అంటే బ్రాహ్మణేతరుల నుండి వచ్చే ఆపదను, ముస్లింల నుండి వచ్చే ఆపదలతో సరి సమానంగా చూడడం మనకు కనిపిస్తుంది.

అంటే హిందూ రాష్ట్రాన్ని కోరే ఆర్‌ఎస్‌ఎస్ మూలాలు, సూద్రులు, అతి సూద్రులు, మహిళలు తమ హక్కులను కోరడం వలన వచ్చిన వ్యతిరేకతపై ఆధారపడిందని అర్థం అవుతుంది. మహారాష్ట్రలో ముస్లింల ఆధిపత్యం ఎన్నడూ లేదు. కానీ అక్కడ బ్రాహ్మణుల ఆధిపత్యం, బ్రాహ్మణ్యానికి పునాదిగా నిలిచిన పితృస్వామ్య వ్యవస్థని సవాలు చేసిన, జ్యోతిబా పూలె వంటి వారి నాయకత్వంలో జరిగిన ఉద్యమాలు ఎన్నో ఉన్నాయి. పూలే శేట్ జీ, భట్ జీ కి వ్యతిరేకంగా చేసిన పోరాటం కొత్త ఊపునిచ్చి డాక్టర్ అంబెద్కర్ వంటి నాయకుల అవిర్భావానికి దారితీసింది. అంబెద్కర్ 1927లో దళితుల ఆత్మ గౌరవం కోసం ప్రదర్శన చేయడం, చివరిగా మనుస్మృతి దహనం చేయడం మనకు తెలుసు. కాలక్రమంలో హిందుత్వవాదులు తమ దళిత వ్యతిరేక, సూద్ర వ్యతిరేక, మహిళావ్యతిరేక భావాలను స్పహతోనో పరాకుగానో వదిలి పెట్టి కేవలం ముస్లిం వ్యతిరేకతతో కొనసాగారు. అదే నేటి పరిస్థితికి కారణం. అందువలన మతతత్వ వ్యతిరేక పోరాటంలో కుల వ్యతిరేక పోరాటాన్ని కూడా భాగం చేయాలని గమనించడం ముఖ్యం.

బ్రజరంజన్ మణి ఈ విషయాన్ని గురించి తన ‘డి బ్రాహ్మినైజేషన్ ఆఫ్ హిస్టరీ’ పుస్తకంలో, “హిందువు అంటే హిందుత్వ వాదులు చెప్పే పుణ్యభూమి, పితృభూమి ఒకటిగా ఉండాలనే భావనని పూలే, అంబేద్కర్లు తిరస్కరించారు. అందువలన పూలె అంబేద్కర్లను ఆర్‌ఎస్‌ఎస్ తన లక్ష్యంగా చేసుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించదు. పైగా ఆర్‌ఎస్‌ఎస్ వారిని కులతత్త్వం ఉన్నవారికే

ఇటువంటి ఆలోచనలు వస్తాయని ఎద్దేవా చేసింది” అని రాశారు.

ముందే చెప్పుకున్నట్టు, ఆర్ఎస్ఎస్ సాంస్కృతిక జాతీయవాదం, వర్ణాశ్రమ ధర్మాన్ని గౌరవిస్తుంది. కానీ వ్యతిరేకిస్తున్నట్టు నటిస్తుంది. ఆర్ఎస్ఎస్ హిందువుల ఐక్యత అంటే, ముస్లింలకు వ్యతిరేకంగా కూడగట్టడమే. అంబేద్కర్ అన్నట్టు, ఒక కులానికి వేరొక కులంతో సంబంధం కేవలం హిందూ ముస్లింల అల్లర్లలోనే బయట పడుతుంది. ఆర్ఎస్ఎస్ కుల వ్యతిరేకత, రెండు రకాలుగా ఉపయోగ పడుతుంది. కింది తరగతులను బ్రాహ్మణుల గొడుగు కిందికి చేర్చడానికి అదే సమయంలో ముస్లింలకు వ్యతిరేకంగా పోరాడడానికి.

అంతర్ మత సంబంధాలను అధ్యయనం చేసిన యోగిందర్ సికంద్, హిందుత్వ నాయకులతో తన సంభాషణలను పంచుకున్నారు. “ఉన్నత స్థానంలో ఉన్న ఆ హిందుత్వ నాయకులు, ప్రాచీన హిందూ రాష్ట్రం సాధించడమే తమ కల అని వాదించినట్టు నమోదు చేయబడింది. ... నిరంకుశమైన మనుస్మృతిలో చెప్పబడినట్టు కింది కులాలవారు, పై కులాలలో మహిళలు అమానుషంగా అణచివేతకు గురవుతూ పాలించబడాలని వారు కోరుకున్నారు.”

ఇక్కడ దిలీప్ మీనన్‌ని మరోసారి గుర్తుచేసుకుందాము: “1850 – 1947 మధ్యకాలంలో మతతత్వ ఘర్షణలు జరిగిన వెంటనే దళితులలో ఇతర అణగారిన తరగతులలో ప్రజాసమీకరణలు పెరిగాయి. గ్రామాలలో అణచివేత వ్యవస్థలను ఎదిరిస్తూనే ఉన్నారు. దళితులు తిరగబడడం పెరగడంతో హిందుత్వవాదులు ఐక్యత పేరుతో వారి గుర్తులను తమతో విలీనం చేసుకున్నారు. .. మండల్ (రిజర్వేటివ్ వ్యతిరేక అల్లర్లు), 1990లలో మసీదు (ముస్లిం వ్యతిరేక ఉద్యమం) ఈ చారిత్రిక పరిణామాల కొనసాగింపే.”

## 7

గ్రాంసీ, అన్నట్టు 'ప్రజల స్పృహ'ని పరమాణువులతో సహా మార్చడం –హిందుత్వ విజయానికి కారణమా?

ఆర్ఎస్ఎస్, లౌకికవాదులు, భిన్న దృక్పథాల నుండి పరిస్థితులను చూసిన తీరును కె.ఎం.పణిక్కర్ ఎలా సమీక్షించారో తెలుసుకుందాం. “సామాజిక సాంస్కృతిక రంగాలన్నిటిలో, మతతత్వం తనకంటూ కొంత స్థానాన్ని కల్పించుకోగలిగింది. .. వారు ఆచరణలో సమాంతర వ్యవస్థను నడుపుతున్నారు. వేలాది ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు, విద్యాభారతితో పాటుగా గిరిజన ప్రాంతాలలో లక్షలాది ఏకలవ్య విద్యాలయాలు తెరవబడ్డాయి.

> “ మతతత్వ సంస్థలు కొత్త కొత్త పద్ధతులలో సృజనాత్మకంగా, సాంస్కృతిక స్పృహను మతతత్వం వైపుకు మళ్లించగలుగుతున్నాయి. సంస్కృతిలో అన్నీ ఇమిడి ఉన్నాయని నిర్వచించిన మతతత్వ శక్తులు ప్రజల దైనందిక జీవితాలన్నిటిలో జోక్యం చేసుకునేందుకు అనువైన విధానాలు రూపొందించుకున్నాయి. మతపరంగా తయారు చేయడం, దోచుకోవడమే వారి విధానం. ”

మతతత్వ సంస్థలు కొత్త కొత్త పద్ధతులలో సృజనాత్మకంగా, సాంస్కృతిక స్పృహను మతతత్వం వైపుకు మళ్లించగలుగు తున్నాయి. సంస్కృతిలో అన్నీ ఇమిడి ఉన్నాయని నిర్వచించిన మతతత్వ శక్తులు ప్రజల దైనందిక జీవితాలన్ని టిలో జోక్యం చేసుకునేందుకు అనువైన విధానాలు రూపొందించుకున్నాయి. మతపరం గా తయారు చేయడం, దోచుకోవడమే వారి విధానం.

లౌకిక, సాంస్కృతిక సంస్థలు వీటిని వ్యతిరేకించడంలో తీవ్రంగా విఫలమయ్యాయి. కారణం మతతత్వవాదుల పని, లౌకికశక్తుల సాంస్కృతిక రంగం పని మౌలికంగా పూర్తి భిన్నంగా ఉండడం. ప్రధానమైన తేడా సాంస్కృతిక జోక్యం, సంస్కృతిలో జోక్యం. లౌకికవాదులు సాంస్కృతిక జోక్యం చేసుకోవాలంటే, మతతత్వవాదులు సంస్కృతిలో జోక్యం చేసుకోవాలంటారు. లౌకికవాదులు సాధారణంగా సంస్కృతి మార్పుకు సాధనంగా ఉండాలనుకుంటే మతత్వవాదులు సంస్కృతిని మార్పుకి గురిచేయాలని అనుకుంటారు. అవగాహనలో ఉన్న ఈ లోపం వల్ల మతతత్వవాదులను ఎదిరించడంలో లౌకికవాదులు స్థిరమైన ఆలోచనలతో, అసమర్థవంతంగా ఉంటారు.

అందువలన, లౌకిక సాంస్కృతిక జోక్యం విషయంలో లౌకికవాదుల స్వభావంలో మార్పురావాలి. అప్పుడు మాత్రమే మతతత్వవాదులు జడలు విప్పి విజృంభించడానికి తీసుకుంటున్న చర్యలను, అనాగరిక కార్యక్రమాలను, కట్టడి చేయగలం, వెనక్కు తిప్పికొట్టగలం.

జటిలమైన సమస్యకు ఈ పరిష్కార మార్గం సంతృప్తికరంగా ఉందో లేదో గాని హిందుత్వ పుట్టుకను ఇది ఒక కొత్త కోణం నుంచి చూపించింది. అయినా, దీనిని పూర్తిగా కాదని తోసేయలేం.

అభివృద్ధి కాముక తరగతులలో ఇప్పటికి ఎడతెరిపి లేకుండా సాగుతున్న చర్చలు, రోజువారీ పనులకు విఘాతం కలిగించడమే కాక, అమానుష విధానాలకు వ్యతిరేకంగా తీసుకోవలసిన విధానపరమైన నిర్ణయాల అమలుకు అనుసరించవలసిన వ్యూహాత్మక దృక్పథాన్ని కూడా ప్రభావితం చేస్తున్నది. దేశకాల పరిస్థితులకు అనుగుణంగా హిందుత్వశక్తులు తమ వ్యూహాలలో నైపుణ్యంగా మార్పులు చేర్పులు చేసుకుంటూ పోతూ, ఇదివరకు చేరని, వెలివేతలకు గురి చేసిన మారుమూల ప్రాంతాలు కూడా విస్తరిస్తుండగా, లౌకికవాదులు అచంచలంగా నిలిచిపోయారు. హిందుత్వ మితవాదులలో వచ్చిన మార్పులను కూడా అవగాహన చేసుకోలేక పోతున్నారు.

నాజీలను మహోన్నతులుగా చిత్రించి, దేశంలో ఒక భాగాన్ని 'ఇతరులుగా' చూపే ప్రయత్నం చేసిన ఆర్ఎస్ఎస్ రెండో అధినేత, గోల్వాల్కర్‌ని ఇప్పుడు 'గుర్తు' చేసుకోవడం సముచితమే. అతనిని 'తమ సిద్ధాంతకర్తగా' చెప్పుకుంటున్నారు. భారతదేశ హిందుత్వ అధినాయకుడిగా చూపుకుంటున్నారు. కానీ భారతదేశంలో ఆర్ఎస్ఎస్ పెరగడానికి సంస్థాగతంగా కృషి చేసిన బాలా సాహెబ్ దెవొరస్ – మూడో అధినాయకుడు – గురించి చర్చ జరగడం లేదు. హిందూ ఐక్యత నుండి ఎవరిని వెలివేయాలో గోల్వాల్కర్ సూచిస్తే, దేవొరస్ కొత్త ప్రాంతాలకు, కొత్త తరగతులలోకి ఎలా విస్తరించాలో సూచించారు. సమాజంలో వెలివేతకు గురైన తరగతులను చేరుకునేటట్టు చేశారు. ఈ అంశానికి ప్రాధాన్యతను ఇస్తే, మన లౌకికవాదులు ఎక్కడ నిలిచిపోయారో అర్థం చేసుకోవడం సులువవుతుంది.

స్వతంత్రం వచ్చిన తరువాత చరిత్రను గోల్వాల్కర్ ప్రభావితం చేసినంతగా మరెవరు ప్రభావితం చేయలేదు. అతని గురించి మనకు తెలిసినది చాల తక్కువ. అతని 'దృక్పథం' 'కొత్త భారతదేశం' ఏర్పడడంతో ప్రధాన పాత్ర

**"గోల్వాల్కర్ హిందూ దేశం రూపొందడానికి ప్రధానమైన అడ్డంకులుగా మూడింటిని గుర్తించారు - ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులు. ఇవన్నీ విదేశాలలో పుట్టినవే. ఇక చివరి వారు దైవ భక్తి లేనివారు అని గోల్వాల్కర్ అభిప్రాయం. గోల్వాల్కర్ ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులను మాతృభూమిలో మంచిని స్థాపించడానికి సంహరించవలసిన రాక్షసులతో పోల్చారు. ఆర్ఎస్ఎస్ మాత్రమే హిందువుల జాతిని, నాగరికతను సరికొత్తగా మలిచే సాధనం అన్నారు."**

పోషించిందన్నది వాస్తవం. రామచంద్ర గుహ తన పుస్తకం 'ది మేకర్స్ ఆఫ్ ఇండియా'లో, గోల్వాల్కర్ కన్నా ముందున్న నాయకులు, వి.డి.సావర్కర్, మదన్ మోహన్ మాలవ్య వంటి వారు గొప్ప పండితులు అయి ఉండవచ్చుగాక. ... కానీ వారి ప్రభావం, పలుకుబడి చాల తక్కువ.

"గోల్వాల్కర్ తన 30 ఎళ్ల అధికార హోదాలో, ఆధునిక భారతదేశంలో సమాజాన్ని, రాజకీయాలను లోతుగా ప్రభావితం చేయగలిగారు. "గోల్వాల్కర్ హిందూ దేశం రూపొందడానికి ప్రధానమైన అడ్డంకులుగా మూడింటిని గుర్తించారు – ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులు. ఇవన్నీ విదేశాలలో పుట్టినవే. ఇక చివరి వారు దైవ భక్తి లేనివారు అని గోల్వాల్కర్ అభిప్రాయం. గోల్వాల్కర్ ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులను మాతృభూమిలో మంచిని స్థాపించడానికి సంహరించవలసిన రాక్షసులతో పోల్చారు. ఆర్ఎస్ఎస్ మాత్రమే హిందువుల జాతిని, నాగరికతను సరికొత్తగా మలిచే సాధనం" అన్నారు.

స్వతంత్రం వచ్చిన తరువాత భారత దేశంలో మారుమూల ఎక్కడో పడి ఉన్న హిందుత్వని, దాని సంస్థలను ఎలా నిలపగలిగారు, ఇంటా బయటా ఎలా వృద్ధి చేయగలిగారు అన్నది లోతుగా పరిశీలించవలసిన అంశం.

గోల్వాల్కర్ ప్రపంచ దృక్పథం గబ్బుకొడుతుందనేది వాస్తవం. అతని జీవిత ఆఖరి క్షణం వరకు మనుస్మృతికే మద్దతుగా నిలిచారు. అంబేద్కర్ నాయకత్వంలో రూపొందిన రాజ్యాంగాన్ని వ్యతిరేకించారు. సావర్కర్ లాగానే మనుస్మృతి మన రాజ్యాంగంగా ఉండాలని భావించారు. అందుకే భారతదేశంలో మహిళలకు సమాన హక్కులు కల్పించే హిందూ కోడ్ బిల్‌ను తిరస్కరించారు. నాజీ జర్మనీ యూదులను సంహరించి తమ జాతి పవిత్రతను కాపాడుకోడాన్ని సమర్థించారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తరువాత 'హిందూ సంస్థగా' దీనిని నిర్మించాలని బహిరంగంగా ప్రకటించారు. అమానుషమైన ప్రాపంచిక దృక్పధం ఉన్నప్పటికీ, గోల్వాల్కర్ హిందుత్వను పెంచే సంస్థను అభివృద్ధి చేయడంలో గట్టి పునాదులను వేశారు. ఈ రోజు అదే భారతదేశ రాజకీయాలలో ప్రధాన గళంగా ఉండి, పాలిస్తున్నది.

ఈ రోజు మెజారిటీ మతత్వవాద దుష్ప్రభావాలు అని మనం అంటున్నామంటే, దానికి కర్త, కర్మ, క్రియ గోల్వాల్కర్. హిందుత్వ ఆధిపత్య ఉద్యమానికి అతడు ఆద్యుడు కాదు. అందులో చాలామందే ఉన్నారు. కానీ అందరిలో నుండి గోల్వాల్కర్ పేరు, అతని ప్రభావం తీసేస్తే, మిగిలింది ప్రాంతీయంగా ఉండే హిందుత్వమే. కొన్ని ప్రాంతాలకు పరిమితమై ఉండేది. సావర్కర్ హిందుత్వ కోసమే పనిచేసినా ఆ సంస్థకి బలమైన రూపాన్ని ఇవ్వలేదు. హెగ్డేవార్, మంజి తదితరులు దాన్ని అఖిల భారత సంస్థగా మలచలేకపోయారు. ఆర్ఎస్ఎస్ ఒక అఖిల భారత సంస్థగా ఎదిగిందంటే అందుకు కారణం గోల్వాల్కర్. ఒక నిర్మాణదక్షుడిగా, సిద్ధాంతకర్తగా సంస్థను స్థిరపరిచారు. దానిని దేశమంతా విస్తరించగలిగేటట్టు రూపొందించారు.

ఈ రోజు లౌకికవాదులు నిలిచిన చోటే, స్వాతంత్ర్యానికి ముందు మితవాదులు నిలిచారు. ఈ రోజు లౌకికత అంటేనే ఒక దుష్ట పదం లాగా ఉంది. లౌకికవాదులు, రాజ్యంలోనూ, సమాజంలో కూడా చాల తక్కువ మంది ఉంటున్నారు. ఆ రోజుల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను, హిందుత్వవాదులను ఇలాగే చులకనగా చూసేవారు. ఆ రోజుల్లో పూనాలో విజయ్ టెండూల్కర్ రాసిన 'ఆశీ పాఖరే యతి' అనే ఒక నాటకం ఆడేవారు. అందులో ఆర్ఎస్ఎస్ స్వయం సేవకుడు వేదిక మీదకి రాగానే ప్రేక్షకులందరూ నవ్వులే నవ్వులు. ఆర్ఎస్ఎస్ ఒక బ్రాహ్మణుల సంఘమని పేరు తెచ్చుకుంది.

ఈ రోజు అదే మహారాష్ట్రలో గాంధీని హత్య చేసిన గాడ్సే మీద ఆడుతున్న 'మే నాథురాం గోల్స్ బొల్తో' నాటకం హౌస్ ఫుల్‌గా నడుస్తున్నది. ఇది ఊహించలేని విషయం. హిందుత్వ దీనిని ఎలా సాధించింది?

ఆర్ఎస్ఎస్ భారతదేశ స్వతంత్ర సంగ్రామంలో పాలు పంచుకోలేదన్నది నిజమే. పైగా మహాత్మా గాంధీని హత్య చేయడం సంస్థ ఎదుగుదలను 50 సంవత్సరాల పాటు వెనక్కి నెట్టింది. ఆర్ఎస్ఎస్ సంస్థ లోపల కూడా చాలా మంది నిరుత్సాహపడ్డారు. 1952 ఎన్నికలలో కాంగ్రెస్‌కి కమ్యూనిస్టు పార్టీయే ప్రధాన ప్రతి పక్షంగా ఉండింది. 1957 ఎన్నికలలో మరింత బలం పుంజుకుంది. కేరళలో ప్రభుత్వాన్ని ఏర్పరిచింది. నెహ్రూ కాలంలో కేంద్రంలో సోషలిస్టు విధానాలకు ప్రాధాన్యత లభించింది. ఆనాడు గోల్వాల్కర్, రెండురకాల నాయకత్వ లక్షణాలను ప్రదర్శించారు. సంస్థాగతంగా, సిద్ధాంత పరంగా. దానితో దాదాపు నీరుగారిపోయిన సంస్థకి పునరుత్తేజం కల్పించారు. ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా సంస్థను రూపొందించారు.

అంతకన్నా ముఖ్యమైనది, అనుబంధ సంస్థలు రూపొందించి, వాటన్నిటిని ఆర్ఎస్ఎస్ కుటుంబంలో భాగంగా చేయడం. వాటి వలనే ఈనాడు ఆర్ఎస్ఎస్ బలమైన సంస్థగా రూపొందింది. నిజానికి అప్పటికే అనుబంధ సంస్థలు ఆర్ఎస్ఎస్‌కి ఉన్నాయి. ఏబివిపి ఉంది. భారతీయ జనసంఘ్ ఉంది. 1977కి ఆర్ఎస్ఎస్ రకరకాల కర్తవ్యాలు గల 40 సంస్థలను స్థాపించుకుంది.

'హిందువులను సైనికీకరించడం' హిందుత్వ మితవాదుల కల. ఈనాడు మన దేశంలోనే కాదు, దక్షిణ ఆసియా అంతటిలో ఇటువంటి పరిస్థితులే ఉన్నాయి. మెజారిటీ శక్తులు ఒక మతానికి విధేయులుగా ఉంటున్నారు. లేదా ఒక జాతివారు అయి ఉంటున్నారు. వారే అధికారంలో ఉంటున్నారు. లక్షాలాది మంది యూదులను గ్యాస్ ఛాంబర్‌లలో కుక్కి కాల్చి చంపిన హిట్లర్ అభిమానులు అధికారంలో ఉండడం ఆశ్చర్యం కలిగిస్తుంది.

**(అనువాదం: ఉషారాణి)**

# గోత్రాలు, వాటి పుట్టుపూర్వోత్తరాలు

(2వ పేజీ తరువాయి)

లేక ఒక జంతువును గాని సేకరించడంలో, లేదా వేటాడటంలో ఆ కుదురు ప్రత్యేక మైన నైపుణ్యాన్ని సాధిస్తుంది. అలా ఆ కుదురు తను ప్రత్యేకంగా ఎంచుకున్న ఆహారపదార్థం చెట్టుగాని, మొక్క గాని, దుంప గాని, లేదా ఏదైనా జంతువు, పక్షి గాని ఆ కుదురుకు చిహ్నం అవుతుంది. ఆ కుదురుకు వారి కుదురు చిహ్నమైన ఆహార పదార్థంతో కేవలం భోజన – భోక్త సంబంధమే కాక అంతకుమించిన ఆధ్యాత్మ సంబంధం ఉందని భావిస్తారు. అది ఆ కుదురుకు ఆరాధ్యం అవుతుంది. దాని నుండి తాము వచ్చామని భావిస్తారు. ఇక అప్పటి నుండి దానిని తినటం పాపం అని అశుభం అని రకరకాల నిషేధాలు అమల్లోకి వస్తాయి. ఆ ఆహారాన్ని ఇకపై ఆ కుదురులోని వాళ్లు వేటాడటం కానీ సేకరించడం కానీ చేయటానికి వీలు లేదు. ఆహారం కుదురుకు చిహ్నం అవుతుంది.

ఇంకా కొంచెం వివరంగా తెలుసుకుందాం. ఒక తెగకు చెందిన ప్రతి వంశము ఒక జంతువు లేదా మొక్కతో చెలిమి లేదా కలయికను చేస్తుంది. దానినే చిహ్నం అంటారు. ఆ వంశం వారు ఆ జంతు వర్గానికి చెందిన వారుగా భావిస్తారు. ఆ జంతువు లేదా మొక్క నుండి ఆవిర్భవించినట్లుగా తల పోస్తారు. "సునక "వంశానికి చెందిన వారు తమను శునకాలు అనుకుంటారు. శునకాల నుండి వచ్చాము అనుకుంటారు. అందువల్ల ఈ శునకానికి చెందిన వారు శునకాన్ని తినటం నిషిద్ధం. ఎందుకంటే వారు ఆ చిహ్న (సునక) జాతి వారు కనుక.

వేదసాహిత్యంలో వేర్వేరు మానవ సమూహాలను కూడా జంతు నామాలతో పిలిచే సంప్రదాయం ఉన్నది. "ఆజులు"అనే పేరు గల మనుషులు మనకు ఋగ్వేదంలో తగులుతారు. అజ అంటే మేక. అలాగే మరో సమూహం ప్రజలను "సిగ్రులు" అని పిలిచారు. అంటే ములగ చెట్టు. అలాగే మత్స్య లు అంటే చేపలు, అనబడే ప్రజలు అదే రుగ్వేదంలో కనపడతారు. శతపథ బ్రాహ్మణం సృష్టికర్త ''కూర్మ'' రూపంలో కనపడ్డాడు అని ఉన్నది. అయిత రేయ బ్రాహ్మణంలో అలాగే అధర్వ వేదంలో కూడా "కశ్యప" గోత్రికులు అయిన పురోహితులు కనపడతారు. కశ్యప అంటే "కూర్మ"మే. అంటే తాబేలు.

అలాగే కౌటిల్యుని అర్థశాస్త్రం "శునకాల"ని పేరు ఉన్న మనుషుల గురించి చెబుతుంది."హరివంశంలో"ఒక అధ్యాయానికి అధ్యాయమే ఒక ప్రసిద్ధ వంశ వృక్షాన్ని వర్ణిస్తుంది. ఆ వంశం పేరు "శునక వంశం". మహాభారతం యాదవులలో ఒక తెగను శు నకాలు అన్నది. అదే ఇతిహాసం మరో రెండు చోట్ల "శునకాలు" అనే పేరు గల మానవ సమూహలను పేర్కొంటుంది. భీష్మపర్వంలోనూ, సభాపర్వంలోనూ ఇవి మనకు లభిస్తాయి. అదే మహాభారతంలో మానవ సమూహాలకు జంతువుల పేర్లున్నట్లుగా పేర్కొంటుంది. ఉ దాహరణకు ఉలుక, వృచ్ఛిక, వాయస, జంబూక, గార్దభ, కుక్కుట, గజ, శశ, కూర్మ, వరాహ, మేష, వ్యాఘ్ర, హంస, మత్స్య, అశ్వ. ఇవన్నీ ఆయా సమూహాల కుదురు చిహ్నాలే.

ఈ చిహ్న పద్ధతి, జంతు వృక్ష నామాలు ఒక్క మానవ సమూహాలుక పరిమితమై లేదు. విస్తారంగా ఉన్న వేద సాహిత్యం భాగాలకు, శాఖలకు కూడా బాగా పరిచితమైన జంతు నామాలున్నాయి. ఉదాహరణకు ఋగ్వేద సంహిత లో నాలుగు "శాఖలు" ఉన్నాయి. అశ్వలాయన, వాస్కల, సాంఖ్యాయన, మాండూక్య ఈ చివరి పేరు మాండూక్య అంటే కప్ప. మిగతా మూడు కూడా ఇదేవిధంగా జంతువు లేదా వృక్ష మూలమునుండి వచ్చినవే.

సామవేద సంహిత్యానికి సహస్ర శాఖలున్నాయి అని పురాణాలు చెబుతాయి. అందులోనే ఏడు శాఖల పేర్లు కౌథూమ, సత్యముగ్ర రాన్యాయన, కపోల, మహా పోకల, లాంగులిక, శార్దూలీయ .చివరిది శార్దూలము అంటే పులి నుంచి వచ్చిన పేరే. మిగిలినవి కూడా జంతు మూలాలే అయి ఉండాలి.

కృష్ణ యజుర్వేద సంహిత లోని ప్రసిద్ధ శాఖలలో ఒకదాని పేరు తైత్తరీయ సంహిత. తైత్తరీయ అంటే ఒక జాతి పక్షి (తిత్తిర) నుండి వచ్చిన పేరు. మిగిలిన శాఖల లోని ఉపశాఖల పేర్లు ఆసక్తికరంగా ఉంటాయి. అవి మానవ, వరాహ, చాగలేయ, హరద్రవీయ, దుందుభ, శ్యామాయనీయ. మొదటి మూడు పేర్లు వరుసగా మనిషి వరాహం అంటే పంది, మేకల నుండి వచ్చాయి.

అలాగే అధర్వవేద సంహితలో లభించే శాఖల పేర్లు"పైప్పలాద" "బ్రహ్మ పాలస" "శౌనక" వీటిలో మొదటి పేరు పిప్పల ఫలం మీద ఆధారపడి జీవించిన పక్షి నామం నుండి వచ్చినది. శౌనక మూలం శునకం అంటే కుక్క ఇలా వేద సంహిత శాఖల పేర్లలో అనేక జంతువుల నుంచో వృక్షాన్నుంచో సాధించిన పేర్లే.

అంతేకాదు కొన్ని ప్రధానమైన ఉ పనిషత్తులకు కూడా జంతు నామాలున్నాయి. ఉదాహరణకు శ్వేతాశ్వతర ఉపనిషత్ (అశ్వం లేదా గుర్రం), మాండూక్యోపనిషత్ (మండూక అంటే కప్ప), కౌశితకి ఉపనిషత్ (కౌశితకీ అంటే గుడ్లగూబ), తైత్తిరీయ ఉపనిషత్తు (తైత్తరీయ అంటే తీత్తిరి పక్షి) చాగలేయ అంటే మేక. ఇలా జంతు వృక్ష నామాలు మానవ సమూహాలకే కాక వేద సాహిత్యం శాఖలకు కూడా ఉండటాన్ని బట్టి ఇవన్నీ కుదురు చిహ్నాలనిగుర్తించవచ్చు.

❋


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్: 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 18, issue : 7 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# పేదలపై సంక్షోభ భారం, కుబేరులపై కనక వర్షం




కరోనా మహమ్మారి, ఆర్థిక సంక్షోభం, ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల భారత దేశ ప్రజానీకం ఈ ఏడాది ఎన్ని బాధలు పడుతున్నా మోడీ ప్రభుత్వ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం దేశంలోని ధనవంతులకు మాత్రం బంగారు పంట పండిస్తోందని సాక్షాత్తూ ఫోర్బ్స్ పత్రిక తెలిపింది. మోడీ అధికారంలో వచ్చిన తరువాత కోట్లకు పడగలెత్తినా ఆయన కార్పొరేట్ మిత్రుడు గౌతమ్ అదానీ ఆస్తులు ఈ ఏడాది ఎంతగా పెరిగాయంటే ఆయన ఈ భూమ్మీద అత్యధిక ధనవంతుల్లో రెండో స్థానం ఆక్రమించారు. అంతే కాదు బిజెపి ప్రభుత్వ హయాంలో 2022లో దేశంలోని 100 మంది అత్యంత ధనికులు మరింత ధనవంతులైనారని ఫోర్బ్స్ పత్రిక వివరాలతో సహా నవంబర్ సంచికలో వివరాలు ఇచ్చింది.

భారత దేశంలోని అత్యంత ధనికుల ఆస్తుల్లో 30 శాతం గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీలవద్ద పోగుపడ్డాయని పత్రిక తెలిపింది. పత్రిక ఇంకా ఇలా తెలిపింది:

భారత దేశంలోని అత్యధిక 100 మంది ధనికుల ఆస్తి 2022లో 2 లక్షల కోట్ల రూపాయలు పెరిగి మొత్తం రూ. 65 లక్షల కోట్లకు చేరుకున్నది. దేశంలోని టాప్ 10 మంది ధనికుల ఆస్తి రూ, 31.70 లక్షల కోట్లకు చేరుకుంది.

2021లో గౌతమ్ అదానీ ఆస్తి మూడు రెట్లు పెరిగి క్రమంగా ఆయన దేశంలో అత్యధిక ధనవంతుడైనాడు. 2022లో ఆయన ఆస్తి రెట్టింపై 12.3 లక్షల కోట్ల రూపాయలకు చేరింది.

దేశంలో రెండవ అతిపెద్ద ధనవంతులైన ముఖేశ్ అంబానీ ఆస్తి విలువ 7.21 లక్షల కోట్ల రూపాయలు. గతేడాదికన్నా ఈయన ఆస్తి విలువ 5 శాతం తగ్గింది.

డిమార్ట్ సూపర్‌మార్కెట్ చైన్ యజమాని రాధాకృష్ణ దాల్మియా రూ. 1.76 లక్షల కోట్లతో ధనవంతుల లిస్టులో మూడో స్థానంలోనూ, జిందాల్ గ్రూప్ చైర్‌పెర్సన్ సావిత్రి జిందాల్ రూ. 1.34 లక్షల కోట్లతో నాల్గవ స్థానంలోనూ ఉన్నారు. బజాజ్ కుటుంబం ఈ జాబితాలో పదో స్థానంలో ఉంది.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ. 15,** సంవత్సర చందా:**రూ. 150,** పోస్టు ద్వారా **రూ. 180** పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు..........................................
వీధి..........................................
గ్రామం..........................................
మండలం లేదా పట్టణం..........................................
జిల్లా..........................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao,